
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 299

శనివారం 20-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సింగిల్స్ చాంపియన్ శ్రీజ

అమెరికాలో జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ టోర్నీలో విజేతగా నిలిచిన తెలంగాణ అమ్మాయి. -IIIలో



3 రోజుల నష్టాలకు చెక్

సెన్సెక్స్ లాభం 496 పాయింట్లు.. 21,600 స్థాయి పైకి నిఫ్టీ -IIIలో

SAMSUNG

Galaxy S24 Ultra

Galaxy AI is here



Get the power of AI at ₹ 49999*

Retail price of S24 Ultra (512GB)	₹ 139999#
Exchange value of old device	₹ 68000~
Additional upgrade bonus	₹ 12000^
Memory upgrade benefit	₹ 10000^^
Effective price	**₹ 49999***

Memory upgrade 256GB to 512GB | Samsung Upgrade | Samsung Finance+™ Up to 11 months no cost EMI** | HDFC BANK

Pre-book offer valid till Jan 30, 2024

samsung.com

Please dispose of e-waste and plastic waste responsibly. Customers can Whatsapp on 1800 5 7267864 for information on e-waste/plastic pick up.

Image simulated for representational purpose, actual may vary. Samsung account login is required for certain AI features. *T&C apply. Offer price shown for 1 Unit of Galaxy S24 Ultra 12GB | 512GB inclusive of exchange value of old device, additional upgrade bonus and memory upgrade benefit as detailed further below. Final pricing subject to dealer discretion. #Retail price of 1 Unit of Galaxy S24 Ultra 12GB | 512GB. Price inclusive of taxes. ~Approximate value on exchange of 1 Unit of Galaxy S23 Ultra 12GB | 512GB. Exchange value varies basis model & condition of old device. Exchange at the sole discretion of dealer. ^Additional upgrade bonus as per Samsung Upgrade program, provided by brand/dealer at their sole discretion upon exchange of select devices. ^^Value of memory upgrade benefit from 256GB to 512GB. **Eligibility for EMI at the sole discretion of the financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies). Samsung disclaims any liabilities with the same. HDFC Bank cashback of ₹ 5000 provided at sole discretion of HDFC Bank. In case if any customer avails HDFC Bank cashback, the additional upgrade bonus (as above) shall be limited to ₹ 5000 only. Offers may be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company.

Scan and experience Galaxy AI

Or WhatsApp "Hi" to 9870 494949 to pre-book at Samsung Exclusive Store

Cheil-18715/24

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 299



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పెత్తందారీ పోకడలూ
అంటరానితనమే



'సామాజిక సమతా సంకల్ప సభ'లో ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

“ ఎన్నటికీ మరణం లేని మహనీయుడు అంబేడ్కర్‌ను తలుచుకుంటూ తరతరాలుగా స్ఫూర్తి పొందుతున్నాం. అభివృద్ధి-అభ్యుదయానికి మధ్య అవినాభావ సంబంధం అంబేడ్కర్ భావజాలం. మనం అదే భావజాలంతో పని చేస్తుంటే రాష్ట్రంలో పెత్తందార్ల పార్టీలకు, పెత్తందార్ల నాయకులకు నచ్చట్లేదు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ, నా అగ్రవర్ణ పేదలకు మంచి చేయాలనే సామాజిక న్యాయ విప్లవం తెచ్చానని చెప్పేందుకు గర్విస్తున్నా

- ముఖ్యమంత్రి జగన్

కుల అహంకార వ్యవస్థలపై నా పోరాటానికి అంబేడ్కరే స్ఫూర్తి: సామాజిక సమతా సంకల్ప సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- 77 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత కూడా వివక్ష ఇంకా సమసి పోలేదు
- రూపం మార్చి.. బరి తెగించిన దురహంకారులు పెత్తందారులు
- పేద కులాలు ఎప్పటికీ తమ పనివారుగా, సేవకులుగానే ఉండాలట
- చివరికి చరిత్రను కూడా వక్రీకరిస్తూ ఈనాడు దారుణమైన రాతలు
- తెలుగు మీడియమే ఉండాలని అంబేడ్కర్ అన్నట్టు పెత్తందార్ల పత్రిక వక్రీకరణలు
- వారు పాటించే అంటరానితనానికి అబద్ధాలతో అందమైన మేకప్
- పేదల చదువులు, ఇళ్లను అడ్డుకుంటున్న దుర్మార్గులు
- మన 56 నెలల పాలనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం
- మీ బిడ్డ ప్రభుత్వం గ్రామ గ్రామాన మార్పు తీసుకొచ్చింది

10 లో

206 అడుగుల ఎత్తుతో ఘనంగా 'సామాజిక న్యాయ మహా శిల్పం' ఆవిష్కరణ



ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం

బాలరాముడి తొలి దర్శనం



అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు రెండు రోజులే మిగిలి ఉంది. ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. గర్భగుడిలో శ్రీరాముడి దర్శనం కోసం భక్తులు ఎదురు చూస్తున్నారు. అయితే, ప్రాణప్రతిష్ఠ కంటే ముందే రామ్‌లల్లా విగ్రహం చిత్రాలు బయటకు వచ్చాయి.

6 లో

'సుప్రీం'కు జస్టిస్ వరాలె



కర్ణాటక హైకోర్టు సీజే జస్టిస్ ప్రసన్న బి వరాలెను సుప్రీంకోర్టు జడ్జిగా నియమించాలంటూ కొలీజియం సిఫారసు చేసింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలో కొలీజియం సమావేశం జరిగింది. ఇందులో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బోస్ పాల్గొన్నారు.

6 లో



రా.. కదలిరా సభకు తీసుకువెళ్తున్నారు!

అద్భుత శిల్పం.. జాతికి అంకితం

- అంబర చుంబనం.. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆవిష్కరణ సంబరం
- విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం
- ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- వందలాది డ్రోన్లతో ఆకాశంలో అద్భుత విన్యాసాలు.. మిరుమిట్లు గొలిపిన లేజర్ షో
- విజయానికి చిహ్నంగా కళ్లు చెదిరేలా బాణసంచా వెలుగులు
- రాష్ట్రం నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

11 లో

రామోజీ నీ రాతలు నీచం.. జాలేస్తోంది

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణని చూసి ఓర్వలేకపోతున్న ఎల్లో మీడియా
- మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం
- దళితులను అణచివేసిన చంద్రబాబుకు రామోజీ బ్రోకర్
- దళితులకు మేలు చేయటం రామోజీ, బాబు, రాధాకృష్ణలకు నచ్చదు : ఎంపీ నందిగం సురేష్
- ఈనాడు అధిపతికి ప్రజలే బుద్ధి చెప్తారు: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ఈనాడు ప్రతులను తగలబెట్టిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

11 లో

రాష్ట్రంలో మరో చారిత్రక ఘట్టానికి శ్రీకారం

- రాష్ట్రమంతటా కులగణన మొదలు
- తొలిరోజు 14,334 సచివాలయాల పరిధిలో మొదలైన ప్రక్రియ
- 5,34,160 కుటుంబాల వివరాలు యాప్‌లో నమోదు
- ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్న సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు

- వివరాలు 2లో



రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘోర ప్రమాదం

విస్టెక్స్ ఏషియా సీఈఓ సంజయ్ షా దుర్మరణం

- సంస్థ ప్రెసిడెంట్‌కు తీవ్ర గాయాలు; పరిస్థితి విషమం
- సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం ఫిల్మ్ సిటీని బుక్ చేసిన విస్టెక్స్ సంస్థ
- లైమ్ లైట్ గార్డెన్‌లో గురువారం రాత్రి నిర్వహణ.. సరైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- 20 అడుగుల నుంచి ఇద్దరూ కిందకు దిగుతుండగా తెగిన ప్లాట్‌ఫామ్ తాడు
- అంబులెన్స్‌లు లేక ఆస్పత్రికి తరలించడంలో తీవ్ర జాప్యం.. ప్రాణాలు కోల్పోయిన ప్రవాస భారతీయుడు
- ఆర్‌ఎఫ్‌సీ మేనేజ్‌మెంట్, ఇతరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు

12 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పిల్లల చదువులకు సర్కారు భరోసా



మా అమ్మాయి రెండేళ్లుగా కువైట్‌లో ఉంటోంది. అల్లుడు వేరే ప్రాంతంలో పని చేసుకుంటున్నాడు. వారి పిల్లలు నలుగురూ పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని అచ్చుగట్ల పాలెంలో నా వద్దే ఉంటారు. పిల్లలను చదివించాలనేది మా కోరిక. నాలుగిళ్లలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నాకు వారిని చదివించేంత ఆర్థిక స్తోమత లేదు. అయినా వారికి పుట్టిన తేదీ సర్టిఫికేట్, ఆధార్ కార్డులు లేవు. అందువల్ల ఏ పథకమూ రాకపోవడంతో పిల్లలు చదువు మానేసి ఇంటి వద్దే ఉండేవారు. మా వార్డు వలంటీర్ లావణ్య వచ్చి పిల్లలను చదివిస్తే అమ్మ ఒడి పథకం వస్తుందనీ, ప్రభుత్వమే మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు అన్నీ ఇస్తుందని చెప్పడంతో ఆధార్ విషయం వలంటీర్‌కు చెప్పాను. ఆమె సహకారంతో మా మనవళ్ల పుట్టినరోజు సర్టిఫికెట్లు, ఆధార్‌లు అన్నీ వచ్చాయి. మా పెద్ద మనవరాలు రిబకను మూడో తరగతిలో చేర్పించా. అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు వంతున వస్తోంది. మనవడిని కూడా పాఠశాలకు పంపిస్తున్నా. నాకు చదువుపై పెద్దగా అవగాహన లేకపోయినా జగనన్న అందిస్తున్న ప్రోత్సాహంతో నా మనవళ్లను చదివించుకుంటున్నా. మిగిలిన ఇద్దరు మనవళ్లను కూడా పాఠశాలకు పంపించి చదివిస్తాను. నాకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 వంతున ఇప్పటి వరకు రూ.56,250 అందింది. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకం కూడా వర్తించింది. ప్రతి నెలా వితంతు పింఛన్ అందుతోంది. ఇప్పుడు నా జీవనానికే కాదు.. పిల్లల చదువులకు కూడా ఇబ్బంది లేదు.

– కవురు వెంకటలక్ష్మి, అచ్చుగట్లపాలెం, పాలకొల్లు
(తోట రాంబాబు, విలేకరి, పాలకొల్లు సెంట్రల్)

పింఛన్‌తో ఆర్థిక కష్టాలు తప్పాయి



మాది నిరుపేద కుటుంబం. విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో చిన్న ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. ప్రైవేటు దుకాణంలో పనిచేస్తూ చాలీచాలని జీతంతో గుట్టుగా కాపురం చేసుకుంటున్నాం. నా భార్య సావిత్రి టైలరింగ్ చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. నాకు ఒక కుమారుడు. వాడి చదువు ఇంకా పూర్తి కాలేదు. మాకు వచ్చే ఆదాయం సరిపోక పరిస్థితి దయనీయంగా తయారైంది. నాలుగేళ్ల క్రితం వృద్ధాప్య పెన్షన్‌కు అర్హత ఉందని ఇంటికి వచ్చిన వలంటీర్ చెప్పాడు. వెంటనే దరఖాస్తు చేసుకోగా ఎవ్వరి చుట్టూ తిరగకుండానే పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఆ మొత్తాన్ని అందిస్తున్నాడు. సరైన సమయంలో పెన్షన్ మంజూరు కావడంతో కొంత వరకు ఆర్థిక కష్టాలు తీరాయి. నా భార్యకు రెండేళ్ల నుంచి జగనన్న చేదోడు పథకం కింద ఏటా పది వేల రూపాయలు వస్తోంది. జగనన్న కాలనీలో ఇంటి స్థలం కూడా మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఇల్లు కూడా కట్టుకుంటాం.

– బత్తుల సూర్యారావు, విజయనగరం
(గొట్టాపు త్రినాథరావు, విలేకరి, విజయనగరం అర్బన్)

ఒంటరి జీవితానికి ఓ గూడు దొరికింది



నాకు ఇద్దరు కుమార్తెలు. నా భర్త దేముడు 12 ఏళ్ల క్రితం మరణించాడు. ఇద్దరి కుమార్తెల బాధ్యత నాపై పడింది. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం చౌడువాడలో అప్పటికి ఉన్న ఇంటిని అమ్మేసి ఇద్దరు కుమార్తెల పెళ్లి చేశాను. ఆ తర్వాత ఒంటరిగా మిగిలాను. నాకు గ్రామంలో ఇల్లు లేదు. ఈ జన్మకు సొంతిల్లు కట్టుకుంటానని అసలు ఊహించలేదు. సుమారు ఏడేళ్లుగా అద్దె ఇంట్లోనే తలదాచుకున్నా. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ నా వద్ద నుంచి దరఖాస్తు తీసుకున్నాడు. గ్రామంలో జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేశారు. దీంతో పాటు ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందించింది. సబ్సిడీ ధరలకు నిర్మాణ సామగ్రి అందించారు. కుమార్తెలు ఇద్దరు కూడా సహకరించడంతో ఇంటి నిర్మాణం పూర్తయింది. సీఎం జగన్ దయ వల్ల సొంతింటి కల నెరవేరింది. కొత్తగా కట్టుకున్న ఇంటిలోనే ఇప్పుడు నివాసం ఉంటున్నాను. ఈ ప్రభుత్వం వచ్చాకే వితంతు పింఛన్ మంజూరై నెలనెలా క్రమం తప్పకుండా వస్తోంది. ఇప్పుడు నా జీవనానికి ఎలాంటి ఢోకా లేదు.

– మోసూరి నాగమ్మ, చౌడువాడ
(సురభి ఎస్.జి.వి.సత్యనారాయణ, విలేకరి, కె.కోటపాడు)

పింఛన్లపై ◆ వంచన రాతలెందుకు?

సీఎం వైఎస్ జగన్ పాలన పెన్షన్ లబ్ధిదారులందరికీ రామరాజ్యమే

చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలతో లబ్ధిదారులకు అష్టకష్టాలు



- అప్పట్లో నడవలేని స్థితిలో వృద్ధులు, దివ్యాంగులు క్యూలైన్లలో గంటలకొద్దీ నిరీక్షణ
- ఆ రోజులే స్వర్ణయుగంగా ఈనాడుకు కనబడిందా?
- ఒక ఇంటికి ఒకే పెన్షన్ అంటూ ఆదేశాలిచ్చిందే బాబు ప్రభుత్వం
- కానీ, రెండేసి పెన్షన్లు మంజూరు చేసినట్లు ఈనాడు పచ్చి అబద్ధాలు
- జగన్ పాలనలో వలంటీర్లు ఠంఛన్‌గా 1న ఇంటి వద్దే పంపిణీ
- సంతృప్త స్థాయిలో అర్హులందరికీ ఎప్పటికప్పుడే పెన్షన్లు మంజూరు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కొత్తగా రూ.10 వేల చొప్పున మంజూరు
- గత 55 నెలల్లో 29.51 లక్షల మందికి పెన్షన్లు మంజూరు
- అయినా.. జగన్ విధానాలన్నీ బూటకమంటూ రామోజీ ఏడుపు


ఇదేనా స్వర్ణయుగమంటే..

ఈనాడు: గత తెలుగుదేశం ప్రభుత్వంలో సామాజిక భద్రత పింఛను లబ్ధిదారులకు స్వర్ణయుగమే..

వాస్తవం: 2014లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయే సమయానికి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 43.11 లక్షల పెన్షన్ లబ్ధిదారులుండేవారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెల్ల ముందు కూడా రాష్ట్రంలో కేవలం 39 లక్షల మంది లబ్ధిదారులు మాత్రమే ప్రతినెలా పెన్షన్ తీసుకునేవారు. కానీ, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత 55 నెలల్లో ఏకంగా 29,51,760 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసింది.

ఈనాడు: టీడీపీ ప్రభుత్వంలో ఒకే కుటుంబంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు.. ఇలా కేటగిరీ పింఛన్లు ఒకే ఇంటిలో రెండు ఉన్నా.. అందరికీ ఇచ్చారు..

వాస్తవం: 2014లో చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే పెన్షన్ పొందేందుకు అర్హులు..' అంటూ అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు 2014 సెప్టెంబరు 18న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయం అన్ని జిల్లాల కలెక్టర్లకు జారీచేసిన ఆర్‌సీ నెంబరు 1053 ఆదేశాలే సాక్ష్యం. వీటి ప్రకారం.. కేవలం 80 శాతానికి పైగా అంగవైకల్యం ఉండే వారికి మాత్రమే రెండో పెన్షన్ మంజూరు చేస్తామని ఆ ఆదేశాల్లో పేర్కొంది. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగుల కేటగిరీలో పెన్షన్లు పొందే అందరికీ, రెండో పెన్షన్ మంజూరుకు వీలు కల్పించడంతో పాటు కొత్తగా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు, అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కూడా రెండో పెన్షన్ మంజూరుకు వీలు కల్పించారు. ఇలా వైఎస్ జగన్ ప్రభుత్వం కొత్తగా కల్పించిన వెసులుబాట్లతో రాష్ట్రంలో 3,53,645 మంది ఒకే ఇంట్లో రెండో పెన్షన్ కూడా పొందుతున్నారు.


Society for Elimination of Rural Poverty – Andhra Pradesh
RC.No.1053/SERP-SSP/2014
Are multiple pensions are allowed in a family?

చంద్రబాబు పాలనలో కుటుంబంలోని ఒకరికే పింఛను అని 2014, సెప్టెంబర్ 18వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (RD.I) DEPARTMENT
One pension will be allowed in the family except in the following conditions

సీఎం వైఎస్ జగన్ పాలనలో ఒక కుటుంబంలో దివ్యాంగులు, ఎయిడ్స్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎంత మంది ఉన్నా అందరికీ పింఛన్లు ఇచ్చేలా 2019, డిసెంబర్ 13న జారీ చేసిన ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: అవ్వాతాతలు, దివ్యాంగులు సహా ఇతర సామాజిక భద్రతా పెన్షన్ లబ్ధిదారులందరికీ రామరాజ్యమంటే ఏంటో.. సంక్షేమ శకం తీపిగుర్తులు ఎలా ఉంటాయో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారికి తెలిసేలా చేసింది. చంద్రబాబు సీఎంగా ఉన్నరోజుల్లో వాళ్లు పడ్డ కష్టాలన్నీ ఇప్పుడు పటాపంచలై వాళ్లు వాటిని దాదాపు మరిచిపోయేలా కూడా చేశారు. కానీ.. ఆ జన్మభూమి కమిటీల ఆగడాలతో అప్పట్లో ఐదేళ్లపాటు అవ్వాతాతలు, దివ్యాంగులు సహా ఇతర సామాజిక భద్రతా పెన్షన్ లబ్ధిదారులందరూ అనుభవించిన అష్టకష్టాలే ఇంకా ఇంకా అనుభవిస్తూ ఉండాలని రామోజీరావు కోరుకుంటున్నట్లు ఉంది ఈనాడు రాతలు చూస్తే. ఎందుకంటే.. 'జగన్ వచ్చె.. పింఛను తుంచె..' అంటూ ఆ పత్రిక పెట్టిన పెడబొబ్బలు అంతాఇంతా కాదు. నెలనెలా ఠంఛనుగా ఒకటో తేదీన తెల్లవారుజాము నుంచే ఇంటికే వెళ్లి ఇస్తున్నా.. చెప్పినట్లుగా ఏటా పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లినా.. సంతృప్త స్థాయిలో పెన్షన్లు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నా నిలువెల్లా విషం నింపుకున్న రామోజీ తనను తాను వంచన చేసుకుంటూ ఏడుపుగొట్టు రాతలు రాస్తున్నారంటే ఆయన్ను ఏమనాలి? ఈనాడు వండివార్చిన విషపూరిత కథనంలోని అంశాలపై 'ఫ్యాక్ట్‌చెక్'..

కేటగిరీ	2018 డిసెంబరులో ఒక్కో లబ్ధిదారునికి టీడీపీ ఇచ్చిన పెన్షన్	జగన్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్
వృద్ధులు	రూ.1,000	రూ.3,000
వితంతు, ఒంటరి మహిళలు	రూ.1,000	రూ.3,000
కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఎయిడ్స్ రోగులు	రూ.1,000	రూ.3,000
దివ్యాంగులు (40-80శాతం మధ్య)	రూ.1,000	రూ.3,000
దివ్యాంగులు (80శాతం పైగా)	రూ.1,500	రూ.3,000
ట్రాన్స్‌జెండర్లు	రూ.1,500	రూ.3,000
డప్పు కళాకారులు, చర్మకారులు	రూ.1,500	రూ.3,000
కిడ్నీ రోగులు (డయాలసిస్ చేయించుకునేవారు)	రూ.2,500	రూ.10,000
కుష్టు వ్యాధిగ్రస్తులు	ఇవ్వలేదు	రూ.3,000
పక్షవాతం రోగులు	ఇవ్వలేదు	రూ.5,000
కిడ్నీ, లివర్, గుండె మార్పిడి, కండరాల సమస్య రోగులు	ఇవ్వలేదు	రూ.5,000
ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులు	ఇవ్వలేదు	రూ.5,000
సికిల్‌సెల్ రోగులు	ఇవ్వలేదు	రూ.10,000
తలసేమియా	ఇవ్వలేదు	రూ.10,000
తీవ్ర రక్తహీనత రోగులు	ఇవ్వలేదు	రూ.10,000

జగన్ ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ కనీస అర్హత వయస్సు తగ్గింపు కారణంగా కలిగిన ప్రయోజనం




వృద్ధాప్య పెన్షన్లు	టీడీపీ ప్రభుత్వంలో	జగన్ ప్రభుత్వంలో..
కనీస అర్హత వయస్సు	65 ఏళ్లు	60 ఏళ్లు
సాధారణ వృద్ధాప్య పెన్షన్లు	18,29465 మందికి	34,53,489 మందికి
ఎస్టీ కేటగిరీలో వృద్ధాప్య పెన్షన్లు	1,04,238 మందికి	2,46,057 మందికి

నాడు, నేడు పెన్షన్ల స్వరూపం

అంశం	2019 ఎన్నికలకు 6 నెలల ముందు పరిస్థితి	ప్రస్తుత పరిస్థితి
నెలనెలా ఇచ్చే పెన్షన్ మొత్తం	రూ.1,000	రూ.3,000
పెన్షన్ తీసుకున్న లబ్ధిదారులు	39 లక్షల మంది	66.34 లక్షల మంది
లబ్ధిదారులకు పంపిణీ చేసిన మొత్తం (నెలకు)	రూ. 507 కోట్లు	రూ.1,968 కోట్లు
పెన్షన్లకు ఖర్చుచేసిన మొత్తం	రూ. 27,687 కోట్లు (టీడీపీ ఐదేళ్ల కాలంలో)	రూ. 83,526 కోట్లు (జగన్ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లలో)

'జన్మభూమి' పేరు వింటేనే హడల్

చంద్రబాబు పాలనలో ప్రతి పెన్షన్ లబ్ధిదారుడికీ జన్మభూమి కమిటీ పేరు గుర్తుకొస్తేనే వణికిపోయే పరిస్థితి. అప్పట్లో నెలనెలా తమ పెన్షన్ డబ్బులు తీసుకోవాలంటే నడవలేని, నిలబడలేని స్థితిలో కూడా చాంతాడంత క్యూలలో ఎర్రటి ఎండలో గంటల తరబడి నిరీక్షించిన రోజులను ఊహించుకుంటేనే వారు బెంబేలెత్తిపోతున్నారు. పైగా.. బాబు పాలనలో అన్నీ అర్హతలున్న వాళ్లు పెన్షన్ కావాలంటే ఏడాదికో, లేదంటే రెండేళ్లకో సారో మొక్కుబడిగా ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ఆ దరఖాస్తులు మండలాఫీసుల్లో కుప్పలపాలయ్యేవి. పెన్షన్లు తీసుకుంటున్న వారు ఎవరైనా మరణిస్తేనో లేదా ఇతర కారణాలతో తగ్గితేనే కొత్త పెన్షన్లు మంజూరయ్యేవి. ఆ దరఖాస్తుల దుమ్ము దులిపిన దాఖలాల్లేవు. ఎమ్మెల్యేని అడిగినా దిక్కూమొక్కూలేని పరిస్థితి.



నాడు-నేడు పెన్షన్ల మంజూరు, పంపిణీ తీరు

అంశం	టీడీపీ ప్రభుత్వంలో	జగన్ ప్రభుత్వంలో
పంపిణీ చేసే విధానం	గ్రామ పంచాయతీ, వార్డు ఆఫీసుల్లో	వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే
నెలనెలా పంపిణీ చేసే ఉద్యోగులు	16,735 మంది పంచాయతీ కార్యదర్శులు లేదా బిల్‌కలెక్టర్లు	2.60 లక్షల మంది వలంటీర్లు
ఒక్కో ఉద్యోగి నెలలో సగటున పంపిణీ చేయాల్సిన వారి సంఖ్య	321 మందికి	25మంది లోపే..
వృద్ధాప్య పెన్షన్ అర్హత వయస్సు	కనీసం 65 ఏళ్లు	కనీసం 60 ఏళ్లకే
మంజూరు చేసే విధానం	జన్మభూమి కమిటీల సభ్యుల అవినీతి, పక్షపాతం, వివక్ష	అవినీతికి ఆస్కారమే లేకుండా సంతృప్తస్థాయిలో అర్హులందరికీ
వ్యవసాయ భూమి అర్హత	మాగాణి రెండున్నర ఎకరాల్లోపు, మెట్ట 5 ఎకరాల్లోపు	మాగాణి, మెట్ట కలిపి పది ఎకరాల లోపు
కుటుంబ ఆదాయం అర్హత	గ్రామాల్లో రూ.5 వేల లోపు, పట్టణాల్లో ఆరువేల లోపు	గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు

సీఎం జగన్ పాలనలో.. సంతృప్త స్థాయిలో..



అదే ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మొదటి నుంచీ (గత నాలుగున్నర ఏళ్లకు పైగా) సంతృప్త స్థాయిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఇంటికి వలంటీరే స్వయంగా వెళ్లి పింఛను దరఖాస్తు తీసుకుని మంజూరు కాగానే తిరిగి లబ్ధిదారుడు ఇంటికే వచ్చి మంజూరు పత్రం అందజేస్తున్నారు. ఎక్కడన్నా ఏదైనా కారణంతో అర్హత ఉండీ పెన్షన్ మంజూరు కాకపోతే.. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక డ్రైవ్ ద్వారా వారికి పెన్షన్లు మంజూరు చేసే విధానాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అమలుచేస్తోంది. కానీ, చంద్రబాబు హయాంలో పెన్షన్ లబ్ధిదారులు ఎన్ని ఇబ్బందులుపడ్డా 'ఈనాడు' మాత్రం చంద్రబాబు జమానాను స్వర్ణయుగం అని కీర్తిస్తోంది. అలాగే, అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర చేతి వృత్తిదారులపట్ల పూర్తి మానవత్వంతో పెన్షన్ల మంజూరు నుంచి ప్రతినెలా ఠంఛన్‌గా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటివద్దే పంపిణీకి జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు 'ఈనాడు'కు బూటకపు విధానాలుగా కనిపిస్తుంటే దానిని 'కళ్లుండీ చూడలేని కబోదీ' అనే అనుకోవాలి.

యోగి వేమనకు సీఎం జగన్ నివాళి

సాక్షి, అమరావతి: యోగి వేమన జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి సీఎం వైఎస్ జగన్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్

చంద్రబాబు విమర్శలు అనైతికం: చెవిరెడ్డి

సాక్షి, అమరావతి: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను, ఆచారాలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నివాసంలో, తను నిర్మించుకున్న గోశాలలో సొంతంగా సంక్రాంతి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తే చంద్రబాబు అనైతిక విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మండిపడ్డారు. అనేక సంవత్సరాలుగా సీఎం తన నివాసంలోని గోశాలలో ఉగాది, సంక్రాంతి వేడుకలను తెలుగు సంప్రదాయాలకు అద్దం పట్టేలా చేపడుతున్నారని శుక్రవారం ఇక్కడ తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, భగవంతుడి ఆశీస్సులు అందరికీ లభించాలనే ముఖ్యమంత్రి సతీసమేతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. సత్సంకల్పంతో సీఎం సొంతంగా చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను సైతం వక్రీకరిస్తూ ప్రభుత్వ ధనంతో చేస్తున్నారనడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. ప్రతిదీ రాజకీయం చేయాలనే దురుద్దేశంతోనే చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని చెవిరెడ్డి విమర్శించారు.

25 నుంచి 31 వరకు ఈ-ఆఫీస్‌లు పనిచేయవు

ప్రస్తుత వెర్షన్ నుంచి కొత్త వెర్షన్‌కు మార్పు ● సీఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ స్థాయి నుంచి సచివాలయ శాఖలు, శాఖాధిపతులు, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు, రాష్ట్ర యూనిట్లు, జిల్లా ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో ఈ-ఆఫీస్‌లను ప్రస్తుత వెర్షన్ నుంచి కొత్త వెర్షన్‌కు మార్పు చేస్తున్నారు. అందువల్ల ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు ప్రస్తుత పాత వెర్షన్‌లోని ఈ-ఆఫీస్‌లు పనిచేయబోవని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఆరు రోజుల్లో కార్యాలయాల్లో కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. కొత్త వెర్షన్ ఈ-ఆఫీస్‌లు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. అప్పటి వరకు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎస్ సూచించారు. కొత్త వెర్షన్‌పై ఈ నెల 23, 24 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయి నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల వరకు మాస్టర్ శిక్షకులను డెవలప్ చేయనున్నట్లు ఐటీ శాఖ పేర్కొంది. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో మాస్టర్ శిక్షకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపింది. సచివాలయ శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాల నుంచి మాస్టర్ శిక్షణకు సిబ్బందిని పంపాలని ఐటీ శాఖ సూచించింది.

రాష్ట్రంలో మరో చారిత్రక ఘట్టానికి శ్రీకారం

రాష్ట్రమంతటా కులగణన మొదలు

- తొలిరోజు 14,334 సచివాలయాల పరిధిలో మొదలైన ప్రక్రియ... 5,34,160 కుటుంబాల వివరాలు యాప్‌లో నమోదు
- ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్న సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు



ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలో కులగణన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో పార్వతి

సాక్షి, అమరావతి: ప్రపంచంలో అతి పెద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగిన రోజే సామాజిక న్యాయానికి మరో అడుగు పడింది. రాష్ట్రంలో శుక్రవారం మరో చారిత్రక ఘట్టానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రక్రియ మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా.. శుక్రవారం తొలిరోజు 14,334 సచివాలయాల్లో కులగణన ప్రక్రియ మొదలైంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఉమ్మడిగా సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులాలవారీగా ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తున్నారు. పది రోజుల పాటు ఈ ప్రక్రియ చేపడతారు. ప్రక్రియ మొత్తం పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం రాష్ట్రమంతటా ఒకేసారి కులగణన ప్రారంభం కాగా.. మొబైల్ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చాలా చోట్ల వివరాల నమోదులో ఆటంకాలు ఏర్పడినట్టు అధికారులు వెల్లడించారు. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా 5,34,160 కుటుంబాలకు సంబంధించి 10,22,764 మంది సభ్యుల వివరాల నమోదు పూర్తి చేసినట్టు అధికారులు వెల్లడించారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో నెట్, సెల్ సిగ్నల్ ఉండని దాదాపు 515 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా ఆఫ్‌లైన్ విధానంలో కులగణన చేపట్టారు.

దేవదాయ శాఖలో ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి రేపు రాతపరీక్షలు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో 70 ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థులకు ఆదివారం (21వ తేదీ) రాతపరీక్షలు నిర్వహించనున్నారు. 35 ఏఈఈ (సివిల్), 5 ఏఈఈ (ఎలక్ట్రికల్), మరో 30 టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్) పోస్టులు కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసేందుకు దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. నియామక ప్రక్రియను ప్రముఖ ప్రభుత్వ సంస్థ 'ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా'కు అప్పగించింది. కాగా, సివిల్, ఎలక్ట్రికల్ ఏఈఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం ఉదయం, సివిల్ టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం మధ్యాహ్నం విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో రాతపరీక్షలు నిర్వహించనున్నట్టు 'ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా'లో రిక్రూట్‌మెంట్ సర్వీస్ విభాగం హెచ్‌వోడీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాతపరీక్షలకు సంబంధించి అర్హులైన అభ్యర్థులందరికీ హాల్‌టిక్కెట్లు పంపించామని, అర్హుల జాబితా రాష్ట్ర దేవదాయ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, 'ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా' వెబ్‌సైట్‌లోనూ చూసుకోవచ్చని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో హాల్‌టిక్కెట్ అందని వారి కోసం రాతపరీక్ష కేంద్రం వద్ద కూడ డూప్లికేట్ హాల్ టికెట్లను అందజేసే ఏర్పాటు చేసినట్లు వివరించారు. డూప్లికేట్ హాల్‌టికెట్ కోసం అభ్యర్థులు తమ ఒరిజనల్ ఆధార్ గుర్తింపు కార్డుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు.

‘ఏ’ గ్రేడ్‌లో ప్రభుత్వ కళాశాలలు

- ఉన్నత ప్రమాణాలను అందుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు
- 5 ప్రభుత్వ, 2 ఎయిడెడ్ కళాశాలలకు ‘ఏ ప్లస్’
- 61 కళాశాలలకు న్యాక్ గ్రేడ్లు
- సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ చర్యలు
- న్యాక్ గుర్తింపు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ



కళాశాలలకు న్యాక్ గ్రేడ్ ఇలా..

గ్రేడ్	ప్రభుత్వ	ఎయిడెడ్
ఏ-ప్లస్	5	2
ఏ	12	2
బీ ప్లస్‌ప్లస్	13	6
బీ ప్లస్	15	4
బీ గ్రేడ్	12	4
సీ	4	-

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నత విద్యా రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రవేశాలు కల్పిస్తూ ‘ఫ్యూచర్ రెడీనెస్’ కాన్సెప్ట్‌తో భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ‘నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్’ (న్యాక్) గుర్తింపు సాధనలో ముందంజలో నిలుస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక ముందు వరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలంటే అందరికీ చిన్న చూపే. పాతికేళ్ల క్రితం ఒక వెలుగు వెలిగిన కాలేజీలు కూడా ఆ తర్వాత ప్రాభవం కోల్పోయి దైన్య స్థితికి చేరాయి. ముఖ్యంగా చంద్రబాబు ప్రభుత్వంలో వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. పాతబడిపోయిన భవనాలు, సరైన సౌకర్యాలు లేని తరగతి గదులు, పనికిరాని లేబొరేటరీలు, బోధన సిబ్బంది లేమి వంటి సమస్యలతో వీటిలో చేరాలంటేనే భయపడే పరిస్థితి. న్యాక్ అక్రిడిటేషన్ సాధించే కాలేజీల సంఖ్య నామమాత్రమే.

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్నత విద్యారంగంలో ముఖ్యంగా ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక చర్యలు చేపట్టారు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను రూపుదిద్దారు. దీంతో ప్రభుత్వ కాలేజీలు మళ్లీ నూతనంగా కనిపిస్తున్నాయి. ఉన్నత విలువలను సంతరించుకొని, విద్యా బోధనలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. దీంతో న్యాక్ అక్రిడిటేషన్ పొంది, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న కాలేజీల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. 2019 నాటికి కేవలం 18 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మాత్రమే న్యాక్ సర్టిఫికెట్ ఉంటే.. ప్రస్తుతం వాటి సంఖ్య 61కి చేరడం ‘ప్రభుత్వ చదువుల అభివృద్ధికి’ నిదర్శనం. రాజమండ్రి (అటానమస్), నగరి, విశాఖపట్నం (మహిళా), రేపల్లె, ఒంగోలు (మహిళా) ప్రభుత్వ కళాశాలలకు, ఎయిడెడ్‌లో ఏలూరులోని మహిళా సెయింట్ థెరిస్సా కళాశాల, నర్సాపురం వైఎన్ డిగ్రీ కళాశాలకు ఏకంగా ఏ-ప్లస్ గ్రేడ్ లభించింది.

గిరిజన ప్రాంతాల్లో ప్రవేశాలు భేష్..

ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ డిగ్రీ విద్యలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 168 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉంటే ఇందులో 2020 తర్వాత 15 కొత్త కళాశాలలు వచ్చాయి. ఈ విద్యా సంవత్సరంలో ఏకంగా 55 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య సంపూర్ణంగా అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా అరకు డిగ్రీ కళాశాలలో 100 శాతం, పాడేరులో 99.70 శాతం, చింతపల్లిలో 97 శాతం, గుమ్మలక్ష్మీపురంలో 92 శాతం ప్రవేశాలు నమోదవడం విశేషం. వీటితో పాటు రాజమండ్రి, గుంటూరు, నెల్లూరులోని ప్రభుత్వ అటానమస్ కళాశాలలకు యూజీసీ ప్రతిష్టాత్మకంగా ఇచ్చే ‘కాలేజీ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్సలెన్స్ (సీపీఈ)’ గుర్తింపు సైతం లభించింది. అనంతపురం, కడప అటానమస్ కళాశాలలు ‘డీబీటీ’ స్టార్‌గా ఎంపికయ్యాయి.

ఏప్రిల్ నాటికి ‘సెంచరీ’

న్యాక్ గుర్తింపునకు దరఖాస్తు చేసుకోవాలంటే యూజీసీ (2ఎఫ్/12బీ స్టేటస్) గుర్తింపు తప్పనిసరి. రాష్ట్రంలో కేవలం 57 కళాశాలలకు మాత్రమే యూజీసీ స్టేటస్ లేదు. వీటిల్లో కొత్తగా పెట్టిన కాలేజీలకు సొంత భవనాలు నిర్మిస్తున్నారు. ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలోకి వచ్చినవి, అరకొర సిబ్బంది కొరత, అడ్మిషన్లు.. ఇలా చిన్న సాంకేతిక లోపాలు, కారణాలతో యూజీసీ స్టేటస్‌కు దూరంగా ఉన్నాయి. ఈ కళాశాలలను అభివృద్ధి చేస్తూనే మిగిలిన 109 కళాశాలల్లో ఏప్రిల్ నాటికి వంద కళాశాలలకు న్యాక్ గుర్తింపు తీసుకొచ్చేలా ‘కళాశాల విద్య’ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ‘ఇప్పటికే 61 కళాశాలలకు న్యాక్ గ్రేడ్ సాధించాం. మరో రెండు కళాశాలలకు రిజల్ట్ పెండింగ్‌లో ఉంది. ఇంకా 13 కళాశాలలు న్యాక్ బృందం పరిశీలన కోసం ఎదురు చూస్తున్నాయి. 14 కళాశాలలు న్యాక్ గుర్తింపు కోసం సమగ్ర సమాచార నివేదికను రూపొందించాయి. 17 కళాశాలలు సమాచారాన్ని తయారు చేస్తున్నాయి. ప్రతి కళాశాలను మా అకడమిక్ ఆఫీసర్లతో కూడిన టీమ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. డేటాను స్వయంగా విశ్లేషిస్తూ న్యాక్ బృందం అభ్యంతరం చెప్పకుండా జాగ్రత్తపడుతోంది’ అంటూ ఓఎస్డీ డాక్టర్ కె.విజయ్ బాబు చెప్పారు. వీటితో పాటు 56 ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలల్లో 18 కళాశాలలకు న్యాక్ గుర్తింపు ఉండగా.. త్వరలోనే మిగిలిన వాటికీ తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రత్యేక కసరత్తు..



ప్రభుత్వ ఆదేశాలతో క్వాలిటీ అస్యూరెన్సు సెల్ ద్వారా దశలవారీగా కాలేజీలకు మార్గదర్శనం చేయించి న్యాక్ గుర్తింపునకు దరఖాస్తు చేయించాం. చిన్న లోపాలతో గతంలో న్యాక్ గుర్తింపు రాకుండాపోయిన అనేక కళాశాలలు గత రెండేళ్లలో ఈ గుర్తింపును పొందుతున్నాయి. ఎప్పటికప్పుడు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్లకు శిక్షణ ఇస్తున్నాం. కళాశాల న్యాక్‌కు సమర్పించే సెల్ఫ్ స్టడీ రిపోర్టులను ఉన్నత స్థాయి కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఏప్రిల్ నాటికి మరో 100 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు న్యాక్ గ్రేడ్ సాధిస్తాం.

– పోలా భాస్కర్, కమిషనర్, కళాశాల విద్య

గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్స్ కోసం 27న వాక్-ఇన్-ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్స్ నియామకం కోసం ఈనెల 27వ తేదీన తాడిగడపలోని వర్సిటీ క్యాంప్ ఆఫీస్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) ఓ.సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇన్లక్షనల్ ఫ్రెష్ వాటర్ ఫిష్ ఫామ్ విభాగంలో రెండు, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్లక్షనల్ బ్రాకిష్ వాటర్ ఫిష్ ఫామ్ విభాగంలో ఒక్కొక్కటి చొప్పున ఈ పోస్టులు భర్తీ చేస్తున్నట్టు చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ గుర్తింపు పొందిన మత్స్య లేదా పశువైద్య లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) కోర్సుతో పాటు రెండేళ్ల మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (ఎంఎఫ్ఎస్సీ) కోర్సులో కూడా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఐసీఏఆర్ నెట్ లేదా పీహెచ్‌డీ అర్హత పొంది, ఫామ్ పోస్టుల కోసం ఆక్వా రంగంలో కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉండాలన్నారు. ఈ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాల కోసం 0866-3500560లో సంప్రదించాలని సూచించారు.

‘శ్రీపద్మావతి’కి అటానమస్ హోదా

పదేళ్ల పాటు హోదా కల్పిస్తూ యూజీసీ ఉత్తర్వులు జారీ



తిరుపతిలోని ఎస్పీడబ్ల్యూ కళాశాల

తిరుపతి సిటీ: తిరుపతిలోని శ్రీపద్మావతి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ (ఎస్పీడబ్ల్యూ) కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పదేళ్ల పాటు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా కల్పిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కళాశాల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలిగింది. విద్యా విధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులు చేసుకోవడానికి వెసులుబాటు ఉంటుంది. సామాజిక సేవా దృక్పథంతో విద్యా బోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమొరీ బేస్డ్ విద్యా విధానం ఏర్పాటుకు అవకాశం ఏర్పడింది.

1952లో కళాశాల ఏర్పాటు..

రాయలసీమ జిల్లాలకు చెందిన నిరుపేద విద్యార్థినులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 1952లో తిరుపతిలో శ్రీపద్మావతీ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ (ఎస్పీడబ్ల్యూ) కళాశాలను ఏర్పాటు చేసింది. నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన కళాశాలలో ప్రస్తుతం 2,700 మంది చదువుకుంటున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీపద్మావతీ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు అటానమస్ హోదా రావడం ఆనందంగా ఉందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమష్టి కృషితో హోదా సాధించామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహదేవమ్మ తెలిపారు.

ఒడిశా నైపుణ్య శిక్షణ కార్యక్రమాల పరిశీలన

సాక్షి, అమరావతి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిలో అత్యున్నత ప్రమాణాలను పెంచడానికి ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు ఒడిశా నైపుణ్యాభివృద్ధి క్షేత్రాలను పరిశీలించారు. నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ప్రధాన కార్యదర్శి సురేశ్ కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం రెండు రోజులపాటు భువనేశ్వర్‌లో పర్యటించారు. యునెస్కో, ప్రపంచ బ్యాంకు, నీతి ఆయోగ్ వంటి పలు సంస్థల గుర్తింపు పొందిన ‘సెంచూరియన్ యూనివర్సిటీ’ని సందర్శించారు. తరగతులు, ప్రయోగశాలల వివరాలు తెలుసుకున్నారు. పరిశ్రమలను సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఉషా పాఢీతో సమావేశమై నైపుణ్యాభివృద్ధిలో ఆ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ పేర్కొంది.

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం..

1,209వ రోజుకు చేరిన రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: అంబేడ్కర్ విగ్రహాలను ఊరికి మారుమూలన నిర్మించే సంస్కృతికి చరమగీతం పాడి.. విజయవాడ నగర నడిబొడ్డున.. ప్రపంచంలోనే అతి ఎత్తయిన విగ్రహాన్ని నిర్మించి.. జాతికి అంకితం చేసిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1,209వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. అంబేడ్కర్ సూచించిన విధంగా ‘నీకోసం బతికితే నీలోనే ఉంటావు, జనం కోసం బతికితే జనంలో ఉంటావన్న రీతిలో జనం కోసం బతుకుతున్న జగనన్న ప్రజల గుండెల్లో వెయ్యేళ్లు నిలిచి ఉంటారు’ అని అన్నారు.



శతాబ్ది స్వప్నం సాకారం

సంగం బ్యారేజ్‌తో పెన్నా డెల్టా సుభిక్షం

- 3.85 లక్షల ఎకరాలకు సమృద్ధిగా నీరు
- బ్యారేజ్ నిర్మాణంతో తప్పిన వరద ముప్పు.. తాగు, సాగునీటి ఇబ్బందులు
- సంగం-పొదలకూరు మండలాల మధ్య రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం
- మహానేత వైఎస్ హయాంలో శరవేగంగా బ్యారేజ్ పనులు
- ఆయన హఠాన్మరణంతో పనులకు గ్రహణం
- కమీషన్లు వచ్చే పనులకే అధిక ప్రాధాన్యం ఇచ్చిన టీడీపీ
- సీఎంగా బాధ్యతలు చేపట్టాక సంగం బ్యారేజ్‌కు వైఎస్ జగన్ ప్రాధాన్యత
- రూ.128.99 కోట్లతో మూడేళ్లలో బ్యారేజ్, రెండు వరుసల రోడ్ కమ్ బ్రిడ్జి పూర్తి
- ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే కనిగిరి, కావలి.. కనుపూరు కెనాల్‌ల రెగ్యులేటర్లూ పూర్తి

సాక్షి, అమరావతి : ఇది పెన్నా డెల్టా రైతుల శతాబ్ది స్వప్నం. సంగం బ్యారేజీను సీఎం వైఎస్ జగన్ రికార్డు సమయంలో పూర్తిచేసి, జాతికి అంకితం చేయడంతో కల సాకారమైంది. దీంతో.. జీవ నదులైన గోదావరి, కృష్ణా బేసిన్‌లలోని రైతులతో పెన్నా డెల్టా రైతులు పంటల సాగు, దిగుబడులలో పోటీపడే స్థాయికి చేరుకున్నారు. అలాగే, పెన్నా వరదల ముప్పు పూర్తిగా తప్పడంతో ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మరోవైపు.. భూగర్భ జలమట్టం పెరగడంతో తాగు, సాగునీటి కొరత తీరింది. ఇక సంగం-పొదలకూరు మండలాల మధ్య రవాణాకు అడ్డంకులు తీరిపోయాయి.

'సంగం' కథాకమామిషు..

నెల్లూరు జిల్లాలో సంగం వద్ద పెన్నా నదిపై 1882–83లో బ్రిటీష్ సర్కార్ 0.9 మీటర్ల ఎత్తున ఆనకట్టను నిర్మించి.. పెన్నా డెల్టా, కనుపూరు, కావలి కాలువల కింద ఆయకట్టుకు 1886 నుంచి నీళ్లందించడం ప్రారంభించింది. ఈ ఆనకట్టకు దిగువన నదీ గర్భంలో నిర్మించిన రోడ్డు ద్వారా సంగం–పొదలకూరు మండలాల మధ్య రాకపోకలు సాగుతున్నాయి. పెన్నాలో వరద పెరిగితే ఈ రెండు మండలాల మధ్య రాకపోకలు స్తంభించిపోయేవి. ఆ తర్వాత ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో.. ఆనకట్టపై ఇసుక బస్తాలు వేసి, నీటిని నిల్వచేసినా నీళ్లందించడం కష్టంగా మారింది. దీని స్థానంలో బ్యారేజ్ నిర్మిస్తే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లందుతాయని.. ఆ బ్యారేజ్‌ను నిర్మించాలని నెల్లూరు జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. కానీ, 2006 వరకూ ఎవరూ పట్టించుకోలేదు.

వందేళ్ల కలను సాకారం చేస్తూ..

నెల్లూరు జిల్లా ప్రజల వందేళ్ల కలను నిజం చేస్తూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2006, మే 28న సంగం బ్యారేజ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ పనులను రూ.147.50 కోట్ల అంచనా వ్యయంతో 2008, మే 21న చేపట్టారు. మహానేత వైఎస్ హయాంలో బ్యారేజ్ పనులు పరుగులు తీశాయి. అప్పట్లో రూ.30.78 కోట్లు వ్యయం చేశారు. ఆయన హఠాన్మరణం సంగం బ్యారేజ్ పనులకు శాపంగా మారింది.

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ స్వరూపం

నిర్మాణం : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సంగం వద్ద పెన్నా నదిపై.. (సోమశిల రిజర్వాయర్‌కు 40 కిమీల దిగువన)

పరివాహక ప్రాంతం : 50,122 చ.కి.మీ.

బ్యారేజ్ పొడవు : 1,195 మీటర్లు (బ్యారేజ్‌కు అనుబంధంగా రెండు వరుసల రోడ్ బ్రిడ్జి)

గేట్లు : 85 గేట్లు (12 మీటర్లు ఎత్తు, 2.8 మీటర్ల వెడల్పుతో 79 గేట్లు.. 12 మీటర్ల ఎత్తు, 3.8 మీటర్ల వెడల్పుతో 6 స్కవర్ స్లూయిజ్ గేట్లు)

గేట్ల మరమ్మతుల కోసం సిద్ధంచేసిన స్టాప్‌లాగ్ గేట్లు : 9

గేట్ల నిర్వహణ విధానం : వర్టికల్ లిఫ్ట్

గరిష్ట వరద విడుదల సామర్థ్యం : 7,50,196 క్యూసెక్కులు

గరిష్ట నీటి మట్టం	: 35 మీటర్లు
గరిష్ట నీటినిల్వ	: 0.45 టీఎంసీలు
కనీస నీటి మట్టం	: 32.2 మీటర్లు
ఆయకట్టు	: 3.85 లక్షల ఎకరాలు
అంచనా వ్యయం	: 335.80 కోట్లు

మహానేత వైఎస్ హయాంలో వ్యయం : రూ.30.78 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన వ్యయం : రూ.128.88 కోట్లు

కమీషన్లు వచ్చే పనులకే బాబు ప్రాధాన్యం..

సంగం బ్యారేజ్‌ను నిర్మిస్తున్న ప్రాంతంలో పెన్నా నది వెడల్పు 1,400 మీటర్లు. కానీ, అప్పట్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) చీఫ్ ఇంజనీర్ 846 మీటర్ల వెడల్పుతో బ్యారేజ్ (కాంక్రీట్ నిర్మాణం), ఇరువైపులా 554 మీటర్ల వెడల్పుతో మట్టి కట్టలు నిర్మించేలా డిజైన్‌ను ఆమోదించారు. బ్యారేజ్ నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఏర్పడటంతో 1,195 మీటర్ల వెడల్పుతో బ్యారేజ్ (కాంక్రీట్ కట్టడం)ను నిర్మించాలని 2014లో నిపుణుల నివేదిక ఇచ్చింది. దీనిని ఆమోదించడంలో రెండేళ్లపాటు జాప్యంచేసిన టీడీపీ సర్కార్.. 2016, జనవరి 21న ఆ సూచన మేరకు బ్యారేజ్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో అంచనా వ్యయాన్ని రూ.335.80 కోట్లకు పెంచింది. బ్యారేజ్‌ను 2017కు పూర్తిచేస్తామని ఒకసారి.. 2018కి పూర్తిచేస్తామని మరోసారి.. 2019కి పూర్తిచేస్తామని ఇంకోసారి మాటమారుస్తూ కేవలం కమీషన్లు వచ్చే పనులకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలో చేసిన పనుల కంటే.. ధరల సర్దుబాటు (ఎస్కలేషన్), పనుల పరిమాణం పెరిగిందనే సాకుతో అధికంగా బిల్లులు చెల్లించింది. రూ.88.41 కోట్లను ఖర్చుచేసినా కమీషన్ల కక్కుర్తితో బ్యారేజ్ పనులను కొలిక్కి తేలేకపోయింది.

ఇప్పుడు సమృద్ధిగా నీళ్లందుతున్నాయి..

పెన్నా డెల్టాలో నాకు 16 ఎకరాల పొలం ఉంది. బ్యారేజ్ పూర్తి కాక ముందు నీళ్లందక సాగుచేయడానికి ఇబ్బందిపడేవాణ్ణి. సీఎం జగన్ బ్యారేజ్‌ను పూర్తిచేయడంతో సమృద్ధిగా నీళ్లందుతున్నాయి. సొంత పొలంతోపాటు కౌలుకు 40 ఎకరాలు తీసుకుని వరి సాగుచేస్తున్నా. మంచి దిగుబడులు వస్తున్నాయి. గిట్టుబాటు ధర దక్కుతోంది. వరి సిరులు కురిపించిన ఘనత సీఎం జగన్‌దే.

– మల్లవరం రామకృష్ణారెడ్డి, రైతు, కోవూరు

రికార్డు సమయంలో పూర్తిచేశాం..



సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో సంగం బ్యారేజ్‌ను రికార్డు సమయంలో పూర్తిచేశాం. 3.85 లక్షల ఎకరాలకు సమృద్ధిగా నీళ్లందించడానికి బ్యారేజ్ దోహదపడుతుంది. బ్యారేజ్‌లో నిత్యం 0.45 టీఎంసీలను నిల్వచేయడంవల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. దీనివల్ల సాగు, తాగునీటి సమస్యలకు ఇబ్బంది ఉండదు. సంగం బ్యారేజ్ కమ్ బ్రిడ్జి పూర్తవడంవల్ల సంగం–పొదలకూరు మండలాల మధ్య రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది.

– సి. నారాయణరెడ్డి, ఈఎన్‌సీ, జలవనరుల శాఖ

కరోనా తీవ్రత.. వరద ఉధృతితో పోటీపడుతూ పనులు

ఈ నేపథ్యంలో.. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక సంగం బ్యారేజ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. శరవేగంగా సంగం బ్యారేజ్‌ను పూర్తిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో..

- గతంలో ఎన్నడూలేని రీతిలో 2019–20లో 42.52, 2020–21లో 301.52, 2021–22లో 373.52 టీఎంసీలు నెల్లూరు బ్యారేజీ నుంచి సముద్రంలో కలిసాయంటే పెన్నా నదికి ఏ స్థాయిలో వరద వచ్చిందో అంచనా వేసుకోవచ్చు.
- ఓ వైపు కరోనా తీవ్రత.. మరోవైపు పెన్నా వరద ఉధృతితో పోటీపడుతూ బ్యారేజ్ పనులను సీఎం జగన్ పరుగులు పెట్టించారు.
- బ్యారేజ్‌కు ఎగువన ఎడమ వైపున 3.17 కిమీల, బ్యారేజ్‌కు కుడి వైపున 3 కిమీల పొడవున కరకట్టలను పటిష్టం చేశారు.
- సంగం నుంచి పొదలకూరుకు రాకపోకలు సాగించడానికి వీలుగా బ్యారేజ్‌పై రెండు వరుసల రోడ్ బ్రిడ్జిని పూర్తిచేశారు.
- కనిగిరి, కావలి కాలువలకు సంయుక్తంగా నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్, కనుపూరు కాలువకు నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్‌లను పూర్తిచేశారు.
- ఈ పనులను రూ.128.88 కోట్లతో పూర్తిచేసి.. బ్యారేజ్‌ను 2022, సెప్టెంబరు 6న సీఎం జగన్ జాతికి అంకితం చేశారు. తద్వారా నెల్లూరు ప్రజల దశాబ్దాల స్వప్నాన్ని సాకారం చేశారు.

సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలం..

ఇక సంగం బ్యారేజ్ పూర్తవడంతో 2022 నుంచి ఏటా పెన్నా డెల్టాలోని 2.47 లక్షలు, కనుపూరు కాలువ కింద 63 వేలు, కావలి కాలువ కింద 75 వేలు వెరసి 3.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందుతున్నాయి. దీంతో రైతులు విస్తారంగా పంటలు సాగుచేస్తున్నారు. గోదావరి, కృష్ణా డెల్టా రైతులతో పోటీపడుతూ గరిష్టంగా దిగుబడులు సాధిస్తున్నారు. పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు దక్కుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. బ్యారేజ్‌లో 0.45 టీఎంసీలను నిల్వచేయడంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో పుష్కలంగా నీళ్లు లభ్యమవుతున్నాయి. అలాగే, సంగం బ్యారేజ్ కమ్ బ్రిడ్జిని పూర్తిచేయడంతో సంగం, పొదలకూరు మండలాల మధ్య రాకపోకల సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది.



అయోధ్యకు శ్రీవారి లడ్డూలు



అయోధ్య తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన లడ్డూలు

తిరుమల: శ్రీవారికి ఎంతో ప్రీతికరమైన లడ్డూలను అయోధ్య రామయ్య సన్నిధికి టీటీడీ తరలిస్తున్నది. శుక్రవారం సాయంత్రం తిరుమల నుంచి తిరుపతికి లక్ష లడ్డూలు తరలించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి ఆలయ ప్రారంభోత్సవానికి లక్ష లడ్డూలు పంపిణీ చేయాలని పాలకమండలి నిర్ణయం తీసుకుందన్నారు. తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక కార్గో ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా అయోధ్యకు తరలించామన్నారు.

ముత్యాలరాజుకు కేంద్ర సర్వీసులో జాయింట్ సెక్రటరీ హోదా

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజుకు కేంద్ర సర్వీసులో జాయింట్ సెక్రటరీ హోదా లభించింది. జాయింట్ కార్యదర్శి లేదా సమాన పదవిని పొందేందుకు వీలుగా ముత్యాలరాజును కేంద్ర ప్రభుత్వం ఎంప్యానల్ చేసింది. ఈ మేరకు కేంద్రం శుక్రవారం సమాచారం వెల్లడించింది.

కేంద్ర మంత్రులకు శ్రీశారదాపీఠం ఆహ్వానం



నిర్మలా సీతారామన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న స్వాత్మానందేంద్ర

పెందుర్తి (విశాఖ జిల్లా): విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి శుక్రవారం ఢిల్లీలో పర్యటించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్, హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌లను కలిసి ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు జరగనున్న పీఠం వార్షికోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

కారులో తరలిస్తున్న రూ.2.25 కోట్లు స్వాధీనం

- బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టుబడ్డ నగదు
- కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నగదును ప్రొద్దుటూరు నుంచి విజయవాడ తరలిస్తున్నట్లు వెల్లడి
- పట్టుబడ్డ నగదును ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామన్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ వెంకటేశులు, ఇతర అధికారులు

మార్టూరు: జాతీయ రహదారిపై బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి ఓ కారులో తరలిస్తున్న రూ.2.25 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని, కారులోని ఇద్దరు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. బాపట్ల డీఎస్పీ వెంకటేశులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంకొల్లు మండలం పావులూరి గ్రామానికి చెందిన గుంజి శ్రీనివాసరావు విజయవాడ భవానీపురంలో నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాలుగా ట్రావెల్స్ డ్రైవరుగా పని చేస్తున్నాడు. అదే భవానీపురానికి చెందిన బీరం శ్రీనివాసరెడ్డి విజయవాడలోని ఓ దాల్ మిల్ ట్రేడరు వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. వీరిద్దరికీ గతంలో పరిచయం లేదు. శ్రీనివాసరావును అల్లాడి చంద్రశేఖర్ అనే వ్యక్తి, శ్రీనివాసరెడ్డిని ధర్మేంద్ర అనే వ్యక్తి కలిశారు. ఇద్దరూ కలిసి కడప జిల్లా ప్రొద్దుటూరు బస్టాండ్‌కు వెళ్లి, అక్కడ ఇద్దరు వ్యక్తులు ఇచ్చే మూడు బ్యాగులు తేవాలని చెప్పారు. శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి ఉదయం ఏడు గంటలకు విజయవాడ నుంచి కారులో బయల్దేరి మధ్యాహ్నం ఒంటి గంటకు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చేరుకున్నారు. కొంత సేపటికి గుర్తు తెలియని ఇద్దరు మరో కారులో వచ్చి వీరిద్దరికీ మూడు బ్యాగులు అప్పగించి వెళ్లారు. మధ్యాహ్నం 1:30 గంటలకు వీరిద్దరూ కారులో బ్యాగులతో ప్రొద్దుటూరు నుంచి బయల్దేరారు. బద్వేలు, పామూరు, కనిగిరి, పొదిలి, దర్శి, అద్దంకి మీదుగా ప్రయాణిస్తూ రాత్రి 7 గంటల సమయంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్దకు వచ్చారు. వీరి కారును పోలీసు అధికారులు తనిఖీ చేయగా నగదు బయటపడింది. నగదుకు సంబంధించి వారి వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు చూపించగా పోలీసులు సంతృప్తి చెందలేదు. అవి సరిగా లేకపోవడంతో నగదును, కారులో ఉన్న శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ నగదును ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామని డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో బొల్లాపల్లి వీఆర్వో నాయక్, వలపర్ల వీఆర్వో అశోక్ పంచనామా చేశారు. ఈ దాడుల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు తోపాటు సంతమాగులూరి సీఐ నరసింహారావు, యద్దనపూడి ఎస్ఐ వి.నాగశ్రీను పాల్గొన్నారు.

ఆర్‌డీవో ముందు హాజరు కావాల్సిందే

బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: పలమనేరు ఆర్‌డీవో సీఆర్‌పీసీ సెక్షన్–110 కింద జారీచేసిన నోటీసుకు అనుగుణంగా ఆ అధికారి ఎదుట హాజరు కావాల్సిందేనని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్‌ను హైకోర్టు ఆదేశించింది. తనను అరెస్ట్ చేసేందుకే ఆర్‌డీవో సీఆర్‌పీసీ సెక్షన్–100 కింద నోటీసులు జారీ చేశారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ రామచంద్ర యాదవ్ శుక్రవారం హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సుమతి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి... ఆర్‌డీవో నోటీసులపై స్టే విధించేది లేదని స్పష్టంచేశారు. ఆర్‌డీవో ముందు హాజరు కావాల్సిందేనని రామచంద్ర యాదవ్‌ను ఆదేశించారు. కనీసం అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని రామచంద్రయాదవ్ తరఫు న్యాయవాది అశ్వనీకుమార్ అభ్యర్థించారు. దీంతో రామచంద్ర యాదవ్‌పై ఈ నెల 24 వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అధికారులను న్యాయమూర్తి ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేశారు. మరోవైపు చిత్తూరు జిల్లా, పుంగనూరు పోలీసులు ఈ నెల 12న నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రామచంద్రయాదవ్ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సుమతి విచారణ జరిపారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు సమయం కావాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ విచారణను ఈ నెల 25కి వాయిదా వేశారు.

19 మందికి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు

- ఏపీ నుంచి సూర్యప్రసాద్.. తెలంగాణ నుంచి పెండ్యాల లక్ష్మీప్రియ ఎంపిక
- 22న రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం
- 23న ప్రధాని మోదీతో చిన్నారుల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 19 మంది చిన్నారులకు 2024 సంవత్సరానికి గాను రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈనెల 22న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు గ్రహీతలకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. కళ, సంస్కృతి (7), శౌర్యం (1), ఇన్నోవేషన్ (1), సైన్స్ టెక్నాలజీ (1), సామాజిక సేవ (4), క్రీడలు (5) ఆరు కేటగిరీల్లో ఈ అవార్డులు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్. సూర్యప్రసాద్, తెలంగాణ నుంచి పెండ్యాల లక్ష్మీప్రియ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 23న ప్రధాని మోదీతో భేటీ అవుతారు. అంతేగాక.. ఈనెల 26న జరిగే 75వ గణతంత్ర వేడుకల్లో వారు పాల్గొంటారని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ తెలిపింది.

పర్వతారోహకుడు సూర్యప్రసాద్..

ఇక క్రీడల కేటగిరీలో ఎంపికైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్. సూర్యప్రసాద్ ఐదేళ్ల వయస్సులోనే పర్వతారోహణ శిక్షణ తీసుకుని 2022 ఏప్రిల్ 5న 'మౌంట్ కిలిమంజారో'ని అధిరోహించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. అక్కడ మౌంట్ కిలిమంజారోపై ప్రముఖ వ్యక్తుల చిత్రాలను ప్రతీకాత్మకంగా ప్రదర్శించాడు. అలాగే.. తెలంగాణ నుంచి కళ, సంస్కృతి కేటగిరీలో ఎంపికైన వరంగల్ జిల్లాకు చెందిన పెండ్యాల లక్ష్మీప్రియ (14) కూచిపూడి నృత్యకారిణి. ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంది.

సంపద సృష్టిస్తా.. పేదవాడికి న్యాయం చేస్తా..

- రాష్ట్రాన్ని స్వర్ణయుగంపై తీసుకెళ్లాలన్నదే నా ఆలోచన
- జన్మభూమి స్ఫూర్తితో పనిచేస్తాం
- 'రా...కదలిరా' కార్యక్రమంలో చంద్రబాబునాయుడు
- వెంకటగిరి సభలో జనసేన జిల్లా అధ్యక్షునికి, ఎమ్మెల్యే ఆనంకు అవమానం
- బాబు ప్రసంగిస్తుండగా మధ్యలోనే వెళ్లిపోయిన జనం



వెంకటగిరి సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో జనం లేక వెలవెలబోతున్న ప్రాంగణం



మాట్లాడుతున్న చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, కడప/సాక్షి, తిరుపతి : పేదరికం లేని సమాజం చూడాలన్నదే ఎన్టీయార్ ఆశయమని, ఆ బాధ్యత తాను తీసుకుంటానని, సంపద సృష్టించి ప్రతి పేదవాడికి న్యాయం చేస్తానని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం.. తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం 'రా...కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్మభూమి స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. తన ఆలోచన రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు తీసుకెళ్లాలన్నదేనని.. అందుకే కడప, కర్నూలు, అనంతపురం, విశాఖపట్నం అభివృద్ధి చేస్తామన్నారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు తెలిపారు. 'తమ్ముళ్లా.. 82రోజులు అవిశ్రాంతంగా పనిచేయండి, వైఎస్సార్‌సీపీని ఇంటికి పంపేందుకు నేను ప్రయత్నిస్తున్నా, మీ కోసం మీరు కూడా ప్రయత్నించాలి' అని చంద్రబాబు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మళ్లీ మళ్లీ అవే హామీలు..

ఇదిలా ఉంటే.. రెండుచోట్లా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే చంద్రబాబు మళ్లీ మళ్లీ వల్లెవేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అదే పనిగా ఆరోపణలు చేశారు. ప్రసంగంలో అనేకమార్లు తత్తరపాటుకు గురయ్యారు. ఇక చంద్రబాబు సుదీర్ఘకాలం విజన్–2020 అంటూ కలరింగ్ ఇచ్చిన ఆయన ఇప్పుడా గడువు ముగిసిపోవడం.. చెప్పుకునేందుకు ఏమీలేకపోవడంతో స్వర్ణయుగం తెస్తానంటూ కొత్త పల్లవి అందుకోవడంపై సభకు వచ్చిన వారు చర్చించుకోవడం కనిపించింది. అలాగే.. రాయలసీమలో హార్టికల్చరల్ హబ్ తెస్తానని 2014–19 మధ్య ఊదరగొట్టిన ఆయన మళ్లీ అదే పాటను వల్లెవేయడంపై వారు నవ్వుకున్నారు. పైగా.. కడప స్టీల్‌ప్లాంట్‌పట్ల ఆయన చిత్తశుద్ధి ప్రదర్శించకపోగా, ఇప్పుడు అందుకు చర్యలు తీసుకుంటుంటే బురద జల్లేందుకు ప్రయాసపడ్డారు.

జనసైనికులు, 'ఆనం'కు అవమానం

వెంకటగిరి సభలో జనసేన నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మనుక్రాంతిరెడ్డి ప్రసంగిస్తుండగా టీడీపీ శ్రేణులు అతని ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అలాగే.. స్థానిక ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి ప్రసంగిస్తుండగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వర్గీయులు అదే పనిగా బాబు, బాబు అంటూ అరుస్తుండడంతో ఆనం తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించారు. ఇక వెంకటగిరి సభకు చంద్రబాబు ఆలస్యంగా రావడంతో ఎండలో జనం నిరీక్షించలేక ఎక్కువమంది వెళ్లిపోయారు. అలాగే, చంద్రబాబు రొడ్డకొట్టుడు ప్రసంగం వినలేక మరో సగం మంది వెనుదిరిగారు. దీంతో సభా ప్రాంగణం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. చివరకు.. వచ్చిన జనానికి చెప్పినంత డబ్బులు టీడీపీ నేతలు ఇవ్వకపోవడంతో వారు గొడవపడడం కనిపించింది.

సీఐడీ విచారణకు టీడీపీ నేతలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అగ్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి శివకేశవలను శుక్రవారం గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు విచారించారు. అమరావతి జేఏసీ నాయకులు శ్రీనివాసరావు దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. రామ్‌గోపాల్‌వర్మ తల నరికి తీసుకొస్తే కోటి రూపాయలు ఇస్తానని ప్రకటించారు. దీనికి అనుబంధంగా షేక్ ఫిరోజ్, బండి శివకేశవ ఘాటైన కామెంట్లు చేశారు. కేసు విచారణలో భాగంగా వారిద్దరిని కొన్ని గంటలపాటు సీఐడీ అధికారులు ప్రశ్నించారు. విచారణలో వారితోపాటు ఇద్దరు న్యాయవాదులు ఉన్నారు.

నిత్యం వ్యాయామంతో బహుళ ప్రయోజనాలు

- ఏపీ ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ
- ఏపీ ఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్–2024 ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ

సాక్షి, అమరావతి: నిత్య వ్యాయామంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏపీ ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ అన్నారు. పోలీస్ సిబ్బంది నిత్యం వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేస్తారని చెప్పారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజుల ఏపీ ఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్ 2024ను ఘనంగా ప్రారంభించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్ మీట్‌లో విజయవాడ, రాజమహేంద్రవరం, రాయలసీమ జోన్ నుంచి సుమారు 100 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత ఏపీఎస్పీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి, విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకరరావు పాల్గొన్నారు.

మరింత చేరువగా క్యాన్సర్ వైద్యం

50 కి.మీ. పరిధిలోనే ప్రజలకు క్యాన్సర్ వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

- ఏడు పాత, ఐదు నూతన వైద్య కళాశాలల్లో ఆంకాలజీ విభాగాల ఏర్పాటు
- కొత్తగా 516 పోస్టుల సృష్టి.. ఒక్కో కాలేజీకి 43 పోస్టుల మంజూరు



గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల నాట్కో క్యాన్సర్ సెంటర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని క్యాన్సర్ బాధితులకు సమీపంలోనే వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగంలో క్యాన్సర్ రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూ కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ (సీసీసీ)ను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రజలకు తాము ఉంటున్న ప్రాంతానికి 50 కి.మీ. పరిధిలోనే వైద్యసేవలను అందుబాటులోకి తెస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 12 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో క్యాన్సర్ విభాగాలను ఏర్పాటు చేయనుంది. ఇందు కోసం కొత్తగా 516 పోస్టులను ప్రభుత్వం సృష్టించింది. రేడియేషన్, మెడికల్, సర్జికల్ అంకాలజీ విభాగాల ఏర్పాటు కు అనుగుణంగా ఒక్కో విభాగంలో 12 చోట్ల ఒక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ చొప్పున, ఇతర వైద్య సిబ్బంది కలిపి ఒక్కో కళాశాలకు 43 చొప్పున పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త వైద్య కళాశాలల్లో క్యాన్సర్ సేవలు

మొత్తం 12 వైద్య కళాశాలల్లో క్యాన్సర్ విభాగాలు ఏర్పాటు చేస్తుండగా, వాటిలో ఏడు పాత కళాశాలలు, ఐదు కొత్త వైద్య కళాశాలలు ఉన్నాయి. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలను ప్రారంభించారు. ఏడాది కూడా పూర్తవకుండానే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఇక్కడ ప్రారంభిస్తుండటం విశేషం. మరోవైపు త్వరలోనే జిల్లా ఆస్పత్రుల్లోనూ డే కేర్ క్యాన్సర్ వైద్య సేవలను ప్రారంభించడానికి వైద్యశాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రోగులకు జిల్లా ఆస్పత్రుల్లోనే పగటిపూట కీమోథెరపీ చేయనున్నారు.

క్యాన్సర్ బాధితులకు అండగా సీఎం జగన్ ప్రభుత్వం

గత టీడీపీ పాలనలో ప్రభుత్వ వైద్యరంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. సీఎం వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి చర్యలు చేపట్టారు. అదేవిధంగా రాష్ట్రంలో ఏటా వేల సంఖ్యలో క్యాన్సర్ కొత్త కేసుల నమోదవుతుండటంతో ఈ వ్యాధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోకి చేర్చారు. తద్వారా 2019 నుంచి గత ఏడాది జూలై నాటికి ఆరోగ్యశ్రీ పథకం కింద 2,64,532 మంది క్యాన్సర్ బాధితులకు 8.52 లక్షల ప్రొసీజర్స్‌లో ఉచిత వైద్యం అందించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏకంగా రూ.1,801.30 కోట్లు ఖర్చు చేసింది. మరోవైపు ప్రభుత్వ రంగంలో క్యాన్సర్ వైద్య సేవలను మెరుగుపరుస్తున్నారు. కర్నూలు, కడప, విశాఖపట్నం, గుంటూరులలో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో ఇప్పటికే లీనియర్ యాక్సిలేటర్ సహా ఇతర అధునాతన పరికరాలతో క్యాన్సర్ రోగులకు ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి. వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా నోటిఫైడ్ జబ్బుల జాబితాలోకి క్యాన్సర్‌ను చేర్చారు. ఇటీవలే కడప క్యాన్సర్ సెంటర్‌ను సీఎం జగన్ ప్రారంభించారు. త్వరలోనే కర్నూల్ క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు.

కేఎల్‌యూ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విజయవాడలోని కేఎల్ డీమ్డ్ వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత శుక్రవారం విడుదల చేశారు. ప్రవేశ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెరిట్ విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలని మంత్రి కోరారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ విద్యార్థులు తాము నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందటం ద్వారా స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్స్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, వర్సిటీ ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వైస్‌కెప్టెన్‌గా స్నేహదీప్తి



విశాఖ స్పోర్ట్స్: బీసీసీఐ అంతర్ జోనల్ సీనియర్ మహిళా వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే దక్షిణ మండల జట్టుకు విశాఖ క్రికెటర్ స్నేహదీప్తి వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఆంధ్ర సీనియర్ వుమెన్ జట్టుకు ఓపెనర్‌గానూ సేవలందించిన స్నేహదీప్తి, కెప్టెన్‌గానూ జట్టును ముందుకు నడిపించింది. స్నేహదీప్తితో పాటు ఆంధ్ర జట్టుకు వికెట్ కీపర్‌గా సేవలందిస్తున్న దుర్గ, బౌలర్‌గా రాణిస్తున్న షబ్నమ్ సైతం జట్టుకు ఎంపికయ్యారని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వీరిని అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి అభినందించారు. సీనియర్ మహిళా వన్డే టోర్నీలో రౌండ్ రాబిన్ పద్ధతిలో 50 ఓవర్ల ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆరు జోన్ జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. సౌత్‌జోన్ జట్టులో ఆంధ్రతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు జట్లకు చెందిన క్రీడాకారిణులు ఆడనున్నారు. తొలిరెండు స్థానాల్లో నిలిచిన జట్లు టైటిల్ పోరులో నిలవనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్‌హోదాలో నార్త్‌జోన్ బరిలోకి దిగనుంది.

ఏపీలో ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

- బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రతినిధి మహమ్మద్ రఫీకుల్ ఇస్లాం
- ప్రకృతి సాగుపై అధ్యయనం కోసం రాష్ట్రానికి విచ్చేసిన బంగ్లా ఉన్నతాధికారుల బృందం



హనుమాన్‌జంక్షన్‌లో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న బంగ్లాదేశ్ ప్రతినిధుల బృందం

సాక్షి, అమరావతి/హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ అతి తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేస్తున్న విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన బంగ్లాదేశ్ ప్రతినిధి బృందంలోని పల్లికర్మ సహాయక ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆకోండ్ మొహమ్మద్ రఫీకుల్ ఇస్లాం అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు బంగ్లాదేశ్ అధికారుల బృందం శుక్రవారం విచ్చేసింది. నాలుగు రోజులపాటు ఈ బృందం కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనుంది. రైతు సాధికార సంస్థ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలో ఈ బృందంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ పి.విజయకుమార్ వివరించారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులపై అధ్యయనం చేసేందుకు వచ్చామన్నారు. తొలిరోజు ఈ బృందం కృష్ణా జిల్లాలోని బాపులపాడు, కానుమోలు, కాకులపాడు గ్రామాల్లో పర్యటించింది. హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డు వద్ద నందిగం రవికుమార్ సాగు చేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని బృందం సభ్యులు సందర్శించారు. అక్కడ రైతు సాగు చేస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దళితులపై టీడీపీ గూండాల దాడి

- నిందితుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రధాన అనుచరుడు
- భూమి ఆక్రమించుకునేందుకు యత్నం



దాడిలో గాయపడ్డ అజయ్

పీలేరు/కలికిరి: అన్నమయ్య జిల్లా కలికిరిలో దళితులపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు..కలకడ మండలం రాతిగుంటపల్లెకు చెందిన అనూషకు తండ్రి ముల్లంగి కృష్ణ నుంచి వారసత్వంగా పొందిన భూమి కలికిరి సైనిక్ స్కూల్ సమీపంలో ఉంది. సర్వే 1098/2లో 40 సెంట్ల భూమి అనూషకు ఉంది. ఈ భూమి 4 లేన్ల జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో దాని రేటు అమాంతంగా పెరిగిపోయింది. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ప్రధాన అనుచరుడు అయిన తెలుగు యువత నాయకుడు అవినాష్‌రెడ్డి కన్ను ఈ భూమిపై పడింది. అవినాష్‌రెడ్డి కొంతకాలంగా దళితులకు చెందిన సర్వే నంబర్లు 724, 1097/1, 1097/2, 1098/2లోని భూములు ఆక్రమించుకుని అక్రమ లేఅవుట్లు వేసి అమ్మేశాడు. అనూషకు చెందిన భూమిని ఆక్రమించుకునేందుకు పథకం వేశాడు. అనూష కుటుంబ సభ్యులు తమ భూమిలో ఇంటి నిర్మాణాలను చేపట్టారు. ఇది తెలుసుకున్న అవినాష్‌రెడ్డి గురువారం తన అనుచరులతో అనూష కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. మహిళలని కూడా చూడకుండా అనూష కుటుంబ సభ్యులతో పాటు వారి బంధువులపై బీరు బాటిళ్లతో దాడి చేశారు. అజయ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వీరి భూమి పక్కనే ఉన్న ప్రభుత్వ వ్యవసాయ నూర్పిడి బండ భూమిని కూడా అవినాష్‌రెడ్డి ఆక్రమించుకుని రికార్డులు సృష్టించుకున్నట్లు బాధితులు తెలిపారు. జరిగిన ఘటనలపై బాధితులు శుక్రవారం సీఐ సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలికిరిలో దళితులపై టీడీపీ గూండాలు దాడి చేయడంతో శుక్రవారం మాలమహానాడు నేతలు మోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సమగ్ర విచారణ జరిపి అవినాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, దళితులపై అవినాష్ రెడ్డి, అతని అనుచరులు చేసిన దాడి ఘటనలో బాధితురాలు అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బాలరాముడి తొలి దర్శనం

సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన రామ్‌లల్లా విగ్రహం చిత్రాలు

- గర్భగుడిలోకి చేర్చకముందు చిత్రీకరణ
- ఆలయంలో వేదికపై ప్రతిష్టించిన విగ్రహం ఫొటోను విడుదల చేసిన వీహెచ్‌పీ
- మరో రెండు రోజుల్లో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట.. ఏర్పాట్లు దాదాపు పూర్తి


శుక్రవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో అయోధ్య రామాలయం. (ఇన్‌సెట్లో) శుక్రవారం వీహెచ్‌పీ విడుదల చేసిన రామ్‌లల్లా విగ్రహం ఫొటో

అయోధ్య/న్యూఢిల్లీ: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్టకు ఇక రెండు రోజులే మిగిలి ఉంది. ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. గర్భగుడిలో శ్రీరాముడి దర్శనం కోసం భక్తులు ఎదురు చూస్తున్నారు. అయితే, ప్రాణప్రతిష్ట కంటే ముందే రామ్‌లల్లా విగ్రహం చిత్రాలు బయటకు వచ్చాయి. గర్భగుడిలోకి చేర్చకముందు వీటిని చిత్రీకరించినట్లు తెలుస్తోంది. బాలరాముడి చేతిలో బాణం, విల్లు కనిపిస్తున్నాయి. ఈ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నల్లరాయితో రూపొందించిన ఐదు సంవత్సరాల రాముడి విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ విధంగా రామ్‌లల్లా విగ్రహ తొలి దర్శనం ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో ప్రజలకు లభించింది. ఇక గర్భగుడిలో ప్రధాన వేదికపై ప్రతిష్టించిన తర్వాత కళ్లకు గంతలు కట్టి ఉన్న రామ్‌లల్లా విగ్రహం ఫొటోను విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విడుదల చేసింది. ప్రాణప్రతిష్ట పూర్తవకపోవడంతో విగ్రహం కళ్ల చుట్టూ పసుపు రంగు వస్త్రం చుట్టారు. రామ్‌లల్లాను గులాబీల దండతో అలంకరించారు. ప్రాణప్రతిష్ట ముగిశాక ఈ నెల 23 నుంచి సామాన్య భక్తులు గర్భాలయంలో రాముడిని దర్శించుకోవచ్చు.

ఏర్పాట్లపై సీఎం యోగి సమీక్ష

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలోని హనుమాన్ గార్హీ ఆలయంలో పూజలు చేశారు. అలాగే భవ్య రామ మందిరాన్ని దర్శించుకున్నారు. ప్రాణప్రతిష్ట వేడుక కోసం జరుగుతున్న ఏర్పాట్లు సమీక్షించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత సరయూ నదిలో సోలార్ బోటును ప్రారంభించారు. 1,008 కుండియా హనుమాన్ మహాయజ్ఞంలో పాల్గొన్నారు.

కాలర్ ట్యూన్లుగా రాముని పాటలు

రామాలయ ప్రాణప్రతిష్ట సందర్భంగా అయోధ్యలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. వీధుల్లో రాముడి పాటలు మార్మోగుతున్నాయి. ప్రజలు పరస్పరం పలుకరింపుల్లోనూ రామనామం ప్రస్తావిస్తున్నారు. అయోధ్య పౌరులు తమ ఫోన్లలో రాముడి పాటలనే కాలర్ ట్యూన్లు, రింగ్ టోన్లుగా మార్చుకుంటున్నారు. ఎవరికైనా ఫోన్ చేస్తే 'యుగ్ రామ్ రాజ్ కా', 'రామ్ ఆయే హై అయోధ్య మే', 'హరి అనంత్ హరి కథ' వంటి పాటలు వినిపిస్తున్నాయి.

మధ్యప్రదేశ్ నుంచి 5 లక్షల లడ్డూలు

అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం కోసం మధ్యప్రదేశ్ భక్తులు 5 లక్షల లడ్డూలు పంపించారు. ఈ లడ్డూలతో ఐదు వాహనాలు శుక్రవారం భోపాల్ నుంచి అయోధ్యకు బయలుదేరాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ వాహనాలకు పచ్చజెండా ఊపారు. 5 లక్షల లడ్డూలు ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయంలో తయారు చేశారు.

ఉత్తరప్రదేశ్ జైళ్లలో ప్రత్యక్ష ప్రసారం

రామమందిర ప్రారంభోత్సవం కోసం అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని టీవీల్లో ప్రత్యక్షంగా వీక్షించాలని నిర్ణయించుకున్నారు. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సైతం ఈ అవకాశం కల్పించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాణప్రతిష్ట వేడుక ప్రత్యక్ష ప్రసారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారక్‌లలో టీవీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పలు రాష్ట్రాల్లో సోమవారం సెలవు

రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. రాష్ట్రమంతటా కార్యాలయాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలకు సెలవు అమలు చేస్తున్నట్లు తెలియజేసింది. మధ్యప్రదేశ్‌లోనూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. తమ విద్యాసంస్థలకు 22న హాఫ్ డే సెలవు ఇస్తున్నట్లు జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ ప్రకటించింది.

అంబానీ నుంచి బచ్చన్ దాకా..

బాలరాముడి ప్రాణప్రతిష్టకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా అత్యంత ప్రముఖులు హాజరుకాబోతున్నారు. బిలియనీర్ ముకేశ్ అంబానీ నుంచి బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ దాకా చాలామంది ప్రముఖులకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానం పంపించింది. ఆహ్వానితుల జాబితాలో దాదాపు 7,000 మందికి చోటు దక్కింది. ప్రముఖ రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ నటులు, క్రీడాకారులు, అధికారులు, దౌత్యవేత్తలకు ఆహ్వానాలు అందాయి. ముకేష్ అంబానీ, అమితాబ్ బచ్చన్ తమ కుటుంబ సభ్యులతో సహా హాజరుకాబోతున్నారు. సినీ ప్రముఖులు అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్, చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్, మోహన్‌లాల్, అలియా భట్, సరోద్ కళాకారుడు అంజాద్ అలీ, దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ తదితరులను ఆహ్వానించారు.

ఆ న్యాయమూర్తులకూ...

అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్టకు దేశవిదేశాల నుంచి ప్రముఖులు హాజరుకాబోతున్నారు. అయోధ్య వివాదంపై తుది తీర్పునిచ్చి, భవ్య మందిర నిర్మాణానికి మార్గం సుగమం చేసిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సభ్యులకు రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు ఆహ్వానం పంపించారు. సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ సీజేఐలు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం అయోధ్య వివాదంపై 2019 నవంబర్ 9న చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రాణప్రతిష్టకు హాజరు కావాలని కోరుతూ రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు సభ్యులతోపాటు 50 మందికిపైగా ప్రఖ్యాత న్యాయమూర్తులు, న్యాయవాదులను సైతం ఆహ్వానించారు.

శిల్పికి 'తీపి బహుమతి'


రామ్‌లల్లా విగ్రహాన్ని చెక్కిన మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు తియ్యటి బహుమతి లభించింది. మైసూరులోని మహాలక్ష్మీ స్వీట్స్ దుకాణం యజమాన్యం ఆయనకు అయోధ్య రామమందిరం ప్రతిరూపంగా తయారు చేసిన మిఠాయిని బహూకరించింది. రకరకాల స్వీట్లతో ఈ బహుమతిని తయారు చేశారు.




అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం, రామ్ లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కర్ణాటకలో హనుమాన్ జన్మస్థలంగా భావించే కిష్కింద నుంచి శుక్రవారం అయోధ్యకు చేరుకున్న హనుమ రథం

22న ఒడిశా రామాలయ ప్రాణప్రతిష్ట

అయోధ్యలో నిర్మించిన భవ్య రామమందిరంలో ఈ నెల 22న రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట జరుగనుంది. అదే రోజు మరో రామాలయ ప్రాణప్రతిష్ట సైతం జరగబోతోంది. ఒడిశాలో నయాగఢ్ జిల్లా ఫతేగఢ్ గ్రామంలో సర్వాంగ సుందరంగా నిర్మించిన గుడిలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్టించబోతున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. సముద్ర మట్టానికి 1,800 అడుగుల ఎగువన ఓ కొండపై 2017లో ఈ ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. ఆలయం ఎత్తు 165 అడుగులు. 150 మందికిపైగా కార్మికులు ఏడేళ్లలో నిర్మాణం పూర్తిచేశారు. కళింగ శైలిలో ఆలయం రూపుదిద్దుకుంది. ఈ ప్రాంతానికి చరిత్రాత్మక ప్రాధాన్యం ఉంది. శ్రీకృష్ణుడు ఈ కొండపై తపస్సు చేశాడని చెబుతుంటారు.



ఎస్సీ వర్గీకరణపై కేంద్రం కమిటీ

- కేబినెట్ కార్యదర్శి గౌబా అధ్యక్షతన అయిదుగురితో కమిటీ
- 23న తొలి సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. శుక్రవారం కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో అయిదు మంత్రిత్వ శాఖలకు చెందిన కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. హోం, న్యాయ, గిరిజన సంక్షేమ, సామాజిక న్యాయం, సిబ్బంది, శిక్షణ శాఖల కార్యదర్శులకు ఇందులో చోటు కల్పించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి తీసుకోవాల్సిన పాలనాపరమైన చర్యలను పరిశీలించి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు, వీలైనంత త్వరగా తమ నివేదికను అందించేందుకు వీలుగా ఈ కమిటీ ఈనెల 23న తొలిసారి భేటీ కానుంది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగిన ఎస్సీ ఉపకులాల విశ్వరూప మహాసభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడం తెలిసిందే. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు త్వరలో కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ ఏర్పాటు చేయాలని గత నవంబర్ 24న ఆదేశించారు. గౌబా కమిటీ ఏర్పాటుకు తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

కోవింద్ కమిటీని రద్దు చేయాలి: ఖర్గే

న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల యోచనను కాంగ్రెస్ గట్టిగా వ్యతిరేకించింది. ఈ విధానం సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి విరుద్ధమని పేర్కొంది. ఒకే దేశం–ఒకే ఎన్నికల ఆలోచనను పూర్తిగా పక్కనబెట్టాలని, దీనిపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో ఏర్పాటైన కమిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. కమిటీ కార్యదర్శి నితేన్ చంద్రకు ఈ మేరకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ఒకే విడతలో ఎన్నికల కోసం సగం పదవీ కాలం కూడా పూర్తవని అసెంబ్లీలను రద్దు చేస్తే ఓటర్ల హక్కులను కాలరాయడమేనన్నారు.

బీజేపీది 'ఢిల్లీ' పాలన: రాహుల్


భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా శుక్రవారం అసోంలో హనుమాన్ మాస్క్‌తో రాహుల్

నార్త్ లఖీంపూర్ (అసోం): దేశాన్ని ఢిల్లీ నుంచి మాత్రమే కేంద్రీకృత విధానంలో పాలించాలన్న భావజాలం బీజేపీ, ఆరెస్సెస్‌ల నరనరాన నిండిపోయిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు మాత్రం అన్ని రాష్ట్రాలకు, అన్ని ప్రాంతాలకు సమప్రాధాన్యం లభించే స్థానిక స్వపరిపాలనే మూలమంత్రమని చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా శుక్రవారం అసోంలోని గోగాముఖ్ వద్ద బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాలతో సమ ప్రాధాన్యముందని చాటేందుకే యాత్రను మణిపూర్ నుంచి మొదలు పెట్టానని చెప్పారు. ''దేశ చరిత్రలో తొలిసారిగా ఒక రాష్ట్రంలో అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్నా ప్రధాని మోదీకి అక్కడ పర్యటించే తీరిక లేదు'' అన్నారు.

పాలనలో రాముడే స్ఫూర్తి: మోదీ

22న ఇంటింటా రామజ్యోతి వెలగాలని పిలుపు

- మహారాష్ట్రలో 90 వేల 'పీఎం ఆవాస్' ఇళ్లు పంపిణీ
- బాల్యంలో తనకిలాంటి ఇల్లు లేకపోయిందంటూ భావోద్వేగం


శుక్రవారం షోలాపూర్‌లో పీఎం ఆవాస్ యోజన ఇంటిని పరిశీలిస్తున్న మోదీ

షోలాపూర్/: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రీరాముని స్ఫూర్తితో నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం అయోధ్యలో జరగనున్న రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను చరిత్రాత్మక సందర్భంగా అభివర్ణించారు. ఆ రోజున దేశమంతటా ఇంటింటా రామజ్యోతిని వెలిగించాలని మరోసారి పిలుపునిచ్చారు. అది పేదరిక నిర్మూలనకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ప్రధానిగా తాను మూడోసారి విజయం సాధించాక 'మోదీ హామీ'ల దన్నుతో భారత్‌ను ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. శుక్రవారం మహారాష్ట్రలోని షోలాపూర్‌లో రూ.2,000 కోట్ల విలువైన 8 అమృత్ ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రంలో నిర్మాణం పూర్తయిన 90 వేలకు పైగా ఇళ్లను లాంఛనంగా పేదలకు అందజేశారు. పీఎం స్వానిధి పథకం కింద 10 వేల మంది లబ్ధిదారులకు ఒకటో, రెండో వాయిదాల చెల్లింపుకు శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ''దేశమంతటా గొప్ప ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంది. నాసిక్‌లో గత వారం అనుష్టానం మొదలు పెట్టాను. మీ ఆశీస్సులతో అయోధ్య వెళ్తున్నా'' అని ప్రకటించారు. ఇళ్లు పొందిన లబ్ధిదారులను చూస్తుంటే తన హృదయం ఆనందంతో నిండిపోతోందంటూ భావోద్వేగానికి లోనయ్యారు. బాల్యంలో తనకిలాంటి ఇంట్లో ఉండే అవకాశం లేకపోయిందని చెమర్చిన కళ్లతో గుర్తు చేసుకున్నారు. ''ప్రజల కలలు నెరవేరినప్పుడే నిజమైన ఆనందం. వారి ఆశీస్సులే నాకు అతి పెద్ద పెట్టుబడి. గత ప్రభుత్వాల్లో పేదల సంక్షేమానికి కావాల్సిన నియత్ (ఉద్దేశం), నీతి (విధానం), నిష్ట (చిత్తశుద్ధి) లోపించాయి. పేదల సంక్షేమం, శ్రామికుల గౌరవం కోసం 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లు, 10 కోట్లకు పైగా టాయ్‌లెట్లు నిర్మించాం'' అని చెప్పారు.

బోయింగ్ క్యాంపస్ ప్రారంభం

దొడ్డబళ్లాపురం/సాక్షి, చెన్నై: భారత్ శరవేగంగా సాధిస్తున్న ప్రగతిని అందిపుచ్చుకోవాల్సిందిగా అంతర్జాతీయ పెట్టుబడిదారులకు మోదీ పిలుపునిచ్చారు. పాతికేళ్లలో సంపన్న భారత నిర్మాణమే ప్రతి భారతీయుని లక్ష్యంగా మారిందన్నారు. ఆ దిశగా 25 కోట్ల భారతీయులను గత తొమ్మిదేళ్లలో పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చినట్టు చెప్పారు. వైమానిక రంగంలోనూ దేశం శరవేగంగా ప్రగతి సాధిస్తోందని హర్షం వెలిబుచ్చారు. బెంగళూరు శివార్లలో దేవనహల్లి హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్ క్యాంపస్‌లో రూ.1,600 కోట్లతో నిర్మించిన బోయింగ్ నూతన గ్లోబల్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కేంద్రాన్ని మోదీ ప్రారంభించారు. భారత సామర్థ్యంపై ప్రపంచం పెట్టుకున్న నమ్మకానికి ఈ క్యాంపస్ తాజా నిదర్శనమన్నారు. భారత్ గత కొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశీయ వైమానిక మార్కెట్‌గా ఎదిగిందని గుర్తు చేశారు. అనంతరం మూడు రోజుల తమిళనాడు పర్యటన నిమిత్తం మోదీ చెన్నై చేరుకున్నారు. అభిమానులు, బీజేపీ మద్దతుదారుల స్వాగతం నడుమ నెహ్రూ స్టేడియం దాకా 4 కిలోమీటర్ల మేర రోడ్ షో జరిపారు. అక్కడ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2023ను ప్రారంభించారు. 2029 యూత్ ఒలింపిక్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహణకు వేదికగా భారత్‌ను తీర్చిదిద్దుతామని ప్రధాని ప్రకటించారు.

మహిళలే వృద్ధి సారథులు

భారత్‌లో ప్రతి రంగంలోనూ మహిళల సారథ్యానికి పెద్దపీట వేస్తున్నట్టు మోదీ చెప్పారు. వైమానిక రంగంలోనూ మహిళలకు నూతన అవకాశాలు కల్పించేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ఇందుకుద్దేశించిన 'బోయింగ్ సుకన్య' పథకాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రారంభించారు. భారత పైలట్లలో 15 శాతం మహిళలేనని మోదీ గుర్తు చేశారు. అంతర్జాతీయ సగటు కంటే ఇది మూడు రెట్లు ఎక్కువన్నారు. సుకన్య పథకం కింద సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) తదితరాల్లో విద్యాభ్యాసానికి అమ్మాయిలకు అవకాశం కల్పించి వైమానిక రంగ ఉద్యోగాలకు అర్హులుగా తీర్చిదిద్దుతామని బోయింగ్ ప్రకటించింది. పైలట్ శిక్షణకు మహిళలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామని పేర్కొంది.

సిద్ధూ, అది సహజం!

'మోదీ.. మోదీ' నినాదాలపై ప్రధాని

బెంగళూరు బోయింగ్ క్యాంపస్ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని ప్రసంగిస్తుండగా సభికులంతా మోదీ, మోదీ అంటూ పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. దాంతో ఆయన కాసేపు ప్రసంగాన్ని ఆపేసి వింటూ ఉండిపోయారు. వేదికపై కూర్చుని దీనంతటినీ తిలకిస్తున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య వైపు తిరిగి, ''ముఖ్యమంత్రి జీ! ఐసా హోతా రహతా హై (అలా జరుగుతూంటుంది) అంటూ చమత్కరించారు. దాంతో సీఎంతో పాటు వేదికపై ఉన్న గవర్నర్ తదితరులు చిరునవ్వులు చిందించారు.

సుప్రీం జడ్జిగా కర్ణాటక సీజే

కేంద్రానికి కొలీజియం సిఫార్సు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి.వరాలే పేరును కొలీజియం సిఫార్సు చేసింది. ఆయన స్థానంలో జస్టిస్ పి.ఎస్.దినేశ్‌కుమార్‌ను కర్ణాటక హైకోర్టు సీజేగా నియమించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు కొలీజియం శుక్రవారం సమావేశమై ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకుంది. జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సి.టి.రవికుమార్ అనంతరం సుప్రీంకోర్టులో ఎస్సీ సామాజిక వర్గం నుంచి మూడో న్యాయమూర్తిగా జస్టిస్ వరాలే నిలవనున్నారు. ''జస్టిస్ ఎస్.కె.కౌల్ రిటైర్మెంట్‌తో గత డిసెంబర్ 25 నుంచి సుప్రీంకోర్టులో ఒక న్యాయమూర్తి స్థానం ఖాళీగా ఉంది. న్యాయమూర్తులపై పనిభారం ఎక్కువగా ఉన్నందున ఖాళీలుండరాదు. అందుకే జస్టిస్ వరాలే పేరును సిఫార్సు చేస్తున్నాం'' అని కొలీజియం పేర్కొంది.

56 మంది సుప్రీం న్యాయవాదులకు సీనియర్ హోదా

11 మంది మహిళలతో సహా 56 మంది న్యాయవాదులను సీనియర్ న్యాయవాదులుగా సుప్రీంకోర్టు నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. వీరిలో తెలుగు న్యాయవాది శ్రీధర్ పోతరాజు కూడా ఉన్నారు.

'బిల్కిస్' దోషుల పిటిషన్లు కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో దోషులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. లొంగిపోయేందుకు మరింత గడువు కోరుతూ వారు వేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇందుకు వారు చూపుతున్న కారణాలు సరైనవి కాదని పేర్కొంది. 2002లో గుజరాత్ మత కలహాల సమయంలో బిల్కిస్ బానో అనే మహిళపై గ్యాంగ్ రేప్, ఆమె కుటుంబంలోని ఏడుగురి హత్యకు సంబంధించిన కేసులో 11 మంది దోషులను క్షమాభిక్ష కింద విడుదల చేయడంపై స్టే విధించిన సుప్రీంకోర్టు జనవరి 21వ తేదీలోగా లొంగిపోవాలని వారిని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, అయిదుగురు దోషులు వివిధ వ్యక్తిగత కారణాలు చూపుతూ లొంగిపోయేందుకు మరింత సమయం కావాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వారు చూపుతున్న కారణాలు సరైనవి కావని పేర్కొంటూ పిటిషన్లను కొట్టివేసింది. వెంటనే లొంగిపోవాలని వారిని ఆదేశించింది.

డేరా చీఫ్‌కు 50 రోజుల పెరోల్

చండీగఢ్: అత్యాచారం కేసులో దోషిగా ఉన్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు కోర్టు 50 రోజుల పెరోల్ మంజూరు చేసింది. ఆయన ప్రస్తుతం హరియాణాలోని సునారియా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. 2022లో మూడు విడతల్లో దాదాపు మూడు నెలలు, 2023లో రెండు విడతల్లో కలిపి 70 రోజుల పెరోల్‌ను కోర్టు ఆయనకు మంజూరు చేసింది. ఆ సమయంలో యూపీలోని బర్నావాలో ఉన్న ఆశ్రమంలో గడిపారు. ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో డేరా బాబా ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారు. పలు హత్య కేసుల్లోనూ ఆయన నిందితుడిగా ఉన్నారు.

లాలూ, తేజస్వీలకు ఈడీ మళ్లీ సమన్లు

పట్నా: రైల్వే శాఖలో భూములకు బదులు ఉద్యోగాల కుంభకోణం కేసులో హాజరు కావాలంటూ ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్, కుమారుడు తేజస్వీ యాదవ్‌లకు ఈడీ మరోసారి సమన్లు పంపింది. లాలూను ఈ నెల 29వ తేదీన, తేజస్విని 30వ తేదీన పట్నాలోని తమ కార్యాలయంలో జరిగే విచారణకు రావాలంటూ అందులో కోరింది. నోటీసులు అందజేసేందుకు ఈడీ అధికారులు శుక్రవారం లాలూ భార్య, బిహార్ మాజీ సీఎం రబ్రీదేవి నివాసానికి వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత సమన్లకు లాలూ, తేజస్వీ స్పందించలేదు. యూపీఏ–1 ప్రభుత్వ హయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఎస్పీ, ఆర్‌ఎల్‌డీ ఉమ్మడి పోరు

లక్నో: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కలిసి పోటీ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), రాష్ట్రీయ లోక్ దళ్(ఆర్‌ఎల్‌డీ) నిర్ణయించుకున్నాయి. యూపీలో తమ పార్టీకి ఏడు సీట్లు కేటాయించేందుకు ఎస్పీ అంగీకరించిందని ఆర్‌ఎల్‌డీ ప్రకటించింది. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్‌ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి సోషల్ మీడియా వేదికగా ఈ విషయం వెల్లడించారు. యూపీలో ఉన్న 80 లోక్‌సభ స్థానాల్లో ఆర్‌ఎల్‌డీ పోటీ చేయనున్న సీట్లేమిటనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసే పోటీ చేయగా ఎస్పీకి 111 సీట్లు, ఆర్‌ఎల్‌డీకి 8 సీట్లు దక్కాయి.

గణతంత్ర వేడుకల్లో మహిళా శక్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో నారీసేన సత్తా చాటనుంది. జనవరి 26న మూడు మహిళా కంటింజెంట్లు కవాతులో పాల్గొననున్నాయి. నారీ శక్తి థీంలో భాగంగా మొట్టమొదటిసారి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌కు చెందిన మహిళా వైద్యులు, నర్సుల బృందం కవాతు చేయనుంది. 144 మందితో కూడిన త్రివిధ దళాల బృందం కూడా పరేడ్‌లో పాల్గొననుంది. దీనిలో 60 మంది సైనికులు కాగా మిగిలిన వారు ఎయిర్‌ఫోర్స్, నేవీలకు చెందిన వారు. మునుపెన్నడూ లేనివిధంగా ఢిల్లీ మహిళా పోలీసులు సైతం ఈసారి కవాతులో భాగస్వాములు కానున్నారు. ఇందుకోసం మహిళా పోలీసులు ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. గత ఏడాది జరిగిన వేడుకల్లో మహిళల కవాతు దేశ ప్రజల్ని విశేషంగా ఆకట్టుకుంది. గత ఏడాది 144 మంది సీఆర్పీఎఫ్, 144 ఎయిర్ వారియర్ కంటింజెంట్‌లు పాల్గొన్నాయి.

కాగితపు జెండాలను రోడ్లపై పడేయొద్దు

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయుల ఆకాంక్షలకు స్ఫూర్తి అయిన త్రివర్ణ పతాకాన్ని గౌరవించుకోవడం అందరి బాధ్యత అని, జాతీయ జెండాకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం రోడ్లపై కాగితపు జెండాలను పడేయొద్దని ప్రజలకు సూచించింది. కార్యక్రమాలు ముగిసిన వెంటనే కాగితపు జెండాలను జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలని సూచించింది.

అణు డ్రోన్‌ను పరీక్షించిన ఉత్తరకొరియా

సియోల్: ఉత్తరకొరియా అణ్వాయుధాల సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. తాజాగా పశ్చిమ సముద్ర జలాల్లో అణు దాడి చేసే సామర్థ్యమున్న డ్రోన్‌ను పరీక్షించినట్లు శుక్రవారం ప్రకటించింది. పోర్టులు, యుద్ధ నౌకలను ధ్వంసం చేసే సామర్థ్యం ఈ డ్రోన్‌కు ఉందని తెలిపింది. దక్షిణ కొరియా, అమెరికా, జపాన్‌లు కలిసి ఈ వారంలో జెజు దీవికి సమీపంలో చేపట్టిన భారీ సైనిక విన్యాసాలకు స్పందనగానే తామీ పరీక్ష జరిపినట్లు చెప్పుకుంది. గత ఏడాది మొదటిసారిగా ఈ డ్రోన్‌ను పరీక్షించినట్లు తెలిపింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెంచుతూ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పర్యవసానాలుంటాయని హెచ్చరించింది.

థాయ్ రాచరికంపై విమర్శలు.. 50 ఏళ్ల జైలు

బ్యాంకాక్: దేశంలోని రాచరిక వ్యవస్థను అగౌరవపరిచిన ఓ వ్యక్తికి థాయ్‌ల్యాండ్ కోర్టు రికార్డు స్థాయిలో 50 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కఠిన చట్టాలు అమల్లో ఉన్న థాయ్‌ల్యాండ్‌లో ఇంతటి భారీ శిక్షను విధించడం ఇదే మొదటిసారని హక్కుల సంఘాలు అంటున్నాయి. చియాంగ్ రాయ్ ప్రావిన్స్‌కు చెందిన మొంగ్‌కొల్ తిరఖోట్(30) ఆన్‌లైన్‌లో వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. రాజకీయ హక్కుల కార్యకర్త కూడా. రాజు ప్రతిష్టకు భంగం కలిగేలా ఆన్‌లైన్‌లో పోస్టులు పెట్టారంటూ 2023లో కోర్టు ఈయనకు 28 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మరో 12కు పైగా చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలడంతో గురువారం ఆయనకు మరో 22 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ప్రపంచంలోనే అత్యంత కఠిన రాజరిక చట్టాలు థాయ్‌ల్యాండ్‌లో అమలవుతున్నాయి. రాజు, రాణి, వారసులను విమర్శిస్తే 15 ఏళ్ల జైలు శిక్ష ఖాయం.

చంద్రుడిపై దిగిన జపాన్ అంతరిక్ష నౌక

టోక్యో: తమ మానవరహిత అంతరిక్ష నౌక చంద్రమండలంపై దిగిందని జపాన్ అంతరిక్ష సంస్థ తెలిపింది. అయితే, దాని పరిస్థితి ఏమిటనే విషయంలో స్పష్టత రావాల్సి ఉందని వెల్లడించింది. స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్(స్లిమ్) చంద్రుడి ఉపరితలంపై ఉదయం 12.20 గంటల సమయంలో దిగిందని పేర్కొంది. తాజా విజయంతో చంద్రుడిపైకి విజయవంతంగా అంతరిక్ష నౌకను పంపిన ఐదో దేశంగా జపాన్ అవతరించింది.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 20 । జనవరి । 2024



నిత్యాన్నదానానికి విరాళం


ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన సీతా రాజ్యలక్ష్మి రూ. 1.00.116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.



స్థల పరిశీలన..

గురజాడ బైపాస్‌లో సుధీర్ టింబర్ డిపో ఇథనాల్ ప్లాంట్ నిర్మించనుంది. దీనికి స్థలం కోసం కృష్ణా జేసీ గీతాంజలి పరిశీలన చేశారు.

-8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,940 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

యోగి వేమన జీవితం ఆదర్శనీయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. వేమన సామాజిక చైతన్యానికి ప్రతీక అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో యోగి వేమన జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత వేమన చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక చైతన్యంతో కూడిన వేమన పద్యాల సాహిత్య ఔన్నత్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సమాజంలోని వివిధ సమస్యలను భిన్న కోణాల్లో స్పృశించి.. వేమన తన పద్యాల్లో విలువలను చొప్పించారని పేర్కొన్నారు. నేటి తరానికి యోగి వేమన జీవితం, శతక సాహిత్యం గురించి అవగాహన పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో వేమన పద్యాలు ప్రతి ఒక్కరి హృదయాలను స్పందింపజేస్తాయని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

కురుమద్దాలి(పామర్రు): డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధి కురుమద్దాలి గ్రామంలోని రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 22వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు ఈ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. ఈ కోర్సుకు పదవ తరగతి ఆపైన చదివిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్సులతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8074370846లో సంప్రదించాలని సూచించారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 4.08 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణల నేపథ్యంలో భవానీలు అమ్మవారికి హుండీల ద్వారా రూ. 4.08 కోట్ల కానుకలను, మొక్కుబడులను సమర్పించారు. అమ్మవారికి భవానీలు సమర్పించిన కానుకల లెక్కింపు రెండో రోజు శుక్రవారం కొనసాగింది. మొదటి రోజైన గురువారం రూ. 2,70,48,680 నగదుతో పాటు 280 గ్రాముల బంగారం, 18 కేజీల వెండి లభ్యమైంది. శుక్రవారం రూ. 1,38,15,864 నగదుతో పాటు 78 గ్రాముల బంగారం, 8.425 కిలోల వెండి లభ్యమైందని ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు. మొత్తం రూ. 4,08,64,534 నగదు లభించిందన్నారు. కానుకల లెక్కింపును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించగా, దేవదాయ శాఖ, పోలీసు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



బాణసంచా వెలుగుల్లో స్మృతిమూర్తి

వ్యక్తిత్వ నిర్మాణానికి, సాంస్కృతిక విప్లవ పునరుజ్జీవానికి సాహిత్యంతో పాటు శిల్ప సంపద కూడా ఎంతో ఉపయుక్తం. కొన్ని శిల్పాలు మానవ మస్తిష్కాన్ని ప్రజ్వలింపజేస్తాయి. అటువంటి మహా శిల్పం విజయవాడ నడిబొడ్డున ఠీవిగా నిలబడింది. బోధించు, సమీకరించు, పోరాడు అనే ఆ దార్శనీకుడి నినాదాన్ని ఈ నిలువెత్తు విగ్రహం పదే పదే గుర్తు చేసి ప్రజలను చైతన్యవంతం చేసేలా కొలువుదీరింది. ఒకప్పుడు విజయవాడ అంటే దుర్గమ్మవారు, ప్రకాశం బ్యారేజీ వంటివి గుర్తొచ్చేవి. ఇకపై స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరుతో ప్రపంచ పటంలో ప్రత్యేకంగా నిలవనుంది. నగరంలోని స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం శుక్రవారం ఆవిష్కృతమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. బాణసంచా కాంతులు.. జిగేల్ మనిపించేలా లేజర్, డ్రోన్ ప్రదర్శనలు.. జనవాహిని జయజయధ్వానాలు.. అతిరథ మహారథుల హర్షధ్వానాలు రాష్ట్రానికి బెజవాడను సరికొత్తగా పరిచయం చేశాయి.

మహాద్భుతం.. ఆవిష్కృతం

బెజవాడ నడిబొడ్డున ఠీవిగా నిలబడిన ఆదర్శమూర్తి

- అట్టహాసంగా అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభం
- ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జన సంద్రమైన బెజవాడ
- జై భీమ్.. జయహో జగన్ నినాదాలతో మార్మోగిన వీధులు
- ఆకట్టుకున్న లేజర్, డ్రోన్ షోలు
- నేటి నుంచి ప్రజా సందర్శనకు అనుమతి



అంబేడ్కర్ విగ్రహం పాదాలకు పుష్పాభిషేకం చేస్తున్న సీఎం



అంబేడ్కర్ స్మృతివనం లోపలికి వెళ్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్



మ్యూజియంలో చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బెజవాడలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. భారత రత్న, బాబా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో తరలి వచ్చిన జన సందోహం మధ్య కనుల పండువగా కార్యక్రమం సాగింది. సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ విగ్రహం నిలిచింది. సామాజిక చైతన్యవాడగా విజయవాడ మురిసిపోయింది. విజయవాడ నడిబొడ్డున దేశానికే తలమానికంగా స్వరాజ్ మైదానంలో 18.18 ఎకరాల్లో రూ.404.35 కోట్లతో ప్రభుత్వం దీనిని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. దీని ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సామాజిక సమతా సంకల్ప సభకు జనాలు పోటెత్తారు. ఉదయం 10 గంటల నుంచే ఇందిరాగాంధీ స్టేడియానికి ప్రజలు రావడం మొదలైంది. మధ్యాహ్నానికే స్టేడియం ప్రాంగణం, గ్యాలరీలు నిండిపోయాయి. బందరు రోడ్డు జనాలతో కిక్కిరిసిపోయింది. ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకోగానే, జనాలు కేరింతలు కొడుతూ తమ అభిమాన నేతకు స్వాగతం పలికారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు యువత కేరింతలు కొట్టారు. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అంటే ఇక విజయవాడ గుర్తుకు వస్తుందని, సీఎం అన్నప్పుడు జయోత్సాహ నినాదాలు చేశారు. 'అంబేడ్కర్ భావజాలం పెత్తందారులకు నచ్చదు' అని సీఎం అన్నప్పుడు, తగిన బుద్ధి చెబుతామని పెద్ద పెట్టున నినదించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు వందన సమర్పణ చేశారు.

కనుల పండువగా మహా ఘట్టం..

సామాజిక సమతా సంకల్ప సభ అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన స్వరాజ్ మైదానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సులో ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు. విద్యుత్‌కాంతులు జిగేల్ మంటూ, అద్భుతమైన బాణసంచా వెలుగుల మధ్య అంబేడ్కర్ స్మృతివనాన్ని జాతికి అంకితం చేశారు. అనంతరం అక్కడ ముఖ్యమంత్రి కలియతిరుగుతూ, గ్రీనరీ, మ్యూజికల్ వాటర్ ఫౌంటైన్లను విద్యుత్ వెలుగుల్లో వీక్షించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే డిజిటల్ మ్యూజియంను ప్రారంభించారు. ఆయన పుట్టినప్పటినుంచి, మరణించే వరకు కళ్లకు కట్టేలా ఉన్నజీవిత విశేషాలను ఆసక్తిగా తిలకించారు. 75 మంది సీటింగ్ కెపాసిటీతో అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఆంపీ థియేటర్‌నూ సందర్శించారు. లిఫ్టులో అంబేడ్కర్ పాదాల వద్దకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున జనాలు తరలి వచ్చినా నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.



అంబేడ్కర్, సీఎం జగన్ చిత్రపటాలతో యువతి



కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, ప్రభుత్వ విప్ ఉదయభాను, జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాలహారిక, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, అరుణకుమార్, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, కైలే అనిల్ కుమార్, వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, సింహాద్రి రమేష్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు, వెస్ట్ ఇన్‌చార్జి ఆసిఫ్, పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త అనుభూతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలివచ్చిన ప్రజలతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, నగర వీధులు కిక్కిరిశాయి. దీంతో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ల వద్ద నిలబడి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వీక్షించారు. విగ్రహం వద్ద లేజర్ షో, ఆకాశంలో డ్రోన్ షో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. లయబద్ధంగా బాణసంచా పేల్చారు. డ్రోన్ షో, క్రాకర్స్ షో ఉన్నంత సేపు ప్రజలు ఆకాశం వైపు చూస్తూ ఆ అపురూప సన్నివేశాలను తమ సెల్ ఫోన్లలో బంధించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించిన ప్రతి సన్నివేశాన్ని ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. నగరంలో తొలిసారిగా నిర్వహించిన డ్రోన్ షో ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఆకాశంలో కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా, కూచిపూడి నృత్యం, సీఎం వైఎస్ జగన్ అభివాదం, స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్, కొండారెడ్డి బురుజు, అంబేడ్కర్ విత్ పార్లమెంట్, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాష్ట్ర మ్యాప్, గోదావరి బ్రిడ్జి, బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు రూపాలను డ్రోన్‌షోలో ప్రదర్శించారు. వీటిని మొబైల్స్‌లో బంధించేందుకు జనం పోటీ పడ్డారు.





ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో యువకుల ఆనందోత్సాహాలు



జనాలతో కిక్కిరిసిన ఇందిరాగాంధీ స్టేడియం

విదేశీ విహంగామా

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): ఆస్ట్రేలియా ఖండపు ఎర్రకాళ్ల కొంగల (పెయింటెడ్ స్టార్క్స్) సందడి మొదలైంది. ఏటా ఈ పక్షులు వేల మైళ్లు ప్రయాణించి నవంబర్, డిసెంబర్ నెలల్లో పెనుగంచిప్రోలు మండలంలోని వెంకటాపురం చేరుకుంటాయి. ఇదే క్రమంలో ఈ ఏడాది నాలుగు రోజుల కిందట గ్రామానికి వచ్చాయి. ఈ పక్షులు ఆరు నెలల పాటు ఇక్కడి చెట్లపై ఆవాసాలు ఏర్పాటు చేసుకొని గుడ్లుపెట్టి, పిల్లలను వృద్ధి చేసుకొని మే చివరి వారం లేదా జూన్‌లో తిరిగి తమ ప్రాంతానికి వెళ్తాయి. కొల్లేరు తర్వాత విదేశీ పక్షులు అధికంగా వచ్చేది వెంకటాపురం గ్రామానికే. ఈ గ్రామం పెనుగంచిప్రోలుకు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

గ్రామానికి మేలు..

విదేశీ పక్షుల రాకతో గ్రామస్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తారు. ఏటా గ్రామానికి వచ్చే పక్షులను గ్రామస్తులు పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలా జాగ్రత్తగా చూసుకుంటారు. ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఈపక్షుల వల్లే తమ గ్రామం పాడిపంటలు, సుఖ శాంతులతో వర్ధిల్లుతుందని వారి నమ్మకం.



వెంకటాపురంలో ఎర్రకాళ్ల కొంగలు

పక్షుల కోలాహలం..

రంగు రంగుల రెక్కలు, పొడవాటి ఎర్రని ముక్కులు, పెద్ద శరీరం, పెద్ద కళ్లతో చూపరులకు ఎంతో సంతోషాన్నిచ్చేలా ఈపక్షులు సందడి చేస్తాయి. వాటి కోలాహలం మంత్ర ముగ్ధులను చేస్తుంది. రాత్రిళ్లు అవి చేసే పెద్ద అరుపులను సైతం పట్టించుకోకుండా గ్రామస్తులు వాటి సంరక్షణను తమ బాధ్యతగా చూసుకుంటారు. ముందుగా కొన్ని పక్షులు గ్రామానికి వచ్చి పరిసరాలు, ఆహార లభ్యత చూసుకొని అనువుగా ఉంటే వెనక్కు వెళ్లి తోటి పక్షులతో గ్రామానికి చేరుకుంటాయి. సమీపంలో దొరికే పుల్లలు, గడ్డిని తెచ్చి చెట్ల కొమ్మలపైకి చేర్చి గూడులు చేసి గుడ్లు పెడతాయి. చెరువులు, మునేరులో చేపలు తిని బతుకుతాయి. గత ఏడాది లాగానే ఈఏడాది కూడా చెరువుల్లో, గ్రామంలో ఉన్న నీటి కుంటలో నీరు పుష్కలంగా ఉండటంతో పక్షులకు తాగునీటి కష్టాలు తొలిగినట్టే అని గ్రామస్తులు అంటున్నారు.

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో తీసుకున్న చర్యలను కలెక్టర్ ఎన్నికల అధికారికి వివరించారు. ఈ నెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల వివరాలను సేకరించి పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.సురేష్, డీటీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

షాబూఖారీ దర్గా 427వ ఉరుసు వేడుకల ఏర్పాట్లు



కొండపల్లిలో ఉరుసు ఉత్సవాల ఏర్పాట్లు వెల్లడించిన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ప్రసిద్ధి గాంచిన షాబూఖారీ దర్గా 427వ ఉరుసు మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మసీదు పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లను ఆయన వివరించారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో వైభవంగా ఉత్సవాలు జరుపుతామని, వేడుకలకు సుమారు 2 లక్షల మంది భక్తులు కుల మతాలకు అతీతంగా హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డెప్యూటీ సీఎం అంజాద్ బాషా చొరవతో దర్గాకు వెళ్లేందుకు ఎన్టీటీపీఎస్ ప్రాంగణం నుంచి దారి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్పీఎఫ్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ముతవల్లీలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధికి భక్తుల రద్దీ



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గ మాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చనతో పాటు శాంతి కల్యాణం, చండీహోమంకు ఉభయదాతలు విశేషంగా హాజరయ్యారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు పలు మార్లు క్యూలైన్లను పర్యవేక్షించారు. వీఐపీల పేరిట వచ్చే వారిని సైతం రూ.500 క్యూలైన్‌లోనే అమ్మవారి దర్శనానికి అనుమతించాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. సాయంత్రం అమ్మవారి పంచ హారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

జేసీ గీతాంజలి శర్మ



గురజాడలో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ గీతాంజలి

పమిడిముక్కల: తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలుకు తగు చర్యలు తీసుకుంటామని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ రైతులకు హామీ ఇచ్చారు. రైతుల ఇబ్బందులను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జేసీ శుక్రవారం గురజాడ వెళ్లి రైతుల సమస్యలు స్వయంగా తెలుసుకున్నారు. తుపాను వల్ల వరికుప్పల్లో నీరు చేరిందని, కుప్ప నూర్పిళ్లు చేస్తుంటే ధాన్యం తడిసి రంగు మారిందని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తుంటే చాలా తక్కువ ధర వస్తోందని, తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు. మిల్లర్లు ఆఫ్‌లైన్ ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చేస్తే తమకు మెరుగైన ధర వస్తుందని వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని జేసీ వారికి హామీ ఇచ్చారు.

ఇథనాల్ ప్లాంట్‌కు స్థల పరిశీలన..

గురజాడ బైపాస్‌లో సుధీర్ టింబర్ డిపో వారు నిర్మించనున్న ఇథనాల్ ప్లాంట్‌కు స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్వేయర్ మణికుమార్, ఏఓ గణేష్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కరణలు-యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై సదస్సు



మాట్లాడుతున్న మోహనరావు

పటమట(విజయవాడతూర్పు): విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులు, సవాళ్లను విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.మోహనరావు అన్నారు. స్టెల్లా కళాశాల, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విద్యావ్యవస్థలో నూతన ఆవిష్కరణలు, సవాళ్లపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థలో ప్రపంచస్థాయి సంస్థలతో కలవటం ద్వారా ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. డిగ్రీతో పాటు కరెంట్ అఫైర్స్ పై పట్టు సాధించాలని, జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ ప్రతిభను మెరుగుపరచుకోవాలన్నారు. యువత రాబోయే కాలానికి టార్చ్ బేరర్స్‌గా ఉండాలని, దేశ భవిష్యత్తు ప్రతిభ కలిగిన ఉత్తమ పౌరుల చేతిలోనే ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లీన క్వాడ్రస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడి అరెస్టు

పిడుగురాళ్ల: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడు షేక్ షమీవుల్లాను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దిశ డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందం ఉపాధ్యాయుడు షమీవుల్లాను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. గురజాల కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.

రాస్తాకు రాజసం

గూడూరు నుంచి నియోజకవర్గ కేంద్రం పెడన ఏడు కిలో మీటర్ల దూరంలో ఉంది. కొన్నేళ్లుగా ఈ రోడ్డు పాడవడంతో పాటు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు దీనిపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.9.70 కోట్లు మంజూరు చేసింది. దీంతో విస్తరణ, రోడ్డు పనులు చకచకా నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు దీనిని తుమ్మలపాలెం, పర్ణశాల గ్రామాల (12 కిలో మీటర్లు) వరకు పొడిగించింది. ఫలితంగా పెడన, పోసినవారిపాలెం, కప్పలదొడ్డి, ఆకులమన్నాడు, నారికేడాలపాలెం (శారదాయిపేట), గూడూరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు చేస్తున్నారు.



ఏడాది క్రితం పెడన - గూడూరు మధ్య రోడ్డు పరిస్థితి



పెడన - గూడూరు మధ్య సరికొత్తగా తారు రోడ్డు

సాక్షి, మచిలీపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దారి కష్టాలు తొలగించేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. కొత్త రోడ్లు వేయడంతో పాటు పట్టణ, గ్రామీణ రోడ్ల నిర్వహణకు పరిమితులు లేకుండా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులను నాణ్యతతో పూర్తి చేయించడంతో అనేక గ్రామాలు, పట్టణ ప్రజల కష్టాలు తొలగిపోయాయి. జనం ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రహదారులతో పాటు గ్రామీణ, పట్టణ రోడ్ల కోసం కేవలం కృష్ణా జిల్లాలోనే నాలుగున్నరేళ్లలో రూ.462 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

టీడీపీ హయాంలో ఇలా..

టీడీపీ హయాం (2014–2019)లో గ్రామీణ రోడ్లను పూర్తిగా విస్మరించారు. రోడ్ల నిర్వహణకు పిడికెడు మట్టి కూడా వేయలేని పరిస్థితి ఉండేది. ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన(పీఎంజీఎస్వీ)లో భాగంగా వేసిన రోడ్లను ఐదేళ్ల అనంతరం పీరియాడికల్ మెయింటెనెన్స్ కింద నిర్వహించాల్సి ఉంది. అయితే టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్ల నిర్వహణకు నయాపైసా నిధులను మంజూరు చేయలేదు. అలాగే ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్పీ) వేయాల్సిన రోడ్లను పట్టించుకోలేదు.

సరికొత్తగా రహదారుల దర్శనం

- నాలుగున్నరేళ్లలో బాగుపడిన పట్టణ, గ్రామీణ రోడ్లు
- నిర్వహణ, కొత్త రోడ్లకు రూ.462 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- వాటితో 55 తారు, బీటీ రోడ్లు నిర్మాణం
- టీడీపీ హయాంలో పట్టించుకోని రోడ్లకు సైతం పరిష్కారం
- రహదారి కష్టాలు తొలగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

లుక్ మార్చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ రోడ్లతో పాటు గ్రామీణ రహదారులు బాగుపడ్డాయి. వివిధ స్కీముల కింద రూ.445కోట్లు మంజూరు చేయడంతో 55 రోడ్లు వేశారు. దీంతో సుమారు 620 కిలో మీటర్ల మేర రహదారులు బాగు పడడంతో రూపురేఖలు మారిపోయాయి. తాజాగా జిల్లాలోని 42 రోడ్లలో ఏర్పడిన గుంతలు, ప్యాచ్‌లు వర్క్ పనులకు రూ.17కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మా రోడ్డును బాగు చేశారు..



గతంలో మా గ్రామం నుంచి గూడూరుకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డు మార్గం ఉన్నా.. గుంతలతో ఉండేది. ఒకసారి వెళ్లి వస్తే నడుము, ఒళ్లు నొప్పులు వచ్చేవి. కానీ సీఎం జగనన్న కొత్త రోడ్డు వేయడంతో ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పాయి.

– కొనసం నాగుమయ్య (బొజ్జయ్య), కప్పలదొడ్డి

గత ప్రభుత్వం పట్టించుకోలేదు..



గూడూరు నుంచి నియోజకవర్గ కేంద్రం పెడనకు వెళ్లే రోడ్డు బాగా లేక చాలా ఇబ్బందులు పడ్డాం. గత ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులను అడిగితే పట్టించుకోలేదు. నిధులు లేవని అధికారులు చెప్పే వారు. కానీ ఈ ప్రభుత్వం రూ.9.70కోట్లు మంజూరు చేయడంతో మా ఊరు రోడ్డు బాగు పడింది.

– బల్ల శ్యామలరావు, గూడూరు

నాణ్యతతో పనులు



రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులను నాణ్యతతో పూర్తి చేయించాం. గతంలో ఏళ్ల తరబడి నిర్వహణ, మరమ్మతుకు నోచుకోని రోడ్ల రూపురేఖలు కూడా మారిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 620 కిలో మీటర్ల మేర 55 రోడ్ల పనుల్లో 90శాతం పూర్తి కాగా మిగిలిన 10శాతం పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

– ఎ. శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ, ఈఈ, కృష్ణా జిల్లా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



మృతి చెందిన నాగదుర్గాభవాని

పెడన: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గౌరిపర్తి నాగదుర్గాభవాని(35), నాగరాజు వైద్య చికిత్స నిమిత్తం మచిలీపట్నం వచ్చారు. నాగరాజు గత నాలుగు సంవత్సరాలుగా ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకుని మందులను వాడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మచిలీపట్నం వచ్చి తిరిగి దొడ్డిపట్లకు తిరిగి వెళుతుండగా పెడన – గుడివాడ రహదారిలో పెట్రోల్ బంకు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న భవాని వాహనంపై నుంచి కింద పడిపోయింది. నేలదెబ్బ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన ఏఎస్ఐ టి.సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి భవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న బైక్ వ్యక్తి మృతి



విజయ్‌కుమార్ మృతదేహం

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు నవతా రోడ్డు కేసీపీ స్కూల్ వద్ద తుమ్మల విజయ్‌కుమార్ (45) కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతను ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తుంటాడు. గురువారం రాత్రి ఆటోనగర్‌లో పని ఉందని విజయ్‌కుమార్ తన బైక్‌పై రాత్రి ఇంటి నుంచి బయలుదేరాడు. నవతా ట్రాన్స్‌పోర్టు ఆఫీసు దాటిన తరువాత ఎదురుగా వెళుతున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక బైక్‌పై ఉన్న విజయ్ కుమార్ లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రికి అత్యవసర చికిత్సకు తీసుకు వెళ్లగా విజయ్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీఎస్‌పీఎఫ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

- తొలిరోజు హోరాహోరీగా సాగిన పోటీలు
- ప్రారంభించిన డీజీ సీఎం త్రివిక్రమ వర్మ



పోటీల్లో తలపడుతున్న జట్లు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా ఏపీఎస్‌పీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఏపీఎస్‌పీఎఫ్ స్పోర్ట్స్‌మీట్–2024 శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రారంభమయింది. టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో భాగంగా వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను ఎస్పీఎఫ్ డీజీ సీఎం త్రివిక్రమ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం, క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలని తెలిపారు. ఎస్పీఎఫ్ వంటి ప్రత్యేక బలగాలు శారీరకంగా, మానసికంగా పటిష్టంగా ఉండటం ద్వారా మంచి ప్రతిభను కనబరచగలుగుతారని సూచించారు. ఏపీఎస్‌పీఎఫ్ ఆధ్వర్యంలో చాలా రోజుల తరువాత రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏపీఎస్‌పీఎఫ్ ఐజీ బి. వెంకటరామిరెడ్డి, ఏపీఎస్‌పీఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ఎం. శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ కె. కృష్ణమూర్తి, ఏపీ సెక్రటేరియట్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంకేవీఎస్ గుప్తా, గన్నవరం విమానాశ్రయం అసిస్టెంట్ కమాండెంట్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు, విజయవాడ అసిస్టెంట్ కమాండెంట్ డి. రవిశంకరరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.కుమార్ పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన పోటీలలో విజయవాడ, రాజమండ్రి, రాయలసీమ జోన్‌లకు చెందిన 100 మంది ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఆయా జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్పోర్ట్స్ మీట్‌లో మొత్తం 200 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఆరంభం



పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణ, సాయిబాబు, డాక్టర్ షైనీ

తెనాలి: దక్షిణ భారత సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు/మహిళల ఎక్విప్‌మెంట్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలు శుక్రవారం తెనాలిలో ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలిరోజు సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో పోటీల్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ కేపీ ప్రారంభించారు. స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలియజేశారు. ప్రారంభోత్సవం అనంతరం పురుషుల 53, 55 కిలోల విభాగాల్లో పోటీల్ని నిర్వహించారు. సునీల్, శివశంకర్, రవిశంకర్, రాజేంద్రరెడ్డి, లిఫ్టర్లు పాల్గొన్నారు.

చీరకట్టులో ఆస్ట్రేలియన్ వయ్యారం

అలరించిన విద్యార్థినుల ఆటాపాటా



వేదికపై నర్తిస్తున్న ఆస్ట్రేలియా విద్యార్థినులు

తెనాలి: ప్రవాస భారతీయుడు, ఆస్ట్రేలియాలోని నోట్రె డేమ్ యూనివర్సిటీకి సిడ్నీలో గల స్కూల్ ఆఫ్ లా అండ్ బిజినెస్ ప్రొఫెసర్, డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ అత్తోట విద్యాసాగర్ తెనాలిలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద పాఠశాల దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. శీతాకాలం సెలవుల్లో ఏటా విద్యాసాగర్ ఇక్కడి ఆర్ఆర్ నగర్‌లోని పాఠశాలకు వస్తారు. తనతో పాటు ఆస్ట్రేలియాలోని తన విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ఏటా ఇక్కడికి రావటం, పిల్లలకు ఆటపాటలతో పాఠ్యాంశాల బోధనలో కొన్ని రోజులు గడపటం పరిపాటి. ఈ క్రమంలో ఇటీవల ఇక్కడకు వచ్చిన విద్యాసాగర్ బృందం సాంస్కృతిక కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన విద్యార్థినులు భారతీయ సంప్రదాయ చీరెలు ధరించి ఆటపాటలలో పాల్గొని విద్యార్థులను ఆనందింపజేశారు. ముఖ్య అతిథిగా కుమార్ పంప్స్ కొత్త హరికుమార్ హాజరై, అభినందించారు. ప్రిన్సిపాల్ అత్తోట హేమలత, అత్తోట రత్నశేఖర్, విజయకుమార్, కోటేశ్వరరావు, ఆలపాటి సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చారిత్రక ఘట్టం కనులారా చూసి..


ప్లకార్డులు పట్టుకొని తరలివచ్చిన మహిళలు


ర్యాలీగా వస్తున్న అభిమానులు


నృత్యాలు ప్రదర్శిస్తున్న యువతులు


సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు

- యువతలో ఉరకలెత్తిన ఉత్సాహం
- ఉదయం 8 గంటల నుంచే ఐజీఎంసీ స్టేడియానికి రాక
- మధ్యాహ్నం 2 గంటలకే కిక్కిరిసిన స్టేడియం
- జై భీమ్, జై జగన్ నినాదాలతో హోరెత్తిన ఎంజీరోడ్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): చారిత్రక ఘట్టాన్ని కనులారా వీక్షించి జనం పులకించిపోయారు. నగరంలో 206 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం నుంచే నగరంలో రోడ్లన్నీ ప్రజలతో కిక్కిరిసి పోయాయి. దారులన్నీ బెజవాడ స్వరాజ్య మైదానం, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వైపు చూపాయి. మరోవైపు యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది. జై భీమ్, జై జగన్ నినాదాలతో నగరం హోరెత్తింది. స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరుతో ఉన్న హోర్డింగ్‌లను భుజాలపై పెట్టుకుని నృత్యాలు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు , ఆటోల్లో జై భీమ్ జెండాలతో పాటు, వైఎస్సార్ సీపీ జెండాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరిలో ఉత్సాహం, అంబేడ్కరిజం, స్ఫూర్తి ప్రతిబింబించాయి.

ఉదయం నుంచే రాక....

నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, ప్రపంచ మేధావి డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఉదయం నుంచే ప్రజలు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకే సభ నిర్వహించే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు ప్రజలు చేరుకోవడం ప్రారంభించారు. కాగా స్టేడియంలోకి రెండు వైపుల నుంచి ప్రజలకు ప్రవేశం కల్పించారు. వాటర్ ట్యాంక్ రోడ్డులోని గేట్ నంబరు 6 నుంచి, ఈట్‌స్ట్రీట్ వైపు నుంచి కూడా ప్రజలు స్టేడియంలోకి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి గ్రౌండ్‌లో వేసిన కుర్చీలన్నీ నిండిపోగా, రెండు గంటలకు గ్యాలరీ కూడా నిండింది. అనంతరం వచ్చిన వారికి పోలీసులు గ్యాలరీ రెండో అంతస్తుకు పంపించారు. నాలుగు గంటలకు అదికూడా పూర్తిగా నిండిపోయింది. బందరు రోడ్డులో జనం కిక్కిరిపోయారు.


విద్యుద్దీపాల వెలుగుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం



సభలో ఉత్సాహంగా మహిళ

హోరెత్తిన స్టేడియం....

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వచ్చిన వారిలో యువకులు, విద్యావంతులే అధికంగా ఉన్నారు. వారంతా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని స్వయంగా చూడాలని వచ్చినవారే. కొందరు అంబేడ్కర్ బ్యాడ్జిలు ధరించి జై భీమ్ జెండాలతో తరలిరాగా, కొందరు అంబేడ్కర్, వైఎస్ జగన్ చిత్రాలతో కూడిన ప్లకార్డులు చేతపట్టి సభకు విచ్చేసారు. సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభా ప్రాంగణానికి రావడంతో కేరింతలతో స్టేడియం హోరెత్తింది. ఆయన ప్రసంగం ముగిసే వరకూ ఆద్యంతం ఆసక్తిగా విన్నారు.

స్క్రీన్‌ల వద్ద వీక్షణ....

నగరంలో నిర్వహించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రజలంతా వీక్షించేలా పలు ప్రాంతాల్లో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. మహాత్మాగాంధీరోడ్డుతో పాటు, శిఖామణిసెంటర్ రెడ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఆ స్క్రీన్‌ల వద్ద దూర ప్రాంతాల నుంచి వచ్చి స్టేడియానికి చేరుకోలేని వారితో పాటు, నగర ప్రజలు సైతం ఆసక్తిగా వీక్షించారు. అంతేకాకుండా స్టేడియంలో ప్రసంగం ముగిసిన తర్వాత స్వరాజ్య మైదానంలో జరిగిన విగ్రహావిష్కరణను సైతం ప్రజలంతా ఈ స్క్రీన్‌లలోనే వీక్షించారు.


స్వరాజ్‌మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం

కిక్కిరిసిన ఎంజీ రోడు....

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేసిన స్వరాజ్య మైదానం ఎదుట ఎంజీరోడ్డు ప్రజలతో కిక్కిరిసి పోయింది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకున్నారు. అటు నుంచి స్టేడియానికి రావాల్సి ఉన్నా, అద్భుత శిల్పాన్ని చూస్తూ అలాగే ఉండిపోయారు. దీంతో సాయంత్రం 8 గంటల వరకూ అదే రద్దీ నెలకొంది. చీకటి పడిన తర్వాత రంగు రంగుల విద్యుద్దీపాలంకరణతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని చూసి ప్రజలు మురిసిపోయారు.

ప్రత్యేక ఆకర్షణగా డీజే....

పటమట అంబేడ్కర్ నగర్‌కు చెందిన యువత అంబేడ్కర్ ఫొటోతో ప్రభతోపాటు, డీజే ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఐజీఎం స్టేడియం వద్దకు చేరుకోగా, ఆ కాలనీకి చెందిన యువతతో పాటు, దూరప్రాంతాల నుంచి వచ్చిన యువత సైతం అక్కడకు చేరుకుని నృత్యాలు చేశారు. అంతేకాక పలు ప్రాంతాలకు చెందిన వారు బైక్ ర్యాలీలు నిర్వహించారు.


స్క్రీన్‌ల వద్ద వీక్షిస్తున్న ప్రజలు



బస్సులో సభ వద్దకు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


ప్రత్యేక ఆకర్షణగా అంబేడ్కర్ విగ్రహం

క్లుప్తంగా

కులగణన విజయవంతం చేయాలి



పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో విజయవాడ నగర పాలక సంస్థ ప్రథమ పౌరురాలు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం నగరంలో తొలిసారిగా 46వ డివిజన్ సచివాలయం పరిధిలో ఆమె తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించే కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది నగర పౌరుల వద్దకు వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. అందరూ పాల్గొని ఈ సర్వేని విజయవంతం చేయాలని కోరారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ పరిధిలోని కాశేశ్వరరావు మార్కెట్‌లో బ్రిడ్జి వద్ద ఉన్న 900 ఎంఎం డయాపీఎస్‌సీ పంపింగ్ మెయిన్ లైన్ మరమ్మతులు చేస్తున్నందున ఈ నెల 21వ తేదీ నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీనగర్, హనుమాన్‌పేట, పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, బాప్టిస్ట్‌పాలెం , కేదరేశ్వరావుపేట, ఖుద్దూస్‌నగర్, లోటస్ ఏరియా, శ్రీ నగర్ కాలనీ, భాను నగర్, సత్యనారాయణపురం, రామలింగేశ్వరపేట, సత్యనారాయణపురం, దుర్గాపురం, గులాబీతోట, మధురానగర్, టీచర్స్‌కాలనీ, ముత్యాలంపాడు, అరండల్ పేట, సూర్యారావుపేట, గవర్నర్‌పేట, కస్తూరిభాయిపేట, గిరిపురం, దుర్గాఅగ్ర హారం, సీతారాంపురం, బాడవపేట, ఉడ్‌పేట, లబ్బీపేట, మల్లిఖార్జునపేట, ఉప్పరవాగు ప్రాంతాల్లో ఈ నెల 21వ తేదీ ఉదయం నుంచి సాయంత్ర వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని పౌరులు వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జ్యూయలరీ ఎక్స్‌పో ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): యునైటెడ్ ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో యూఇ ది జ్యూయలరీ ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనను ఇన్నర్‌వీల్ క్లబ్ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ హరితా చౌదరి, ఇన్నర్ వీల్ క్లబ్ విజయవాడ ప్రెసిడెంట్ వి. సరోజలతో కలిసి నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముంబయి, న్యూ ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై, జైపూర్, హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు చెందిన జ్యూయలరీ వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వికే మనోజ్ తెలిపారు. ప్రదర్శనలోని గాజులు, ఉంగరాలు, నెక్లెస్లు, ఇయర్ రింగ్స్, పెండెంట్స్, బ్రైడల్ కలెక్షన్స్, మెన్స్ కలెక్షన్స్, చైన్స్, ఇతర ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఒక అద్భుత అవకాశమని పేర్కొన్నారు.

సామాజికసేవలో వ్యవసాయ విద్యార్థులు

పోచంపల్లి (జగ్గయ్యపేట): విద్యార్థులు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పోచంపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు.

వైభవంగా ముగిసిన పేరంటాలమ్మ ఉత్సవాలు

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గత 6 రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రసాదంపాడులో రథోత్సవం ముగింపు అనంతరం ఆలయం ఎదుట అమ్మవారి విగ్రహాలు చేరుకున్నాయి. గ్రామంలోని నూతన వంతెన సమీపంలోని రైవస్ కాలువలో హంస ఆకారంలో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవార్లను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం సమీపంలోని రావిచెట్టు ఎదుట ఇరు గ్రామ పెద్దలు, భక్తులు కలిసి రకరకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అమ్మవార్లను ఉంచి పూలంకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ముగ్గురమ్మలను ఆలయంలోనికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈవో పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామ పెద్దలకు, పోలీసులు, ఆరోగ్య, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామోత్సవ వాహనంలో ఏర్పాటు చేసిన అమ్మవార్ల రథోత్సవ హుండీలు, భక్తులు సమర్పించిన డబ్బుల దండల కానుకల ద్వారా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కలిపి అమ్మవార్లకు రూ.11,38,708 ఆదాయం వచ్చినట్లు ఈవో లోకేశ్వరి చెప్పారు.


రైవస్ కాలువలో తెప్పోత్సవం


ఊయలసేవకై తీసుకొస్తున్న అమ్మవారి ఉత్సవ విగ్రహాలు

అలరించిన రామభక్తి సామ్రాజ్య కృతిగానం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన అయోధ్య రామ మందిరం స్థాపన సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రామభక్తి సామ్రాజ్య కృతి గానం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. వాగ్గేయకారులు రామదాసు, త్యాగరాజస్వామి, అన్నమయ్య, స్వాతి తిరునాళ్ రచించిన శ్రీ రామచంద్ర ప్రభువు కీర్తనలను మధురంగా గానం చేశారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి కళాశాల బాలబాలికలు వీణపైన, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, విష్ణుమూర్తి సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కార్తికేయ ఆదినారాయణ, జగన్మోహిని వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి చిట్టా విశ్వేశ్వరరావు, రామలక్ష్మి నిర్వహించారు.


సంప్రదాయ కీర్తనలను వీణపై పలికిస్తున్న చిన్నారులు

రేపు విశ్వనాథ భాగవతార్ జయంతి

విజయవాడ కల్చరల్: హరికథ రాజహంస, కళాప్రపూర్ణ డాక్టర్ అమ్ముల విశ్వనాథ భాగవతార్ జయంతి సభను ఈ నెల 21వ తేది ఆదివారం సాయంత్రం దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమ్ముల ప్రసాద్, బీవీ దుర్గా భవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి తరం వారికి హరికథ విశిష్టతను తెలియజేయడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే హరికథా భాగవతారిణి వెగలిచర్ల నాగమణికి విశ్వనాథ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సభలో నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు, సంగీత విద్వాంసులు పాల్గొంటారని వివరించారు.

జాతికి స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

విజయవాడ కల్చరల్: భారత జాతికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వరాజ్య మైదానంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రభుత్వ అభినందన కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వించేలా అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి కోట్లాది మంది అభిమానుల కోరికను నెరవేర్చిన ప్రభుత్వ కృషిని అభినందించారు. అలాగే కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వారికి గుర్తింపు కార్డులను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాయనీ గాయకులు సుధారాణి, రేష్మ, షబానా, బీహెచ్ కామేశ్వరి, శ్రావణి, ఆదిరాల జయప్రభ తదితరులు దేశభక్తి గీతాలను ఆలపించారు. అంబేడ్కర్ స్మృతిగీత బృందగానం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, న్యాయవాది చీదెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అంబేడ్కర్ స్మృతిగీతం ఆలపిస్తున్న గాయకులు

బస్టాండ్ నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్ వరకు ర్యాలీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవం సందర్భంగా ఏపీ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవి, కె.ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రానికే వన్నె తెచ్చే విధంగా నగరం నడిబొడ్డులో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతి వనం ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విగ్రహావిష్కరణ మహోత్సవంలో పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.యాకోబు, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎ.థామస్, సెక్రటరీ వి.జయరావు, ప్రతినిధులు ఎంఎస్‌రావు, ఎల ఇమ్మానుయేల్, బి.బి. నాయక్, కె.వి.స్వామి, వై.ప్రసాద్, ఎం.జాన్స్, పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

చరిత్రలో చిరస్థాయిగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు బండి నాగేంద్ర పుణ్యశీల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన 206 అడుగుల విగ్రహం శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవిష్కరించనున్న నేపథ్యంలో 34వ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. ముందుగా ఖుద్దుస్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పుణ్యశీల మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన అయన అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో ఏర్పాటుచేయడం చారిత్రాత్మకం అన్నారు. అనంతరం విగ్రహం ఏర్పాటుకు తరలివెళ్తున్న బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్ బాబు, బండి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సభావేదికపై సీఎం వైఎస్ జగన్, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు





విగ్రహావిష్కరణ అనంతరం ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



లేజర్ లైట్ల వెలుగుల్లో స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్





ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



బందరు రోడ్డుపై జన ప్రభంజనం



పెత్తందారీ పోకడలూ అంటరానితనమే

సాక్షి, అమరావతి: 'అంటరానితనంపైతిరుగుబాటు, విప్లవం, స్వాతంత్య్ర పోరాటాలకు ఉమ్మడి రూపమే మన బాబా సాహెబ్ అంబేడ్కర్' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్య్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా అలాంటి పరిస్థితులు వేర్వేరు రూపాల్లో ఇవాళ్టికీ ఉన్నాయని, పెత్తందారీ పోకడలతో అంటరానితనం, వివక్ష రూపం మార్చుకుని సంచరిస్తున్నాయని చెప్పారు. విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో దేశానికే తలమానికంగా నిర్మించిన రాజ్యాంగ రూపశిల్పి, భారత రత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తైన 'సామాజిక న్యాయ మహాశిల్పం' విగ్రహాన్ని సీఎం జగన్ శుక్రవారం రాత్రి జాతికి అంకితం చేశారు. సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణతో మన విజయవాడను చూస్తుంటే సామాజిక చైతన్యాలవాడగా కనిపిస్తోందన్నారు. అంతకు ముందు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 'సామాజిక సమతా సంకల్ప సభ'లో మాట్లాడుతూ కుల అహంకార వ్యవస్థల దుర్మార్గాలపై తన పోరాటానికి అంబేడ్కరే స్ఫూర్తి అని తెలిపారు.

చరిత్ర గతిని మార్చిన సంఘ సంస్కర్త

అమెరికాలోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ గురించి మనం విన్నాం. ఇక మీదట స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ మహాశిల్పం) అంటే ఇండియాలోని విజయవాడ అని మార్మోగుతుంది. మనందరి ప్రభుత్వం ఈ 56 నెలల్లో అనుసరించిన సామాజిక న్యాయానికి ఈ విగ్రహం నిలువెత్తు నిదర్శనం. అంబేడ్కర్ జన్మించిన 133 ఏళ్ల తర్వాత, ఆయన మరణించిన 68 ఏళ్ల తర్వాత సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాం. ఇది వేల సంవత్సరాల భారత సామాజిక, ఆర్థిక, మహిళా చరిత్రలను మార్చిన ఓ సంఘ సంస్కర్త, ఓ మరణం లేని మహనీయుడి విగ్రహం. బాబా సాహెబ్ మన భావాల్లో జీవించే ఉంటారు. మన అడుగుల్లో, బతుకుల్లో, భావాల్లో ఎప్పటికీ కనిపిస్తుంటారు. పెత్తందారీతనం, అంటరానితనం, కుల అహంకార వ్యవస్థలు, అక్కచెల్లెమ్మలపై వివక్ష మీద పోరాటాలకు నిరంతరం స్ఫూర్తి అందిస్తూనే ఉంటారు ఆ మహా మనిషి.

75వ గణతంత్ర దినోత్సవానికి ముందు..

విజయవాడలో.. అది కూడా స్వాతంత్య్ర సమర చరిత్ర కలిగిన మన స్వరాజ్య మైదానంలో, 75వ రిపబ్లిక్ డేకి సరిగ్గా వారం ముందు మనం ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ మహా విగ్రహం స్ఫూర్తిదాయకం. అది చూసినప్పుడల్లా పేదలు, మహిళలు, మానవ హక్కులు, ప్రాథమిక హక్కులు, సమానత్వ ఉద్యమాలు, రాజ్యాంగ హక్కులకు నిరంతరం స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది.

పుణె ఒప్పందం.. అండనిచ్చే మహాశక్తి

ఆయన్ను ఎప్పుడు జ్ఞాపకం చేసుకున్నా అంటరానితనం, ఆధిపత్య భావజాలంపై ఓ తిరుగుబాటుగా మనకు కనిపిస్తుంటారు. సమసమాజ భావాలకు నిలువెత్తు రూపంగా మనందరికీ గుర్తుకొస్తారు. రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం మనల్ని కాపాడే మహా శక్తిగా మనందరికీ స్ఫూర్తిదాతగా నిలుస్తారు. గొంతు విప్పలేని దళిత వర్గాలు, అల్ప సంఖ్యాకులు, వాయిస్ లెస్ పీపుల్, అట్టడుగు వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్లు కల్పించాలని చరిత్ర గతిని మార్చిన పుణె ఒప్పందానికి కారకులు అంబేడ్కర్. ఈ రోజు దళిత జాతి నిలబడిందన్నా, అల్ప సంఖ్యాకులు నిలబడగలుగుతున్నారన్నా, రిజర్వేషన్లు కల్పించి ఒక్క తాటిపైకి తెచ్చే కార్యక్రమం జరిగిందంటే అంబేడ్కరే స్ఫూర్తి. ప్రతివాడలో ఉన్న ఆయన విగ్రహం అణగారిన వర్గాలకు నిరంతరం ధైర్యాన్ని, శక్తిని, అండను ఇస్తుంది. మహాశక్తిగా తోడుగా నిలబడుతుంది.

ఆకాశమంతటి వ్యక్తిత్వం

రూపం మార్చుకున్న అంటరానితనంపై 56 నెలలుగా మనం చేస్తున్న యుద్ధానికి నిదర్శనం సామాజిక న్యాయం. మనం చేస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ యుద్ధానికి నిలువెత్తు నిదర్శనంగా అంబేడ్కర్ విగ్రహం ఎప్పటికీ కనిపిస్తుంది. ఇది దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం అని చెప్పడానికి గర్వపడుతున్నా. 81 అడుగుల వేదిక మీద 125 అడుగుల మహా విగ్రహం.. మొత్తం 206 అడుగుల ఎత్తుతో ప్రతిష్టించిన ఆకాశమంతటి ఆ మహానుభావుడి వ్యక్తిత్వాన్ని అంతా గుర్తు చేసుకోవాలి. ప్రతి పిల్లాడూ, ప్రతి పాపా ఆయన జీవిత చరిత్ర నుంచి స్ఫూర్తి పొందాలి. అభివృద్ధి - అభ్యుదయానికి మధ్య అవినాభావ సంబంధం అంబేడ్కర్ భావజాలం. ఇలాంటి భావజాలం పెత్తందార్లకు నచ్చదు. పెత్తందార్లంటే ఎవరో మీ అందరికీ ఈ పాటికి బాగా అర్థమై ఉంటుంది.

ఫ్యాన్ రాకపోతే మంచినీళ్లూ పుట్టవు!

చదువుకునేందుకు వీల్లేదని తరతరాలుగా అణచివేతకు గురైన వర్గంలో జన్మించినా, చదువుకొనేందుకు తమకు మాత్రమే హక్కుందని భావించిన వారికంటే గొప్పగా చదువుకున్న విద్యా విప్లవం అంబేడ్కర్. ఆయన చదువుకుంటున్న రోజుల్లో దళితుడు కాబట్టి స్కూల్‌లో కుండలో నుంచి గ్లాసు ముంచుకొని నీళ్లు తాగేందుకు కూడా అనుమతించలేదు. ఆయన తెచ్చుకున్న గ్లాసులో ప్యూన్ పైనుంచి నీళ్లు పోసేవాడట. ఏ రోజైనా బడికి ప్యూన్ రాకపోతే ఆ రోజు తాగడానికి మంచినీళ్లు లేనట్లే అన్న మాటలు ఎంతో బాధ కలిగిస్తాయి.

ఆయన చదివింది ఇంగ్లీషు మీడియంలో..

ఈరోజు కూడా ఈ దురహంకారులు, ఈ పెత్తందార్లు తమ పత్రికలో రాశారు. అంబేడ్కర్ తెలుగు మీడియం మాత్రమే ఉండాలి అని అన్నారట. ఈ పెత్తందార్ల పిల్లలు, మనవళ్లు మాత్రం ఇంగ్లీషు మీడియంలోనే చదువుతారట. వీళ్ల అబద్ధాలు ఏ స్థాయిలో చెబుతున్నారో చూస్తుంటే బాధేస్తోంది. అంబేడ్కర్ చదువుకున్నది ఇంగ్లీషు మీడియంలో. ఆయన 4వ తరగతి పాసైనప్పుడు బంధుమిత్రులంతా పండగ చేసుకున్నారు. ఈనాడు చివరికి చరిత్రను కూడా వక్రీకరిస్తూ రాతలు రాస్తోందంటే పాత్రికేయం ఏ స్థాయికి పడిపోయిందో ఆలోచన చేయమని కోరుతున్నా. ఈ పెత్తందార్ల పత్రిక, ఆ ఈనాడు పత్రిక ముసుగులో తాము పాటించే అంటరానితనాన్ని అబద్ధాలతో అందమైన మేకప్ వేస్తోంది. ఇలాంటి దుర్మార్గులు, నీచులు మన దళితులు, బహుజనులకు వ్యతిరేకులు.

అంటరానితనం.. మరో రూపంలో

స్వాతంత్య్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా అంటరానితనం, వివక్ష సమసిపోలేదు. పెత్తందార్ల పోకడలతో రూపం మార్చుకుంది. అంటరానితనం అంటే.. ఫలానా వ్యక్తుల్ని భౌతికంగా ముట్టుకోకూడదని దూరం పెట్టడం మాత్రమే కాదు. పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో, ఆ గవర్నమెంట్ బడిని పాడుపెట్టడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేద పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేద పిల్లలు తెలుగు మీడియంలోనే చదవాలని, వారు ఇంగ్లీషు మీడియంలో చదవరాదని బరితెగించి వాదించడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే.

మనుషులు చనిపోతున్నా కరుణించని పాలకులు..

పేద కులాల వారు ఎప్పటికీ తమ పొలాల్లో పనివారుగానే ఉండిపోవాలట. తమ ఇళ్లల్లో పనివారుగా, తమకు సేవకులుగా ఉండిపోవాలట. తమ అవసరాలు తీర్చేవారిగానే మిగిలిపోవాలట. ఇలాంటి ఆలోచనలు కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేదలు ఏ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నారో, ఎక్కడ వారికి ఉచితంగా వైద్యం అందుతుందో, అటువంటి ప్రభుత్వ ఆస్పత్రులను నీరుగార్చడం కూడా అంటరానితనమే. పేదలు బస్సు ఎక్కే ఆర్టీసీని కూడా ప్రైవేట్‌కు అమ్మేయాలనుకోవడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. ఏ పౌర సేవ కావాలన్నా, పేదవాడికి ఏ పథకం కావాలన్నా లంచాలు ఇచ్చుకుంటూ, వివక్షకు లోనవుతూ, కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగిన దుస్థితి కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. అవ్వాతాతలు పెన్షన్ కోసం, రైతన్నలు ఎరువుల కోసం పొద్దున్నే లేచి పొడవాటి లైన్లలో నిలబడాల్సి రావడం, మనుషులు చనిపోతున్నా పాలకుల గుండె కరగకపోవడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేదల మీద పెత్తందారీ భావజాలంలో ఇవన్నీ కూడా భాగాలే. ఎస్సీల అసైన్డ్ భూముల్ని కాజేసి గజాల లెక్కన అమ్ముకోవాలనుకున్న రియల్ ఎస్టేట్ రాజధానిలో పేద వర్గాలకు చోటు లేకుండా తాము మాత్రమే ఒక కోట కట్టుకోవాలని కుతంత్రాలు చేయడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేదల ఇళ్ల నిర్మాణానికి భూములిస్తే సామాజిక సమతుల్యం దెబ్బ తింటుందని కోర్టులకు వెళ్లి కేసులు వేసి సిగ్గు లేకుండా వాదించడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. మన ఎస్సీలు, మన ఎస్టీలు, మన బీసీలు, మన మైనార్టీలు, మన నిరుపేద పిల్లలు చదువుకునే ఆ గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లీషు మీడియం చదువులు చెప్పడానికి వీల్లేదని కోర్టులకు వెళ్లి పిటిషన్లు వేయడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే. పేద వర్గాల పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వటానికి వీల్లేదని కుట్ర కథనాలు రాయడం, వాదించడం కూడా రూపం మార్చుకున్న అంటరానితనమే.



అంబేడ్కర్ జీవిత విశేషాలు తెలిపే మ్యూజియాన్ని ప్రారంభిస్తూ.. చిత్రాలను పరిశీలిస్తూ.. అంబేడ్కర్ వాయిస్ వింటూ.. విజిటర్స్ బుక్‌లో సంతకం చేసి తన అభిప్రాయాన్ని రాస్తున్న సీఎం జగన్



మ్యూజియంలో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం జగన్



యాంఫీ థియేటర్‌లో ముఖ్యమంత్రి





కాలచక్ర మహామండపాన్ని పోలిన భవన పీఠాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

పెత్తందార్లకు ఏనాడైనా తోచిందా?

దళితుల ఇళ్ల నిర్మాణాలకు చంద్రబాబు సెంటు భూమి అయినా ఇచ్చింది లేదు. అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించింది అంతకంటే లేదు. చంద్రబాబు రక్తంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మీద ఏ కోశానా, ఏనాడూ ప్రేమే లేదు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని నాడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న ఆ వ్యక్తి నోరు పారేసుకుంటే గ్రామాల్లో ఆ సామాజిక వర్గాలు ఎలా బతకగలుగుతాయనే కనీస ఆలోచన చేయలేదు. బీసీలను తోకలు కత్తిరిస్తా.. ఖబడ్దార్! అని బెదిరించిన వ్యక్తి చంద్రబాబు. పేద సామాజిక వర్గాలంటే గిట్టని ఆ వ్యక్తికి మన మాదిరిగా పేద అక్కచెల్లెమ్మల కుటుంబాలు బాగుండాలని ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేయాలని ఎందుకు అనిపిస్తుంది? చదువుకొనే మన పేద పిల్లలకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, విద్యా కానుక, ట్యాబ్‌లు, ఇంగ్లీషు మీడియం చదువులు, బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్, గవర్నమెంట్ బడుల్లో డిజిటలైజేషన్, ఐఎఫ్‌పీలు, నాడు-నేడుతో చదువులు మార్చాలని అలాంటి పెత్తందారీ పార్టీలకు, నాయకులకు ఎందుకు అనిపిస్తుంది? మన అక్కచెల్లెమ్మలకు ఒక దిశా యాప్, అమ్మ ఒడి, ఆసరా, సున్నావడ్డీ, చేయూత, అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చి చిరునవ్వులు చూడాలని పెత్తందారీ పార్టీలకు, నాయకులకు ఎందుకు అనిపిస్తుంది? మన రైతన్నలకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్, రైతు భరోసా, ఆర్బీకే వ్యవస్థను తేవాలని వారికి ఎందుకు అనిపిస్తుంది? పేదలకు ఆరోగ్యశ్రీతో రూ.25 లక్షల ఉచిత వైద్యం, ఆరోగ్య ఆసరా, 104, 108 సేవలు, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, వైద్య ఆరోగ్యశాఖలో 53 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయాలని ఆ పెత్తందారు చంద్రబాబుకు ఎందుకు అనిపిస్తుంది? గ్రామ స్థాయిలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు తెచ్చి ప్రతి పేదవాడికీ అందుబాటులో ఉండాలని పెత్తందారు పార్టీలకు ఎందుకు అనిపిస్తుంది? నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టుల్లో 50 శాతం నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకే దక్కేలా ఏకంగా చట్టం చేయాలని పెత్తందార్లకు ఎందుకు అనిపిస్తుంది?

విప్లవాత్మక వ్యవస్థలు


పెత్తందారీ పార్టీలు, పెత్తందారీ నాయకులకు నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీల కోసం నవరత్నాల పాలన అందించాలని ఏ రోజైనా అనిపించిందా? కడుపులో ఉన్న బిడ్డ దగ్గర నుంచి పండు ముసలి అవ్వాతాత వరకు అందరి పట్ల ప్రేమ, మమకారం చూపాలని పెత్తందారీ పార్టీ నాయకులకు ఏరోజైనా అనిపించిందా? మీ బిడ్డ 56 నెలల పాలనలో నేరుగా బటన్ నొక్కి రూ.2.47 లక్షల కోట్లు పారదర్శకంగా అందించాడు. లంచాలు, వివక్ష లేకుండా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతున్నాయి. ఇవాళ గ్రామ స్థాయిలో చిక్కటి చిరునవ్వుతో మన పిల్లలు కనిపిస్తున్నారు. 2 వేల జనాభాకు సచివాలయం. 50 ఇళ్లకు వలంటీర్ ఉన్నారు. ప్రతి పేదవాడు, రైతన్న, అక్కచెల్లెమ్మలను చేయి పట్టుకొని నడిపిస్తూ ఇదీ అంబేడ్కర్ కలలుగన్న రాజ్యం అని ఆ చెల్లెమ్మలు, తమ్ముళ్లు దేశానికే చూపిస్తున్నారు.

ఈ స్థాయిలో మరెక్కడైనా ఉందా?

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకు మేలు చేయడంలో దేశ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా 56 నెలల పాలనలో అడుగులు పడ్డాయి. మంత్రి మండలిలో ఏకంగా 4 ఉప ముఖ్యమంత్రి పదవులు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ఇచ్చాం. మంత్రి మండలిలో 68 శాతం పదవులూ వారికే ఇచ్చాం. ఇది సామాజికపరంగా దేశ చరిత్రలో రికార్డు. శాసన సభ స్పీకర్‌గా బీసీ, శాసన మండలి చైర్మన్‌గా ఎస్సీ, మండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా మైనార్టీ అక్కకు పెద్దపీట వేసిన ఏకైక ప్రభుత్వం మీ బిడ్డదే. రాజ్యసభకు 8 మందిని పంపిస్తే అందులో నలుగురు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల వారే. మన పార్టీకి మండలిలో 43 మంది సభ్యులుంటే వారిలో 29 మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలే ఉన్నారు. 13 జెడ్పీ చైర్మన్లలో 9 పదవులు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో 12 మేయర్లు, 87 మున్సిపాలిటీలుంటే 84 మీ బిడ్డ గెలుచుకోగా వాటిలో ఏకంగా 58 మున్సిపాలిటీల్లో, 196 మార్కెట్ కమిటీల్లో 117 చైర్మన్లు, 137 కార్పొరేషన్‌లలో 79 చైర్మన్లు ఇలా అన్నింటా నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకే అవకాశం కల్పించాం. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 56 నెలల కాలంలో 2.10 లక్షల గవర్నమెంట్ ఉద్యోగాలు ఇస్తే 80 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్నదమ్ములు అక్కచెల్లెమ్మలే ఉన్నారు. ఇలాంటి సామాజిక న్యాయం మనందరి ప్రభుత్వంలో కాకుండా మరెక్కడైనా చూశారా?

ప్రతి గ్రామంలో మార్పు

మీ కష్టం తెలిసిన మీ బిడ్డ ప్రభుత్వం ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలోనూ మార్పు తీసుకొచ్చింది. రాష్ట్రంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామాన్నైనా తీసుకోండి. ప్రతి గ్రామంలోనూ స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి. ఇంటింటా చదువుల విప్లవం, మహిళా సాధికార విప్లవం, పరిపాలన సంస్కరణలు కనిపిస్తాయి. వ్యవసాయ విప్లవం కనిపిస్తుంది. డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తాయి. పారిశ్రామిక మౌలిక సదుపాయాలతో ఎప్పుడూ చూడని అభివృద్ధి కనిపిస్తుంది. వైద్య, ఆరోగ్య రంగంలో ఎన్నడూ ఊహించని రీతిలో గ్రామ స్థాయిలో సాకారమైన మరో విప్లవాత్మక మార్పులు కనిపిస్తాయి.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన లేజర్ షో దృశ్యాలివే..



అద్భుత శిల్పం.. జాతికి అంకితం

- అంబర చుంబనం.. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆవిష్కరణ సంబరం
- కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్
- వందలాది డ్రోన్లతో ఆకాశంలో అద్భుత విన్యాసాలు.. మిరుమిట్లు గొలిపిన లేజర్ షో
- విజయానికి చిహ్నంగా కళ్లు చెదిరేలా బాణసంచా వెలుగులు

సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకోగా, స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ ఏర్పాటుతో ఇప్పుడు దేశ వ్యాప్తంగా కీర్తిని మూటగట్టుకుంది. సామాజిక న్యాయ మహా శిల్పాన్ని జాతికి అంకితం చేసే మహత్తర కార్యక్రమం దిగ్విజయం అయ్యింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఈ వేడుకకు తరలివచ్చారు. మధ్యాహ్నానికి అశేష ప్రజావాహినితో స్వరాజ్ మైదానానికి వచ్చే దారులన్నీ కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణం జనంతో నిండిపోవడంతో స్వరాజ్ మైదానానికి ఆనుకుని ఉన్న మహాత్మా గాంధీ రోడ్డు, నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల వద్ద జనం భారీగా గుమిగూడి ఆ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో జై భీమ్, జై జగన్ నినాదాలు మిన్నంటాయి.

సాక్షి, అమరావతి: విజయవాడ నగరం నడిబొడ్డున భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. అనంతరం బౌద్ధ వాస్తు శిల్పకళతో నిర్మించిన కాలచక్ర మహా మండపాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహ పీఠం వద్ద ఆ మహనీయుని పాదాలపై పూలు చల్లి నివాళులర్పించారు. అంబేడ్కర్ జీవిత విశేషాలను ప్రదర్శించే విహార యాంఫీ థియేటర్‌ను ప్రారంభించారు. 18.81 ఎకరాల స్వరాజ్ మైదానంలో రూ.404 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన స్మృతివనం అంతా కలియ తిరిగారు. జీవ కళ ఉట్టిపడే మైనపు విగ్రహాలు, అంబేడ్కర్ జీవిత విశేషాలు తెలియజేసే ఎక్స్‌పీరియన్స్ సెంటర్, 2 వేల మంది కూర్చొనేలా తీర్చిదిద్దిన కన్వెన్షన్ సెంటర్, 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫుడ్ కోర్టు, చిన్నారులు ఆడుకోవటానికి ప్లే ఏరియా, వాటర్, మ్యూజికల్ ఫౌంటెన్లు, ఉదయం, సాయంకాలం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ మార్గాలను పరిశీలించారు. దేశానికే తలమానికంగా 81 అడుగుల పీఠంతో కలిపి 206 అడుగుల పొడవుతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం ప్రపంచంలోనే అతిపెద్దది. ఈ నేపథ్యంలో ఆ మహనీయుని ఆశయాలు స్ఫూర్తిగా జగనన్న పాలన సాగుతోందంటూ వందల సంఖ్యలో డ్రోన్లతో నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంబేడ్కర్ చిత్రం, నవరత్న పథకాలు, పీపుల్స్ లీడర్ సీఎం వైఎస్ జగన్, భారత పార్లమెంట్, భారతదేశ పటం, ఆంధ్రప్రదేశ్ మ్యాప్, కర్నూలు కొండారెడ్డి బురుజు, ప్రకాశం బ్యారేజ్, చిలుక, కూచిపూడి నృత్యం వంటి ఆకృతులతో డ్రోన్ల ప్రదర్శన ఆకాశంలో కనువిందు చేసింది. 14 అడుగుల ఎత్తు, 22 అడుగుల పొడవు గల జాతీయ పక్షి నెమలి ఆకృతి విశేషంగా ఆకట్టుకుంది. మిరుమిట్లు గొలిపే లేజర్ షో, బాణా సంచా వెలుగులు సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. అనంతరం అంబేడ్కర్ మహాశిల్పం ముందు సీఎం జగన్‌తో మంత్రులు, ఎమ్మెల్యేలు ఫొటోలు దిగారు. ఈ మహోత్సవంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉప ముఖ్యమంత్రులు కొట్టు సత్యనారాయణ, అంజద్ బాషా, పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, కె. నారాయణ స్వామి, మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేష్, ఆర్‌కె రోజా, విడదల రజని, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్, ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, గురుమూర్తి, నందిగం సురేష్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, సీఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబరం అంటిన సంబరం



అణగారిన వర్గాల ఆత్మగౌరవ సూర్యుడిలా ఆకాశమంత ఎత్తున రూపొందిన డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ మహా శిల్పం ఆవిష్కరణ మహోత్సవం స్వరాజ్ మైదానంలో అంబరాన్ని తాకింది. నభూతో నభవిష్యత్ అనేలా సాగిన ఆ సంబరాన్ని చూసేందుకు రెండు కళ్లూ సరిపోలేదనడం అతిశయోక్తి కాదు. ఈ అపురూప కార్యక్రమానికి హాజరు కావడం తమ అదృష్టమని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ రూప శిల్పి అంబేడ్కర్‌కు ఇంతగా గౌరవం కల్పించడం పట్ల సీఎం వైఎస్ జగన్‌ను ప్రశంసించారు. మహిళలు, యువత ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంబేడ్కర్, సీఎం జగన్ చిత్రాలతో కూడిన ప్లకార్డులు, జెండాలను చేతపట్టి వారంతా సందడి చేశారు. అంబేడ్కర్ గేయాలు, నవరత్న పథకాలపై పాటలు, కళా రూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే కార్యక్రమం



మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి

భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే కార్యక్రమం ఇది. దేశంలో ఎక్కడా లేని విధంగా జరుగుతున్న గొప్ప కార్యక్రమం, ఒకప్పుడు చంద్రబాబు మమ్మల్ని అవమానించారు, మా దేవుడ్ని అవమానించారు, మాపై దాడులు, అమానుషాలు చేయించారు, అంబేడ్కర్ విగ్రహం పెడతామని అవమానించారు, కానీ సీఎం జగన్ పాలనలో దళితులు గుండెలపై చేయి వేసుకుని ధైర్యంగా బతుకుతున్నారు, అంబేడ్కర్ కోరుకున్న రాజ్యాంగ వ్యవస్థ తెచ్చారు, మా కులాల స్థితిగతులు మార్చారు, ఏ రాష్ట్రంలో లేని విధంగా అంబేడ్కర్‌ను మీ గుండెల్లో, మీ కుటుంబంలో ఒకరిగా చేసుకున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అమలు చేస్తున్న సీఎం జగన్



తానేటి వనిత, హోంశాఖా మంత్రి

సామాజిక న్యాయ మహాశిల్పం(స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్) ఆవిష్కరణ ఒక గొప్ప రికార్డు. ప్రపంచంలోనే అతి ఎత్తైన మహాశిల్పాన్ని రూపొందించి ప్రారంభించే సభలో నాకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. అంబేడ్కర్ ఆశయాలు, పోరాటాల గురించి మనం చరిత్ర పుస్తకాల్లో చదివాం. కానీ అవి అమలు చేసిన చరిత్ర సృష్టించింది మన సీఎం జగన్. అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆలోచనలు, సంస్కరణలు, పోరాటాలను సీఎం జగన్ ముందుకు తీసుకెళ్తున్నారు.

మన కోసం పుట్టిన బాహుబలి జగన్



పీడిక రాజన్న దొర, ఉపముఖ్యమంత్రి

ఊరి చివర దళితవాడల వద్ద అంబేడ్కర్ విగ్రహాలు ఉండేవి. గొప్ప మహనీయుడైన అంబేడ్కర్ స్ఫూర్తిని భావితరాలకు అందించే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని విజయవాడ నగర నడిబొడ్డున నిర్మించారు. అట్టడుగు వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన అంబేడ్కర్ బాహుబలి–1 అయితే మన కోసం పుట్టిన బాహుబలి–2 జగన్.

పేదలను చేయి పట్టి నడిపిస్తున్న జగన్



అంజాద్‌బాషా, ఉపముఖ్యమంత్రి

అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవం కులాలు, మతాలకు అతీతమైన పండుగ రోజు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో పేద వర్గాలను చేయి పట్టుకుని ముందుకు నడిపిస్తున్న గొప్ప దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఎస్సీ, బీసీ ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల్లో కూడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం అందిస్తున్న సీఎం జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు.

రామోజీ.. నీ నీచపు రాతలు చూస్తే జాలేస్తోంది

- ఆయన కులపోడు సీఎంగా లేడనే విషం కక్కుతున్న రామోజీ
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం
- దళితుల మేలు గిట్టని రామోజీ, బాబు, రాధాకృష్ణ : ఎంపీ నందిగం
- ఈనాడు అధిపతికి ప్రజలే బుద్ధి చెప్తారు: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ఈనాడు ప్రతులను తగలబెట్టిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో ప్రపంచంలోనే అతి పెద్ద డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తుంటే ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా అధిపతులు ఓర్వలేకపోతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేడుకపై విషం చిమ్ముతూ శుక్రవారం ఈనాడు పత్రిక కథనం ప్రచురించడంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఈనాడు పేపర్‌ను చించివేసి, పత్రిక ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ.. దళితుల భూములను ఆక్రమించి ఫిల్మ్ సిటీ కట్టుకున్న నీచుడు రామోజీరావని ధ్వజమెత్తారు. దుర్మార్గుడైన రామోజీరావు దళిత బంధువైన సీఎం వైఎస్ జగన్‌పై విషం చిమ్మటం గర్హనీయమన్నారు. రామోజీరావు ఈనాడు పేపర్‌ను చంద్రబాబుకు తాకట్టుపెట్టి, పత్రిక విలువలు మంటగలిపారన్నారు. ఆయన కులపోడు సీఎంగా లేడన్న కారణంతోనే రాష్ట్రంపై రామోజీ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. రామో'ఛీ'.. నీ నీచపు రాతలపై జాలేస్తోందని వ్యాఖ్యానించారు. సీఎం వైఎస్ జగన్‌పై ఈనాడులో రాసిన చెత్త రాతలపై రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రామోజీ వయసుకు తగినట్టు నడుచుకోవాలని హితవు పలికారు. అంబేడ్కర్ విగ్రహం స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేస్తున్నారని తెలిసినప్పటి నుంచే పచ్చ మీడియా ఏడుపే ఏడుపు అని అన్నారు. సీఎం జగన్ దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని చెప్పారు. దశాబ్దాలుగా దళితులను అణచివేసిన చంద్రబాబుకు రామోజీ ఒక బ్రోకర్ అని విమర్శించారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. దళితులకు మేలు చేయటం అంటే రామోజీ, చంద్రబాబు, రాధాకృష్ణలకు నచ్చదని చెప్పారు. కాటికి కాలుచాచిన వయసులో కూడా రామోజీ విషం కక్కటం మానలేదని వ్యాఖ్యానించారు. దళితులు వారి ఇళ్లలో పాచి పనులు చేయటానికే బతకాలనేది రామోజీ, చంద్రబాబుల నైజమన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించేవారిలో దేశంలోనే సీఎం జగన్ ముందున్నారని చెప్పారు. ఈ విగ్రహం సీఎం జగన్‌కి బడుగు బలహీన వర్గాల మీద ఉన్న ప్రేమ, అభిమానాలను ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణతో రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. ఇది తట్టుకోలేక రామోజీ, చంద్రబాబు ఏడుస్తున్నారన్నారు.

దళిత యువకులే వారిని చెప్పుతో కొడతారు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబుకు రామోజీరావు, రాధాకృష్ణ బ్రోకర్ లాంటి వారని, దళిత యువకులే వారిని చెప్పుతో కొడతారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ అభిమానుల బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. నాగవరప్పాడులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వేళ రామోజీరావు, రాధాకృష్ణ రాతలు నీచంగా ఉన్నాయన్నారు.

ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల దహనం

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును తట్టుకోలేకపోతున్నాయంటూ దళిత సంఘాల ఆగ్రహం

సత్తెనపల్లి: అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశానికే గర్వ కారణంగా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్‌ను ఏర్పాటు చేసిందని దళిత సంఘాల నాయకులు చెప్పారు. ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడాన్ని సహించలేక ఈనాడు, ఆంధ్రజ్యోతిలో అసత్య ప్రచారం చేయడాన్ని ఖండిస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్ ఆధ్వర్యంలో దళిత సంఘాలు, పార్టీ శ్రేణులు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిపై శుక్రవారం పచ్చ పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని వాగిన చంద్రబాబు ఎక్కడ? నియామక పదవులను, చివరికి కాంట్రాక్టు పనుల్లోనూ ఎస్సీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచిన దళిత పక్షపాతి సీఎం వైఎస్ జగన్ ఎక్కడ? అని ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్‌లకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్న విషయాన్ని ప్రజలంతా ఆలోచన చేయాలని కోరారు. ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణలు విష ప్రచారాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని, దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ముందుగా డౌన్ డౌన్ ఈనాడు, ఆంధ్రజ్యోతి, జై జగన్.. జై జై జగన్ అంటూ దళిత సంఘాల నాయకులు నినాదాలిచ్చారు. ప్రధాన రహదారిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను చెప్పులతో కొట్టి దహనం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నేతలు భట్లూరి కోటేశ్వరరావు, కూచిపూడి సైమన్, చిలుక రమణయ్య, గుజ్జర్లపూడి కృపాకర్, చింతపల్లి నాగయ్య, చెరుకూరు వస్నూరు, పాలేటి పిచ్చయ్య, గొల్లపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేస్తున్న నాయకులు

బాబు అవమానం... జగన్ గౌరవం



టీడీపీ హయాంలో చంద్రబాబు దళితులను అవమానించాడు. సీఎం జగన్ దళితులను గౌరవిస్తున్నారు. వైఎస్ జగన్ దళితులకు ప్రత్యేకంగా సంక్షేమాన్ని అందించడమే కాకుండా విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో దళితులపై ఆయనకు ఉన్న ప్రేమ తెలుస్తోంది. – బి.దేవిడ్, సత్యవేడు

దళితులకు పెద్దపీట



సీఎం జగన్ అన్ని రంగాల్లో దళితులకు పెద్దపీట వేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీలు,బీసీలందరూ జగన్‌కు అండగా ఉంటాం. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా నెరవేర్చలేదు. సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో విగ్రహాన్ని ఆవిష్కరించారు. – వి.మహేష్, శ్రీకాళహస్తి

జనం గుండెల్లో నిలిచిపోతారు



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. విజయవాడలో 206 అడుగుల ఎత్తున్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇది రాష్ట్రానికి ఎంతో గర్వకారణం – వి.అరుణ్‌కుమార్, తిరుపతి

జగన్, అంబేడ్కర్‌ను చూడ్డానికొచ్చా



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని, సీఎం జగన్‌బాబును చూడటానికి వచ్చా. నేను ఒక్కదానిని రావడానికి తెలియదు. అందుకే పక్కింటి అమ్మాయిని తోడు తెచ్చుకున్నా.. దళితుల పట్ల సీఎంకు ఉన్న శ్రద్ధ ఏ రాజకీయ నాయకుడికి లేదు. వెయ్యేళ్లు జగన్ బాబు వర్ధిల్లాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నా.
– మెరుగుమాల సుగుణమ్మ, చిలువూరు, గుంటూరు జిల్లా

అంబేడ్కర్ ఖ్యాతిని మరోసారి చాటారు



సామాజిక సమానత్వం సీఎం జగన్ ప్రభుత్వంలోనే జరిగింది. టీడీపీ హయాంలో ఇదే విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని కడతామని కల్లబొల్లి మాటలతోనే కాలం గడిపేశారు. రాష్ట్రం నడిబొడ్డున ప్రపంచం గర్వపడేలా అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి ఆయన ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి సీఎం జగన్ చాటారు.
– తలారి శివకుమార్, గంగాధర్‌నెల్లూరు, చిత్తూరు జిల్లా

ఆత్మ గౌరవం తీసుకొచ్చారు



అంబేడ్కర్ ఆశయాలను సీఎం జగన్ తూ.చా తప్పకుండా పాటిస్తున్నారు. ఆయన అమలు చేస్తోన్న ప్రతి పథకం ఎస్సీ,ఎస్టీ, బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతోంది. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మాణం చేసి బడుగు,బలహీన వర్గాల వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు.
– నెనావత్ భాస్కర్‌నాయక్, పత్తికొండ, కర్నూలు జిల్లా

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎంతో మేలు



అంబేడ్కర్ నిలువెత్తు భారీ విగ్రహాన్ని విజయవాడలో నిర్మించిన సీఎం జగన్ మాకు దేవుడే. జగనన్న పాలనలో అమలైన పథకాల ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ, కాపు సామాజిక వర్గాల వారు చాలా మంది అభివృద్ధి చెందారు.
– గొండిపల్లి సురేంద్రబాబు, శాగలేరు గ్రామం, పులివెందుల, కడప

విగ్రహం ఏర్పాటు హర్షణీయం



అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేయడం హర్షణీయం. ఆనాడు దళితుడని, అంటరానివాడని అంబేడ్కర్‌ను పాఠశాల బయట కూర్చోబెడితే నేడు నగరం నడిబొడ్డున భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.
– గొర్రెపాటి సాంబశివరావు, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



దళితుల ఆరాధ్యదైవం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి దళితుల మీద ఉన్న ప్రేమను సీఎం జగన్ చాటుకున్నారు. ప్రపంచంలో కెల్లా ఎక్కడా లేనటువంటి 206 అడుగుల విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. రానున్న రోజుల్లో అంబేడ్కర్ స్మృతివనం పర్యాటక ప్రదేశంగా విరాజిల్లుతుంది. – పీజే సైమన్, రిటైర్డ్ హెచ్ఎం, సంతరావూరు, చినగంజాం మండలం, బాపట్ల జిల్లా

చిరస్థాయిగా నిలిచిపోతుంది



ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున నిర్మించి ప్రారంభించటం సంతోషంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. విజయవాడ నగరానికి తలమానికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించారు.
– మెడబలిమి భాస్కరరావు, వీబీ పాలెం, గుంటూరు జిల్లా

మా హృదయాల్లో జగనన్న నిలుస్తారు



గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా మోసం చేసింది. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ఖ్యాతి ఇనుమడించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు జగనన్న ప్రతీ ఒక్కరి హృదయాలలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకున్నారు. – బుంగా జయరాజు, చెట్టునపాడు, ఏలూరు జిల్లా

దళితులకు సముచిత స్థానం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు. విజయవాడ నగరం నడిబొడ్డున దళితుల ఖ్యాతి ఇనుమడింపచేసేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. దీంతో దళితులకు సముచిత స్థానాన్ని సీఎం జగన్ కల్పించారు.
– జక్కుల ఆనందరావు, రాచర్ల, తాడేపల్లిగూడెం

రాష్ట్రానికే ఐకాన్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం రాష్ట్రానికే ఐకాన్‌గా నిలుస్తుంది. కోట్లాది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అంబేడ్కర్ స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే దళితులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా సీఎం జగన్ ప్రతీ ఒక్కరి హృదయాలలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకున్నారు. – ఎస్ వినయ్, మంగినపూడి, కృష్ణా జిల్లా

యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. విజయవాడ నగరం నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది. మా కలను సాకారం చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.
– సాగర్, గుంటూరు జిల్లా

రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘోర ప్రమాదం

విస్టెక్స్ ఏషియా సీఈఓ సంజయ్ షా దుర్మరణం

రామోజీ ఫిల్మ్ సిటీ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇతరులపై పలు సెక్షన్ల కింద కేసు

సాక్షి, హైదరాబాద్/అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్ నగర శివార్లలో ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు నేతృత్వంలోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఘోర ప్రమాదం జరిగింది. నిర్వాహకుల నిర్లక్ష్యం, ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, అత్యవసర సమయంలో వినియోగించడానికి అంబులెన్స్‌లు సైతం లేక ఆస్పత్రికి తరలించడంలో 20 నిమిషాల వరకు ఆలస్యం కావడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. అంచెలంచెలుగా ఎదిగిన ప్రవాస భారతీయుడు, బహుళజాతి సంస్థ విస్టెక్స్ ఏషియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈఓ సంజయ్ షా (56) ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన ఆ సంస్థ ప్రెసిడెంట్ దాట్ల విశ్వనాథ్ రాజు అలియాస్ రాజు దాట్ల (52) ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలిలోనే ఉన్న షా సతీమణి అంబులెన్స్, అంబులెన్స్ అంటూ అక్కడ ఉన్న ఫిల్మ్ సిటీ సిబ్బందిని విలపిస్తూ వేడుకోవడం కంటతడి పెట్టించింది. గురువారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనపై సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కలిదిండి జానకిరామ్ రాజు ఇచ్చిన ఫిర్యాదుతో ఫిల్మ్ సిటీ సహా మరికొందరిపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముంబై నుంచి చికాగో వరకు ఎదిగి..

ముంబైకి చెందిన సంజయ్ షా 1989లో అమెరికాకు వలసవెళ్ళారు. అక్కడి లేహై యూనివర్సిటీ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. అమెరికాలోనే ప్రైస్ వాటర్ హౌస్ కూపర్, జనరల్ మోటార్స్‌లతో పాటు జర్మనీలోని సాప్ సంస్థలోనూ ఉన్నత స్థానాల్లో పని చేశారు. తర్వాత సొంత కంపెనీ ఏర్పాటు కోసం ఆ ఉద్యోగాన్ని వదిలేశారు. 1999లో అమెరికాలోని ఇల్లినాయిస్ కేంద్రంగా విస్టెక్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా 20 దేశాల్లో విస్తరించింది. దీని వార్షిక టర్నోవర్ రూ.3,500 కోట్లకు పైగా ఉంది. హైదరాబాద్‌లోని మాదాపూర్ లోనూ దీని కార్యాలయం ఉంది. దీనికి కలిదిండి జానకిరామ్ రాజు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. తమ సంస్థ ఏర్పాటు చేసి 25 ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలని భావించిన యాజమాన్యం రామోజీ ఫిల్మ్ సిటీని వేదికగా ఎంచుకుంది.

లైమ్‌లైట్ గార్డెన్‌లో..

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విస్టెక్స్ కార్యాలయాల్లో ఈ వేడుకలు జరుగుతుండగా.. ప్రతి కార్యక్రమానికీ సీఈఓ సంజయ్ షా, ప్రెసిడెంట్ విశ్వనాథ్ రాజు హాజరవుతున్నారు. ఇదే క్రమంలో హైదరాబాద్‌లోని తమ ఉద్యోగులు, క్లయింట్లతో కలిసి వేడుకల నిర్వహణకు రామోజీ ఫిల్మ్ సిటీలోని లైమ్‌లైట్ గార్డెన్‌ను బుక్ చేసుకున్నారు. రెండురోజుల పాట జరిగే వేడుకల కోసం గురువారం రాత్రి ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు.


ప్రమాదానికి కారణమైన ప్లాట్‌ఫామ్ ఇదే..

భార్య కళ్ల ఎదుటే ప్రమాదం

రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రమాదం జరిగిన సమయంలో విస్టెక్స్ సంస్థ సీఈఓ సంజయ్ షా భార్య కూడా అక్కడే ఉన్నారు. దంపతులిద్దరూ గురువారం సాయంత్రం తమ సొంత విమానంలో ముంబై నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి, అక్కడి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీకి వచ్చారు. స్టేజీ కింద ఆహూతులతో కలిసి సంజయ్ భార్య కూర్చుని వీక్షిస్తుండగానే ఈ ప్రమాదం జరిగింది. దీంతో పరుగున స్టేజీ పైకి వచ్చిన ఆమె.. రక్తపు మడుగులో పడి ఉన్న తన భర్తను ఆస్పత్రికి తరలించండి అంటూ దాదాపు 15 నిమిషాలు అందరినీ వేడుకున్నారు.

విస్టెక్స్, ఫిల్మ్ సిటీ ఉద్యోగులు, ఈవెంట్ మేనేజర్లు వెంటనే అక్కడ గుమిగూడారు. విస్టెక్స్ సంస్థ ప్రతినిధులు తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఏదైనా పెద్ద ఆస్పత్రికి తరలించడానికి సహాయం చేయాల్సిందిగా అక్కడ ఉన్న వారిని కోరారు. ఓ వైపు సరైన

సరైన భద్రత ఏర్పాట్లు లేవు.. రెస్క్యూ లేదు

భద్రతా ఏర్పాట్ల లోపం కారణంగా ప్రమాదం జరగ్గా.. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించేలా సరైన రెస్క్యూ టీమ్ సైతం ఫిల్మ్ సిటీకి లేకపోవడంతో విలువైన సమయం వృధా అయ్యింది. ఆస్పత్రికి తరలింపు ఆలస్యమైంది. విస్టెక్స్ ప్రతినిధులు, షా భార్య 15 నుంచి 20 నిమిషాలు వేడుకుంటే తప్ప ఫిల్మ్ సిటీ నిర్వాహకులు అంబులెన్స్‌ను ఏర్పాటు చేయలేదు. అప్పటికే తీవ్ర రక్తస్రావంతో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. ఒక అంబులెన్స్‌లో సంజయ్ షాను హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పతికి తరలించారు. విశ్వనాథ్ రాజును తీసుకువెళ్లడానికి మరో అంబులెన్స్ ఏర్పాటు చేయాల్సిందిగా కంపెనీ ప్రతినిధులు ఎంత వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన్ను సొంత కారులోనే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో సంజయ్ షా కన్నుమూశారు. విశ్వనాథ్ రాజును మెరుగైన చికిత్స నిమిత్తం మలక్‌పేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శరీరంలో అనేక చోట్ల ఎముకలు విరగటంతో పాటు తీవ్ర గాయాలైన ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

20 అడుగుల ఎత్తు నుంచి దిగుతూ..

ప్రారంభ కార్యక్రమాన్ని వెరైటీగా నిర్వహించాలని నిర్ణయించారు. కాంక్రీట్ స్టేజీపైన ఉన్న రూఫ్‌కు తాళ్లు కట్టి, వాటికి వేలాడేలా చెక్కతో ఓ ప్లాట్‌ఫామ్ తయారు చేశారు. అలంకరించిన ఆ ప్లాట్‌ఫామ్ మెల్లగా కిందకు దిగుతుండగా సీఈఓ, ప్రెసిడెంట్లు 20 అడుగుల ఎత్తులో దానిపై నిలబడి.. ఆహూతులకు అభివాదం చేస్తూ స్టేజీపైకి దిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు ఫిల్మ్ సిటీతో పాటు ఈవెంట్ మేనేజర్ల అనుమతి కూడా తీసుకున్నారు. చెక్కతో చేసిన సదరు ప్లాట్‌ఫామ్‌కు రెండు వైపులా ఇనుప చువ్వలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి 7.40 గంటల సమయంలో ఈ ప్లాట్‌ఫామ్ పైకి ఇద్దరూ ఎక్కగా.. పైన ఉన్న రూఫ్‌కు కట్టిన తాళ్ల సాయంతో ప్లాట్‌ఫామ్‌ను పైనుంచి కిందకు దింపడం ప్రారంభించారు. అయితే కొద్దిసేపటికే ఒక పక్కన తాడు తెగిపోవడంతో ప్లాట్‌ఫామ్ పక్కకు ఒరిగి, దానిపై ఉన్న ఇద్దరూ దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి సిమెంట్‌తో కట్టిన స్టేజీపై వేగంగా పడిపోయారు.

ఫిల్మ్ సిటీపై క్రిమినల్ కేసు నమోదు

జానకిరామ్ రాజు తన ఫిర్యాదులో ఫిల్మ్ సిటీలోని భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం తదితర అంశాలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రామోజీ ఫిల్మ్ సిటీ మేనేజ్‌మెంట్ (ఉషా కిరణ్ ఈవెంట్స్), సీనియర్ ఈవెంట్ మేనేజర్ రితిక్ ఛటర్జీ, సేఫ్టీ డిపార్ట్‌మెంట్ చీఫ్ మేనేజర్ జి.ఉదయ్ కిరణ్, ఫిల్మ్ సిటీలో స్పెషల్ ఎఫెక్ట్స్ కాంట్రాక్టర్‌గా ఉన్న ఎస్.సురేష్ బాబు, రోప్ ఆపరేటర్ ఎస్.దుర్గా సతీష్ తదితరులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఇండియన్ పీనల్ కోడ్‌లోని 336, 287 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద వీరిపై ఆరోపణలు చేశారు.

ఉస్మానియాలో పోస్టుమార్టం.. ముంబైకి మృతదేహం

సంజయ్ షా మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భార్యకు అప్పగించారు. అక్కడి నుంచి శవపేటికను మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ప్రత్యేక అంబులెన్స్‌లో ఎయిర్‌పోర్టుకు, ఆపై విమానాశ్రయం అంబులెన్స్‌లో షా విమానం ఉన్న ప్రాంతానికి తీసుకువెళ్ళారు. కానీ అందులో శవ పేటికను పెట్టడానికి అవకాశం లేకపోవడంతో కార్గో విమానంలో ముంబైకి పంపారు. షా భార్య సహా మిగిలిన వారు సంజయ్ విమానంలోనే ముంబై వెళ్ళారు. తమ స్వస్థలం గుజరాత్ అని, ఏళ్ళ క్రితమే ముంబైకి వలసవచ్చామని సంజయ్ భార్య పోలీసులకు తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఇద్దరు కుమార్తెలు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పారు.

బయటి వారు కావడంతోనే బయటకు!

- రామోజీ సంస్థలో ప్రమాదాలు నిత్యకృత్యం
- విషయం బయటకు రాకుండా అన్నిరకాల జాగ్రత్తలు, ఒత్తిళ్లు

సాక్షి, హైదరాబాద్: రామోజీఫిల్మ్ సిటీలో ఏం జరిగినా అంత సులభంగా బయటకు పొక్కదు. రామోజీరావు అంగీకరిస్తే తప్ప ఫిల్మ్ సిటీ అనే కోటలోకి తమకు కూడా ఎంట్రీ ఉండదని పోలీసు వర్గాలే చెబుతుంటాయి. పెద్దలపైనా ఒత్తిడి తీసుకువచ్చి విషయం బయట పడకుండా మేనేజ్ చేస్తారని ఆ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి ఉదంతాలు కొన్ని గతంలో చోటు చేసుకున్నాయి. అయితే గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో కన్నుమూసింది తమ ఉద్యోగి కాకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చిందని అంటున్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రమాదాలు చోటు చేసుకోవడం కొత్తేంకాదు. 2008 నవంబర్‌లో చోటు చేసుకున్న ఓ భారీ అగ్నిప్రమాదం.. వారం తర్వాత 'సాక్షి' చొరవతో వెలుగులోకి వచ్చింది. ఓ అంతర్జాతీయ సంస్థకు చెందిన వార్షిక సమావేశానికి దాని నిర్వాహకులు రామోజీ ఫిల్మ్ సిటీని ఎంపిక చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒప్పందాలు పూర్తయిన తర్వాత వేదిక కూడా ఖరారైంది. ఆ ఏడాది నవంబర్ 2న దాదాపు 3,500 మంది హాజరైన ఆ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఫిల్మ్ సిటీకి చెందిన సిబ్బంది ప్రధాన వేదికను సిద్ధం చేశారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా స్టేజీ సమీపంలో దాదాపు 200 హైడ్రోజన్ బెలూన్లను ఉంచారు. అయితే ఈ ఉత్సవాలకు హాజరైన ఓ ప్రతినిధి హైడ్రోజన్ బెలూన్ల సమీపంలో సిగరెట్ కాల్చే ప్రయత్నం చేసినా ఫిల్మ్ సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఆ ప్రతినిధి విసిరేసిన సిగరెట్ పీక సమీపంలో ఉన్న హైడ్రోజన్ బెలూన్లపై పడటం, అవి ఒక్కసారిగా పేలిపోయి మంటలు వ్యాపించడం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడ పని చేస్తున్న దాదాపు 22 మంది ఫిల్మ్ సిటీ ఉద్యోగులకు గాయాలయ్యాయి. వీరికి తన కోటలోనే ఉన్న ఆస్పత్రిలో గుట్టుచప్పుడు కాకుండా వైద్యం చేయించిన రామోజీరావు.. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారుల వరకు విషయం చేరనీయలేదు. దాదాపు వారం తర్వాత ఈ విషయం నాటకీయంగా వెలుగులోకి రావడంతో హయత్‌నగర్ (అప్పట్లో అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా లేదు) పోలీసులు సీన్‌లోకి వచ్చారు. దీంతో విషయం లీక్ చేశారంటూ రామోజీ సైన్యం రాద్ధాంతం చేసింది. చివరకు నామమాత్రంగా సిబ్బందికి సహాయం చేసింది.

ఆ టాలెంట్ రామోజీకే సొంతం

ఫిల్మ్ సిటీలో జరిగిన ప్రమాదాలను బాహ్య ప్రపంచానికి తెలియకుండా దాచి ఉంచే రామోజీ రావులో మరో టాలెంట్ కూడా ఉంది. తప్పంతా క్షతగాత్రులు లేదా బాధితులదే అన్నట్టుగా కూడా చూపించగలరు. బాధితులే ఆ విధంగా చెప్పేలా చేయగల నైపుణ్యం రామోజీరావు సొంతం. 2009లో బాలానగర్‌లోని ఈనాడు ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగిన ప్రమాదమే దీనికి ఉదాహరణ. మధ్యప్రదేశ్‌కు చెందిన బిజయ్‌కుమార్ 2009 మే 19న బాలానగర్‌లోని ఈనాడు ప్రింటింగ్ ప్రెస్‌లో పనికి వచ్చాడు. అక్కడి మూడో అంతస్తులో పని చేస్తూ మధ్యాహ్నం వేళ కింద పడ్డాడు. విషయం బయటకు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో బిజయ్‌ను ఈనాడు ప్రింటింగ్ ప్రెస్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలించాలని ప్రయత్నించారు. అక్కడ పండ్ల వ్యాపారం చేసే సయ్యద్ ముస్తాఫా అడ్డుకుని ప్రశ్నించడంతో సెక్యూరిటీ సిబ్బంది ఆయనపై దాడి చేసి తమపైనే దాడి జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు ముస్తాఫా ద్వారా ఈ ప్రమాదం విషయం వెలుగులోకి రావడంతో బాలానగర్ పోలీసులు జోక్యం చేసుకున్నారు. దీంతో ఈనాడు సిబ్బంది కథ మార్చేశారు. అదే రోజు బిజయ్‌ను తీసుకుని బాలానగర్ ఠాణాకు వచ్చారు. తన తప్పిదం వల్లే పైనుంచి కింద పడ్డానని, దీనిపై కేసు వద్దని అతడితోనే రాయించారు. ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని అప్పట్లో పోలీసులు ప్రకటించారు.

విస్టెక్స్ ఉదంతంలోనూ అనేక ప్రయత్నాలు


మృతుడు సంజయ్ షా


గాయపడ్డ రాజు దాట్ల

విస్టెక్స్ ఏషియా సీఈఓ సంజయ్ షా మరణానికి కారణమైన రామోజీ ఫిల్మ్ సిటీపై ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కలిదిండి జానకిరామ్ రాజు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందులో ఫిల్మ్ సిటీలోని భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం, రెస్క్యూ ఆపరేషన్‌లో ఉన్న వైఫల్యాలను ఎత్తిచూపారు. అయితే విస్టెక్స్ ఉదంతంలోనూ రామోజీ తన మార్క్‌ను చూపించారు. దుర్ఘటన జరిగినప్పుడు అక్కడ ఉన్న ఆర్‌ఎఫ్‌సీ ఉద్యోగుల ఫోన్లన్నీ స్వాధీనం చేసుకోవాలని, విషయం బయటకు పొక్కనివ్వొద్దని హెచ్చరించారు. పోలీసులకిచ్చిన ఫిర్యాదులోని అంశాలు రికార్డుల్లోకి ఎక్కకుండా ఉంచేందుకు ఆఖరి నిమిషం వరకు ప్రయత్నించారు. జరిగిన ఉదంతంపై కేసు నమోదు చేసుకోవాలని, కానీ భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం, అంబులెన్స్ రాక ఆలస్యం కావడం, అదనపు అంబులెన్స్ లేకపోవడం వంటివి ప్రాథమిక సమాచార నివేదికలో (ఎఫ్ఐఆర్) నమోదు కాకుండా చూడాలని అనేక ప్రయత్నాలు చేశారు. అవి రికార్డుల్లోకి ఎక్కి, బయటకు వస్తే ఫిల్మ్ సిటీ వ్యాపారం దెబ్బతింటుందంటూ తమ మందీమార్బలంతో పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. కానీ పోలీసులు ససేమిరా అన్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలియజేయడమే కాకుండా ఫిర్యాదులోని ప్రతి అంశాన్నీ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.

జిల్లా వార్తలు

విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో వాణిజ్య సమావేశం

కొరిటెపాడు(గుంటూరు): విశాఖపట్నం పోర్టు అథారిటీ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా శుక్రవారం రాత్రి గుంటూరులో వాణిజ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే అధ్యక్షత వహించారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ప్రముఖ ఎగుమతి, దిగుమతి దారులను ఆయన ఈ సమావేశానికి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా దుర్గేష్‌కుమార్ మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతులలో విశాఖపట్నం పోర్టు నుంచి విదేశాలకు దేశీయంగాను సరుకు రవాణాకు ఉన్న అవకాశాలను ఆయన వివరించడంతోపాటు తమ తమ వ్యాపారాల అభివృద్ధి కోసం పోర్టు సేవలను వినియోగించుకోవాలని కోరారు. తద్వారా ఏపీ నుంచి ఎగుమతులు, దిగుమతులను పెంచడంతోపాటు పోర్టులో సరుకు రవాణాను పెంచడంలో దోహదపడాలని కోరారు. పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు విశాఖపట్నం పోర్టు ద్వారా వాణిజ్యాన్ని కొనసాగించడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు, మిర్చి, టెక్స్‌టైల్, కాటన్ వ్యాపారాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి.భాస్కరరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు ఎల్.రఘురామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఏపీ ఈడీపీ రీజనల్ మేనేజర్ ఆర్చరీ నాయుడు, నంది డెయిరీ చైర్మన్ రామలింగారెడ్డి, ఇండియన్ టొబాకో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.సాంబశివరావు, కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రాఘవరావు, కాటన్ అసోసియేషన్ కార్యదర్శి రామారావు, విశాఖ కంటైనర్ టెర్మినల్ అధిపతి సుదీప్ చక్రవర్తి, ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కోటిరావు, శ్రావణ షిప్పింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సాంబశివరావు తదితరులు మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి వ్యాపార పరంగా తీసుకోవలసిన సూచనలను చేశారు. తద్వారా గుంటూరు–విశాఖపట్నంఅభివృద్ధిని ఆకాంక్షించారు. వీరితోపాటు వివిధ వాణిజ్య పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులు సభ్యులు వాణిజ్య సమావేశంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డెప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే

22న తుది ఓటర్ల జాబితా

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తుది ఓటర్ల జాబితా ప్రచురణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సీఈవో) ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఓటర్ల తుది జాబితా ప్రచురణ, ఎన్నికల సిబ్బంది డేటా బేస్, ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ, జాతీయ ఓటర్ల దినోత్సవం (జనవరి 25) తదితరాలపై సీఈవో సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎన్నికల సిబ్బందిగా విధుల నిర్వహణకు అవసరమయ్యే ఉద్యోగుల డేటాబేస్ రూపకల్పనను పూర్తి చేయడంపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఆర్వో, ఏఆర్వోల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం (ఎన్వీడీ) నేపథ్యంలో బూత్ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

బీఎస్ఎన్ఎల్ ఎడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా సుభాషిణి

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా తనను కేంద్ర ప్రభుత్వం నియమించిందని విజయవాడ పటమటకు చెందిన చెందిన పాలడుగు సుభాషిణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీలో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు అందరినీ పార్టీ గుర్తించి తగిన బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషకరమన్నారు. తాను గతంలో బీజేఎంఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలిలిగా చేశానని, పార్టీ తనపై నమ్మకంతో కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవి ఇచ్చిందని తెలిపారు. ఢిల్లీలోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శుక్రవారం బీఎస్ఎన్ఎల్ సీఎండీ దినేష్‌చంద్ర తనకు నియామక పత్రం అందించారని పేర్కొన్నారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న పాలడుగు సుభాషిణి

'సచివాలయం' సూపర్ హిట్టు

బాపూ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం

- కొత్త వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు
- సకల సేవలనూ ఒక్కచోట చేర్చి సుపరిపాలన
- సొంతూరిలోనే ఉద్యోగాలు పొందిన యువత
- నాలుగున్నరేళ్లలో సంతృప్తస్థాయిలో సేవలు

ఒక ఆలోచన మహాత్ముడి కలను సాకారం చేసింది. ఒక నిర్ణయం దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఒక సంకల్పం సరికొత్త వ్యవస్థను సృష్టించింది. ఆ వ్యవస్థ ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు చేర్చింది. సమస్త సేవలకు నిలయమైంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికైంది. అదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ. నాలుగున్నరేళ్లుగా వందల సేవలకు గడప ముంగిటే అందిస్తూ యువజన, శ్రామిక, రైతుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది.



మచిలీపట్నం మండలం పెదపట్నం సచివాలయం

సాక్షి, మచిలీపట్నం : మండలంలోని పెదపట్నం గ్రామం మండల కేంద్రానికి 22కిలో మీటర్ల దూరంలో ఉంది. ఆ గ్రామంలో 750కి పైగా కుటుంబాలు, 2,800 మందికి పైగా జనాభా ఉన్నారు. ఆ గ్రామస్తులు ప్రభుత్వ పరంగా ఏ సేవలు పొందాలన్నా.. మండల కేంద్రానికి రావాల్సిందే. కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణపత్రాలతో పాటు పింఛన్, పాస్ పుస్తకాలు, రేషన్ కార్డుల కోసం బందరు రావాల్సి వచ్చేది. అయితే ఆ సమయంలో ఆర్ఐ, సర్వేయర్, తహసీల్దార్, ఎంపీడీఓ ఇలా అధికారుల్లో ఏ ఒకరు లేకపోయినా పని అయ్యేది కాదు. వాటి కోసం పదేపదే తిరిగి కష్టాల పాలయ్యేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఆ ఊరిలోనే సేవలన్నీ అందుతున్నాయి.

గాంధీజీ కలను నిజం చేస్తూ..

దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు.. అవి అభివృద్ధి చెందాలంటే గ్రామ స్వరాజ్యం రావాలని జాతిపిత మహాత్మగాంధీ నాడు కలలు కన్నారు. అయితే ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇది మాత్రం ఆచరణకు నోచుకోలేదు. కానీ 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అది సాధ్యమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఒకప్పుడు రాష్ట్ర రాజధాని కేంద్రంలో మాత్రమే ఉండే సచివాలయం.. ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ కొలువుదీరింది.


సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్ (ఫైల్)

ఇచ్చిన హామీ.. వెంటనే అమలు..

ఎన్నికల హామీని అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4లక్షల ఉద్యోగాలు భర్తీ చేయగా అందులో 1.35లక్షలకు పైగా రెగ్యులర్ ఉద్యోగాలున్నాయి. ఇందులో కృష్ణా జిల్లాలో 508 సచివాలయాలు ఏర్పాటు చేసి, 4,489 రెగ్యులర్ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపారు.

సులువుగా సేవలు..


గ్రామ/ వార్డు సచివాలయాల్లో 540 రకాలు ప్రభుత్వ సేవలను అమల్లోకి తీసుకొచ్చారు. ఇందులో సాంకేతిక సమస్య కారణంగా కొన్నింటికి అవాంతరాలు ఎదురవుతుండగా 500కి పైగా సేవలు మాత్రం సులువుగా అందుతున్నాయి. కొత్త రేషన్ కార్డులు, పేర్లు జోడించడం, తొలగించడం, పింఛన్, కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణపత్రాలు, విద్యుత్ కనెక్షన్, బిల్లుల చెల్లింపులు, ఆస్తి, కొళాయి పన్ను చెల్లింపు, పట్టదారు పాస్ పుస్తకాలు వంటి అనేక సేవలు గ్రామాల్లోనే లభిస్తున్నాయి.

కృష్ణా జిల్లా సచివాలయాల వివరాలు..

నియోజకవర్గం	సచివాలయాల సంఖ్య	ఇప్పటి వరకూ అర్జీలు	అందజేసిన సర్వీసులు
అవనిగడ్డ	77	2,92,760	2,90,570
గన్నవరం	62	2,29,241	2,27,183
గుడివాడ	75	2,61,368	2,59,873
మచిలీపట్నం	77	2,22,655	2,21,237
పామర్రు	72	3,00,189	2,98,709
పెడన	76	2,66,430	2,64,821
పెనమలూరు	69	2,71,845	2,70,485
మొత్తం	508	18,44,488	18,32,878

కృష్ణా జిల్లాలో పరిస్థితి..

- మొత్తం గ్రామ/వార్డు సచివాలయాలు: 508
- మొత్తం సచివాలయ సిబ్బంది: 4,489
- ఇప్పటి వరకూ వచ్చిన అర్జీలు: 18,44,488
- పరిష్కారమైన అర్జీలు: 18,32,878


సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

గ్రామంలోనే అన్ని సేవలు



ఒకప్పుడు ప్రభుత్వ సేవల కోసం మండలం కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. వెళ్లిన రోజు సంబంధిత విభాగాల ఏ అధికారి లేకున్నా.. పని అయ్యేది కాదు. మా సమయం, చార్జీలు వృథా. మరో రోజు వెళ్లినా పని అవుతుంతో లేదో తెలిసేది కాదు. ఇప్పుడా సమస్య లేదు. సీఎం జగన్ చలవతో మా గ్రామంలో అన్ని సేవలు అందుతున్నాయి.

– చేబత్తుల ప్రియదర్శిని, పెదపట్నం, మచిలీపట్నం మండలం

సచివాలయ సేవలు అభినందనీయం



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విప్లవాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సేవలు బాగున్నాయి. ఏ పని కావాలన్నా ఇక్కడే అందుతున్నాయి. మండల అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఒక పూట సచివాలయానికి వెళ్తే వెంటనే నమోదు చేసిన నంబర్ ఇస్తారు. ఫలాన రోజు రమ్మని చెప్పిన రోజు వెళ్తే సర్టిఫికెట్ తీసి ఇచ్చేస్తున్నారు.

– ఎండీ షరీఫ్, జవ్వారు పేట, మచిలీపట్నం

సేవలకు అధిక ప్రాధాన్యం..



సచివాలయాల్లో ప్రజల సేవలు, సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ పనుల కోసం దరఖాస్తు చేసుకుంటే పౌర సేవా పత్రం ప్రకారం నిర్ణీత గడువులోపు జాప్యం లేకుండా సేవలు అందిస్తున్నాం. దరఖాస్తు ప్రక్రియ నుంచి పరిష్కారం వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది.

– కేవీ సుబ్బారావు, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్

జాప్యం లేకుండా సేవలు



ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఇందులో సుమారు 500కు పైగా సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం మేరకు సచివాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి సంతృప్త స్థాయిలో సేవలు అందిస్తున్నాం. సేవల్లో జాప్యం లేకుండా పనిచేస్తున్నాం.

– కారుపర్తి పూర్ణచంద్రరావు, వార్డు ఎద్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, అగస్త్యేశ్వరపురం సచివాలయం–5, పెడన

క్లుప్తంగా...

టీడీపీలో అడుగడుగునా అవమానాలే

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు



తిరువూరు: తెలుగు దేశం పార్టీలో 30 ఏళ్లగా సేవ చేసినా తనకు తీరని అన్యాయం జరిగిందని, అడుగడుగునా అవమానించారని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరువూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇటీవల తిరువూరు పర్యటనకు వచ్చినపుడు మాజీ ఎమ్మెల్యేగా తనకు కనీసం సమాచారం ఇవ్వలేదన్నారు. తనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ పునర్జన్మ ఇచ్చారని, జీవితాంతం తాను ఆయనకు రుణపడి ఉంటానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గుర్తింపు ఇచ్చింది వైఎస్సార్‌సీపీయేనని, విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం సీఎం మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనమని స్వామిదాస్ అన్నారు.

చంద్రబాబు బెయిల్ రద్దు కేసు విచారణ వాయిదా

- కౌంటరు దాఖలుకు సమయం కోరిన చంద్రబాబు తరపు న్యాయవాది
- విచారణ ఫిబ్రవరి 12కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ కేసులో చంద్రబాబు 52 రోజుల పాటు జైల్లో ఉన్నారు. కంటి చికిత్స, ఇతర ఆరోగ్య సమస్యలున్నాయంటూ హైకోర్టును ఆశ్రయించడంతో.. చంద్రబాబుకు అక్టోబర్ 31న తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. ఆ తర్వాత నవంబర్ 20న తాత్కాలిక బెయిల్‌ను రెగ్యులర్ బెయిల్‌గా మారుస్తూ ఆదేశాలిచ్చింది. దీనిపై ఏపీ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నవంబర్ 21న సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై డిసెంబర్ 8న జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్రల ధర్మాసనం విచారించి జనవరి 19కి వాయిదా వేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ కేసు విచారణ శుక్రవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం ముందుకొచ్చింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఇటీవలే తీర్పు వచ్చిందని.. అధ్యయనం చేయడానికి సమయం పడుతుందని చంద్రబాబు తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలుపుతూ, కౌంటర్ దాఖలుకు సమయం కోరారు. దీంతో ఫిబ్రవరి 12వ తేదీకి విచారణను వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.

'రామానాయుడు స్టూడియో భూముల కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియో భూములకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. స్టూడియో నిమిత్తం కేటాయించిన భూములను లేఅవుట్‌లు వేసి అమ్ముకుంటున్నారంటూ వెలగపూడి రామకృష్ణబాబు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు పిటిషన్ కొట్టివేయడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ అభయ్‌ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. స్టూడియో నిమిత్తం ఇచ్చిన 35 ఎకరాల్లో 14 ఎకరాలను రెసిడెన్షియల్ భూములుగా మార్చుతూ జీవీఎంసీ ఆదేశాలిచ్చిందని, దీంతో లేఅవుట్లు వేసి అమ్మకాలకు సిద్ధం చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది శివసంతోష్ తెలిపారు. దీంతో జీవీఎంసీ కమిషనర్, ఇతర ప్రతివాదులకు నోటీసులిచ్చిన ధర్మాసనం.. మార్చి 11 లోపు కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ లోగా స్టూడియో పనులు మినహా మిగతా పనులు చేపట్టరాదంటూ ధర్మాసనం స్టే విధించింది.

రఘురామ పిటిషన్లపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బెయిలు రద్దు చేయాలని, కేసుల విచారణ వేరే రాష్ట్రాలకు బదిలీ చేయాలంటూ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎంపీ రఘురామకృష్ణరాజుపై వైఎస్సార్‌సీపీ అనర్హత పిటిషన్ దాఖలు చేయడంతోనే ఈ పిటిషన్లు దాఖలు చేశారని ముఖ్యమంత్రి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. విచారణ ఆలస్యానికి తమకు ఎలాంటి సంబంధం లేదని సీబీఐ తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. కోర్టు న్యాయపరమైన అంశాలు మాత్రమే పరిశీలన చేస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ.. విచారణ వాయిదాపై సంబంధం లేదని దర్యాప్తు సంస్థ అనడం సబబు కాదంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హైప్రొఫైల్ కేసులు విచారణ త్వరగా విచారణ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలిచ్చినందున హైకోర్టులో ఏం జరుగుతుందో వేచి చూద్దామని, తదుపరి విచారణ ఏప్రిల్‌లో చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

భయపెట్టి.. భూములు కొల్లగొట్టి..



బడుగుల భూముల్లో పచ్చగద్దల పాగా

- ప్రభుత్వ భూములూ హాంఫట్
- ఏజెంట్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద రైతులకు బెదిరింపులు
- అమరావతిలో చంద్రబాబు ముఠా అసైన్డ్ భూ దోపిడీ
- కారుచౌకగా సేల్‌డీడ్ల ద్వారా హస్తగతం
- మొత్తం రూ.5 వేల కోట్ల భూముల లూటీ

బినామీల ద్వారా అసైన్డ్ భూములను కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు..

- నారా చంద్రబాబు (టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)
- నారా లోకేశ్ (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- పొంగూరు నారాయణ (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- గంటా శ్రీనివాసరావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- దేవినేని ఉమామహేశ్వరరావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ప్రత్తిపాటి పుల్లారావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- రావెల కిశోర్‌బాబు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- తెనాలి శ్రావణ్‌కుమార్ (టీడీపీ మాజీ ఎమ్మెల్యే)
- గుమ్మడి సురేశ్ (టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు వియ్యంకుడు)
- మండల ఎస్ఎస్ కోటేశ్వరరావు (రియల్టర్)
- మండల రాజేంద్ర (రియల్టర్)
- కేవీపీ అంజనీకుమార్ (రియల్టర్)
- దేవినేని రమేశ్ (రియల్టర్)
- బొబ్బా హరిచంద్రప్రసాద్ (రియల్టర్)
- హరేంద్రనాథ్ చౌదరి (రియల్టర్)
- పొట్లూరి సాయిబాబు (సిటీ కేబుల్)
- దోనేపూడి దుర్గాప్రసాద్ (రియల్టర్)

అసైన్డ్ భూదోపిడీలో నిందితులు

ఏ1 : నారా చంద్రబాబు

ఏ2 : పొంగూరు నారాయణ

మరో 38 మంది

సెక్షన్లు : ఐపీసీ సెక్షన్లు 420, 506, 166, 167, 217, 120 (బి) రెడ్‌విత్ 34, 35, 36, 37లతోపాటు ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం, అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టం-1977 కింద ఎఫ్ఐఆర్ నమోదు.

సాక్షి, అమరావతి : టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు భూదాహానికి బడుగు, బలహీన వర్గాల అసైన్డ్ భూములు సమిధలయ్యాయి. ప్రభుత్వ భూములూ గల్లంతయ్యాయి. చంద్రబాబు, నారాయణ, వారి బినామీలు, సన్నిహితుల హస్తగతమయ్యాయి. ఏకంగా రూ.4,239.75 కోట్ల విలువైన భూసమీకరణ ప్యాకేజీ వర్తించే 1,072 ఎకరాల అసైన్డ్ భూములు.. రూ.760.25 కోట్ల ప్యాకేజీ వర్తించే 328 ఎకరాల ప్రభుత్వ భూములు.. వెరసి భూసమీకరణ ప్యాకేజీ కింద అమరావతిలో దాదాపు రూ.5వేల కోట్ల విలువైన స్థలాలను చంద్రబాబు, నారాయణలు తమ గుప్పెట పట్టడం నమ్మలేని నిజం. సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తులో ఆధారాలతో సహా ఆ భూదోపిడీ బట్టబయలైంది. దీంతో సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

రూ.5వేల కోట్ల భూదోపిడీ..

ఇలా నాలుగు కేటగిరీల కింద దోపిడీ చేసిన 1,072 ఎకరాల అసైన్డ్ భూములకు ప్యాకేజీ ద్వారా చంద్రబాబు, నారాయణ గ్యాంగ్ ఏకంగా రూ.4,239.75 కోట్ల విలువైన భూములను హస్తగతం చేసుకుంది. ప్రభుత్వ భూములను హస్తగతం చేసుకుని మరో రూ.760.25 కోట్ల భూసమీకరణ ప్యాకేజీ పొందారు. మొత్తం భూసమీకరణ ప్యాకేజీ కింద రూ.5వేల కోట్ల భూములు కొల్లగొట్టారు.

జీఓ-1తో భయపెట్టి.. జీఓ-41తో భూదోపిడీ..

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పేరిట భారీ భూదోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. అందుకోసం రాజధాని భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015, జనవరి 1న జారీచేసిన జీఓ–1ను జారీచేశారు. అందులో అమరావతిలో ప్రైవేటు భూములకే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అసైన్డ్ భూములకు ఎలాంటి ప్యాకేజీ ప్రకటించలేదు. అనంతరం చంద్రబాబు, నారాయణ తమ బినామీలు, ఏజెంట్లను అమరావతి గ్రామాల్లోకి పంపి ప్రభుత్వం అసైన్డ్ భూములను ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకుండా ఉచితంగా తీసుకుంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను భయపెట్టారు. దాంతో తీవ్ర ఆందోళన చెందిన వారు అత్యంత తక్కువ ధరకు అంటే ఎకరాకు కేవలం రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకే చంద్రబాబు, నారాయణ, ఇతర టీడీపీ పెద్దల బినామీలకు అసైన్డ్ భూములను సేల్‌డీడ్ల ద్వారా విక్రయించేలా కథ నడిపారు. అనంతరం.. అసైన్డ్ భూములను కూడా ఆరు కేటగిరీల కింద విభజించి భూసమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ 2016, ఫిబ్రవరి 17న జీఓ–41 జారీచేశారు. ఉన్నతాధికారుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ.. కనీసం కేబినెట్ ఆమోదం కూడా లేకుండా ఈ జీఓను తీసుకొచ్చారు. అంతేకాదు.. ఏకంగా కోర్టును కూడా మోసంచేసి తమ పన్నాగాన్ని అమలుచేశారు. చట్ట ప్రకారం.. 1954 తరువాత పంపిణీ చేసిన భూములను విక్రయించడం, కొనుగోలు చేయకూడదు. కాబట్టి అమరావతి పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో అసైన్డ్ భూముల రికార్డులను మాయం చేశారు. 1954 తరువాత భూపంపిణీ రికార్డులు ఏమీలేవని అమరావతి పరిధిలోని మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ మండల రెవెన్యూ అధికారులతో ఓ నివేదిక ఇప్పించి న్యాయస్థానానికి సమర్పించారు. అప్పటికే అసైన్డ్ భూములు చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట ఉండటంతో వారికే భూసమీకరణ ప్యాకేజీ దక్కేలా చేశారు. అందుకోసం కేబినెట్ ఆమోదం లేకుండానే ఆ జీఓను జారీ చేయడం గమనార్హం.

ప్రభుత్వ భూములూ హాంఫట్..

ఇక రాజధాని కోసం అమరావతి పరిధిలోని ప్రభుత్వ భూములను కూడా చంద్రబాబు, నారాయణ ముఠా కొల్లగొట్టింది. ఎవరి ఆధీనంలోనూ లేని ప్రభుత్వ భూములను గుర్తుతెలియని వ్యక్తుల ఆధీనంలో ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించారు. ఆ భూములకు భూసమీకరణ ప్యాకేజీని ప్రకటించారు. అనంతరం అసలు కథను తెరపైకి తెచ్చారు. మొత్తం 328 ఎకరాల ప్రభుత్వ భూములు తమ బినామీలు 522 మంది ఆధీనంలో ఉన్నట్లుగా చూపించి భూసమీకరణ ప్యాకేజీ వర్తింపజేశారు. తద్వారా రూ.760.25 కోట్ల విలువైన స్థలాలు కొల్లగొట్టారు.

సీఎం వైఎస్ జగన్ ఓ హీరో

- చేసిన మంచే ఆయన్ను నిలబెడుతుంది
- రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



కార్యక్రమ వివరాలు విడుదల చేస్తున్న ఆచార్య లక్ష్మీ ప్రసాద్

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక హీరో అని రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభివర్ణించారు. శుక్రవారం ఏయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ 'నేను మంచి చేస్తేనే ఓటెయ్యండి.. నన్ను గెలిపించండి' అని జగన్ అడుగుతున్నారన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు అడగని విధంగా వైఎస్ జగన్ అడుగుతున్నారని చెప్పారు. ఇది నిజంగా సాహసమని, ఆయన హీరో అని అన్నారు. ఆయనపై పిచ్చి కేసులు పెట్టి 16 నెలలు జైలులో పెట్టి, బెయిల్ రాకుండా చేశారని చెప్పారు. జైలులో ఉన్నప్పటికీ ఆయన తన పార్టీని, వ్యాపార సంస్థలను విజయవంతంగా నడిపారని గుర్తు చేశారు. జగన్ లక్ష కోట్ల రూపాయల అవినీతి చేశారని తప్పుడు వార్తలు పత్రికల్లో రాశారన్నారు. చిన్న వయసులో జగన్ జైలు నుంచి వచ్చిన తర్వాత పాదయాత్ర చేసి ఒంటిచేత్తో 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారని తెలిపారు. నన్ను జగన్ చాలా గౌరవంగా చూశారని, ఆయన కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజలకు ఆయన చేసిన మంచి పనులే భవిష్యత్తులో ఆయన్ను నిలబెడతాయని వివరించారు.

తారక్ వ్యక్తిత్వం మంచిది..

జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిత్వం మంచిదని లక్ష్మీప్రసాద్ అన్నారు. ఆయనను ఎవరైనా ఏమైనా అన్నారంటే ఆకాశంపై ఉమ్మి వేసినట్టేనన్నారు. త్వరలో జూనియర్ ఎన్టీఆర్ ఏం చేస్తారో మీరే చూస్తారని వ్యాఖ్యానించారు.

నేడు యండమూరికి లోక్ నాయక్ సాహిత్య పురస్కారం

ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు లోక్ నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. శనివారం రుషికొండలో జరిగే కార్యక్రమంలో సినీ నటుడు చిరంజీవి చేతుల మీదుగా ఈ పురస్కారం, రూ.2 లక్షల నగదు వీరేంద్రనాథ్‌కు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఏపీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి వ్యవహరిస్తారని తెలిపారు.

అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం చరిత్రలోనే ఓ గొప్ప చిహ్నంగా ప్రసిద్ధికెక్కనుందని ఏపీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ గోచిపాత శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలో ఆకాశమంత ఎత్తున అంబేడ్కరుడు ఆవిష్కృతుడు కావడం ప్రజల అదృష్టమని.. దానిని సుసాధ్యం చేసిన సీఎం అభినందనీయులని ప్రశంసించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలోని సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.


అగ్రవర్ణ అహంకారి రామోజీరావు

- సీఎం జగన్‌కు అంబేడ్కర్ పేరెత్తే అర్హత లేదనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది
- ఏ అర్హత ఉందని రామోజీరావు ఇలాంటి రాతలు రాయిస్తున్నాడు
- ఎర్రచందనం స్మగ్లర్లు టీడీపీలో ఉన్నత పదవుల్లో ఉన్నారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/ఆటోనగర్(విజయవాడ తూర్పు) : రామోజీరావు అగ్రవర్ణ అహంకారంతో తన పత్రికలో ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా కథనాలు రాయిస్తున్నారని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సీఎం జగన్‌కి అంబేడ్కర్ పేరెత్తే అర్హత లేదంటూ ఈనాడులో రాయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. అసలు ఏ అర్హత ఉందని రామోజీరావు ఇలాంటి రాతలు రాయిస్తున్నాడని ప్రశ్నించారు. ఆయన వయస్సుకు తగ్గట్టుగా వ్యవహరిస్తే బాగుంటుందని హితవు పలికారు. విజయవాడలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు, టీడీపీకి అనుకూలంగా వ్యవహరించే చానళ్లు నిత్యం తమపై వ్యక్తిగతంగా వ్యతిరేక కథనాలు రాస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎర్రచందనం స్మగ్లర్ల పేరుతో కేవలం ఒక సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని రాశారని తెలిపారు. 2009లో అటవీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకున్నానని గుర్తు చేశారు. స్వాతంత్రం వచ్చాక తొలిసారి ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు 300 కొత్త వాహనాలను అటవీ శాఖకు ఇచ్చినట్టు చెప్పారు. అలాగే 24 కీలక డివిజన్‌లకు వన్ ప్లస్ ఫోర్ ఆర్మ్‌డ్ పోలీసులను నియమించామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నియంత్రించామని, ఎవరి హయాంలో ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగిందో అందరికీ తెలుసన్నారు. ఎన్నికల సందర్భంగా ఆనాడు పీలేరులో ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్ అంటూ చంద్రబాబు ఆరోపించిన కిషోర్ కుమార్‌రెడ్డికి నేడు బాబు తన పార్టీలో పదవి ఇచ్చాడని విమర్శించారు. టీడీపీలో కొనసాగిన మహేశ్వర్‌నాయుడు, రెడ్డి నారాయణలపై ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సంబంధించి టాడా కేసులున్నాయన్నారు. సీఎం జగన్‌ను వాళ్లు ఎంత ద్వేషిస్తే, ప్రజల నుంచి ఆయనకు అంతగా ఆశీర్వాదం లభిస్తుందన్నారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. చంద్రబాబుకు 175 స్థానాల్లో అభ్యర్థులు ఉన్నారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీలో ఓడిపోతారని, పనికిరారు అంటూ తీసేసిన అభ్యర్థులను చంద్రబాబు తన పార్టీలో చేర్చుకుంటున్నారని, అదీ చంద్రబాబు నాయకత్వ పటిమ అంటూ ఎద్దేవా చేశారు.

ఏపీఈఎంసీఎల్ ఆన్‌లైన్ యాప్‌లు ప్రారంభం

పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ కోసం ఆరంభం • మంత్రి పెద్దిరెడ్డి



న్యూమెరైన్ ఆన్‌లైన్ అప్లికేషన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/ఆటోనగర్(విజయవాడ తూర్పు): విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీ పర్యావరణ యాజమాన్య కార్పొరేషన్ (ఏపీఈఎంసీఎల్) ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ కోసం రూపొందించిన నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, శాస్త్ర–సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను తరలించే వాహనాలను ట్రాకింగ్ చేసే విధానాన్ని ఈ యాప్‌లలో పొందుపరచడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. గతంలో వ్యర్థాలు తరలించే వాహనం ఎక్కడ, ఎంతసేపు నిలిచినా దానిపై పర్యవేక్షణ ఉండేది కాదని, తాజాగా ఈ యాప్‌లతో వాహనం బయలుదేరినప్పటి నుంచి పూర్తి వివరాలు నమోదవుతాయన్నారు. వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసే సంస్థలకు, వాటిని ఉత్పత్తి చేసే సంస్థలకు మధ్య ఏపీఈఎంసీఎల్ వారధిగా నిలుస్తోందన్నారు. వ్యర్థాలను వినియోగించుకునే విధానాలను ప్రోత్సహించడం, వాటిని ప్రాసెస్ చేయడం, సురక్షితంగా నిర్మూలించడం ద్వారా పర్యావరణానికి మేలు కలుగుతుందని వివరించారు.

ఆరోగ్యాంధ్ర కోసం కృషి

ఆరోగ్యాంధ్ర కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన ఏపీ ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ విశేషంగా కృషి చేస్తోందని పెద్దిరెడ్డి చెప్పారు. మెరైన్ పొల్యూషన్ కట్టడికి చర్యలు తీసుకుంటోందని వివరించారు. వ్యర్థాల రీసైకిల్, నిర్వహణ కోసం ఏపీఈఎంసీఎల్ సరికొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించడం అభినందనీయమన్నారు. పరిశ్రమల పాగగొట్టాల తనిఖీకి మరో మూడునెలల్లో కొత్త విధానం తీసుకురానున్నట్టు పెద్దిరెడ్డి చెప్పారు. ఇప్పటివరకు ఏపీఈఎంసీఎల్ వద్ద 1,085 వ్యర్థ జనరేటర్లు, 199 వ్యర్థ రిసీవర్లు, 230 ట్రాన్స్‌పోర్టర్లు, 1606 వాహనాలు నమోదైనట్టు వివరించారు. అనంతరం మంత్రిని ఏపీఈఎంసీఎల్ ఛైర్మన్ గుబ్బా చంద్రశేఖర్ శాలువా కప్పి సన్మానించారు. ఏడుకొండల స్వామి విగ్రహాన్ని బహూకరించారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (అటవీ శాఖ) నీరబ్ కుమార్ ప్రసాద్, ఏపీఈఎంసీఎల్ ఎండీ పీవీ చలపతిరావు, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


Reliance
NOW OPEN AT
MACHILIPATANAM: VARAM CENTRAL MALL, BESIDES D-MART
Reliance digital
PERSONALISING TECHNOLOGY
కొత్త తరం దేశం కోసం కొత్త టెక్
డిజిటల్ ఇండియా సేల్
భారతదేశపు అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సేల్
20 – 28 జనవరి 2024
₹26 000 వరకు
ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
₹10 000* వరకు
ICICI Bank
onecard
CREDIT CARDS
₹16 000* వరకు
అన్ని క్రెడిట్ & డెబిట్ కార్డ్స్ పై
QLED 4K
AKAI
Google TV
109cm (43) QLED ₹24990
139cm (55) QLED ₹35990
127 CM (50)
4K ULTRA HD
Google TV
DOLBY AUDIO
HDR10
BPL SANSUI SONY TCL
Starting from ₹26990
OLED TV
2 Year WARRANTY
Starting from ₹89990*
LG SAMSUNG SONY
EMIs of ₹3990*
BENEFITS
UP TO ₹15000 CASHBACK ON LEADING BANKS* + SOUND BAR WORTH ₹45990 FREE (ON SELECT OLEDS)
LG
2 Year WARRANTY
NanoCell
ULTRA BRIGHT PANEL
65NANO83
165 cm (65) ₹89990*
EMIs of ₹2990*
BENEFITS
GET CASHBACK UPTO ₹7500* ON LEADING BANKS
GAMING LAPTOP
Intel® Core™ i5 RTX 2050
Starting from ₹54999*
EMIs of ₹4583*
AMD R5 RTX 3050
Starting from ₹58999*
EMIs of ₹4999*
EVERDAY LAPTOP
Intel® Core™ i3
Starting from ₹29999*
EMIs of ₹2500*
AMD R3
Starting from ₹33499*
EMIs of ₹2792*
MULTI TASKING LAPTOP
Intel® Core™ i5
Starting from ₹44999*
EMIs of ₹3833*
AMD R5
Starting from ₹35999*
EMIs of ₹3083*
CREATOR LAPTOP
Intel® Core™ i7
Starting from ₹44999*
EMIs of ₹4167*
AMD R7
Starting from ₹49999*
EMIs of ₹4167*
GET TROLLEY BAG WORTH ₹7000 ON LAPTOP PURCHASE
WATCH
S9 41 mm GPS
₹41 900
₹34 499*
*Price post bank cashback
AirPods Pro
2nd Gen (USB-C)
₹24 900
₹19 900*
EMIs of ₹829*
*Inclusive of cashback
BEST DEAL
DOLBY ATMOS SOUNDBAR
JBL | SONY | Samsung | boAt | LG
Starting from ₹17999
SAMSUNG
Introducing
Galaxy S24 Series
Galaxy AI is here
Your Choice. Our Promise. Guaranteed Availability. Else, Get ₹10000* worth Gift Vouchers!
Pre Book Now
*T&C Apply.
OnePlus Nord CE 3 Lite 5G
₹21 999
Starting from ₹19 999*
*Price post cashback
SAMSUNG
A15
₹19 499
Starting from ₹17 999*
A25
₹26 999
Starting from ₹23 999*
*Price post cashback
iPhone
13/128
₹59 900
₹52 900*
14/128
₹69 900
₹59 900*
15/128
₹79 900
₹73 900*
*Price post in store discount and brand cashback
iPad
9th Gen WiFi 64GB
EMI ₹1042*
Air 5 WiFi 64GB
EMI ₹2246*
FROST FREE
LG 242L ₹22990*
EMIs of ₹1916*
HAIER 237L ₹23490*
EMIs of ₹1958
SAMSUNG 301L ₹32490*
EMIs of ₹2708
2 STAR
SIDE BY SIDE
KELVINATOR 584L ₹51990*
EMIs of ₹4333*
SAMSUNG 653L ₹85490*
EMIs of ₹7124
LG 635L ₹97490*
EMIs of ₹8124
8Kg FRONT LOAD
Starting from ₹31990*
EMIs of ₹2666*
9Kg FRONT LOAD
Starting from ₹35990*
EMIs of ₹2999*
*Prices after bank cashback
BUY ANY SMALL APPLIANCE WORTH ₹2999 WITH UPI AND GET 10% INSTANT CASHBACK
GEYSER
HAVELLS 3L ₹3239
BAJAJ 15L ₹6749
HAVELLS 15L ₹11429
*Price after Cashback
MIXER & GRINDER
PHILIPS 750W 4J ₹4229
HAVELLS 750W 4J ₹4409
BOSCH 1000W 4J ₹5849
*Price after Cashback
సరికొత్త టెక్ విస్తృత శ్రేణి
అతితక్కువ ధరలు*
సులభ ఈఎమ్ఐలు
వేగవంతమైన డెలివరీ మరియు ఇన్‌స్టాలేషన్
Reliance resQ
పర్సనలైజ్డ్ గైడెన్స్ | సర్వీస్ | మెయింటెనెన్స్
1800 889 1044
reliancedigital.in
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
VISIT US AT CENTRAL ANDHRA : • VIJAYAWADA: ELURU ROAD (CHUTTUGUNTA)PH:9321997487 / 9321997489. |GUDIVADA: ELURU ROAD PH: 8247210092 / 8247270023 | NARSARAOPET: BESIDE SRINIDHI HOTEL, ARUNDALPET PH: 8104982242 | VIJAYAWADA: PATAMATA, GROUND & FIRST FLOOR, SRI CHAKRA TOWERS, OPP DURGA MAHAL THEATER PH: 0866-2466000 | LEPL CENTRO MALL, MG ROAD, OPP HOTEL FORTUNE MURALI, BACK SIDE OF LIFE STYLE, LABBIPET PH: 0866-2466603/2466604 | BHAVANIPURAM, ADJACENT TO SRIRASTU FUNCTION HALL, CHURCH CENTER PH: 8591404541 / 8591404542|TADEPALLI, NEAR PATHUR CROSS ROADS, MAIN ROAD, TADEPALLI, PH: 6281113898/8074582587|ENIKEPADU, NH 5 OPP: SRI SHAKTI PELLI PANDIRI PH: 9381387220|6301104338 • BHIMAVARAM: FIRST FLOOR, COASTAL CITY CENTRE MALL (AVG CINEMAS), UNDI ROAD, WEST GODAVARI PH: 8928932475|76 • ELURU: VISIT US AT 2ND & 3RD FLOOR, CENTRAL PLAZA, PATHEBAD MAIN ROAD, RR PETA PH: 9390705656|8688231199 • GUNTUR: LAXMIPURAM MAIN ROAD, OPP GAYATRI COLLEGE PH: 8591404514|15 • GUNTUR: OPPOSITE METRO THEATER, KOTHAPET PH: 8591404546|47 • ONGOLE: 1ST FLOOR, PMK NAIDU PROPERTY, BESIDE NAVABARATH THEATRE, GUNTUR ROAD PH: 08592–283601/ 283603 • NELLORE: OPPOSITE KASTURIBA KALAKSHETRAM, BESIDE POLICE GROUNDS, DURGAMITTA PH: 8591402738/55 | NELLORE : LECTURERS COLONY, MINI BYPASS ROAD PH: 8591404512/13 • PIDUGURALLA: BESIDES ANJI REDDY MULTISPECIALITY HOSPITAL PH: 8928933277|78| TADEPALLIGUDEM: JUBILEE ROAD, OPPOSITE RAILWAY STATION, NEAR AXIS BANK, PH : 8591402698/8591402697| CHIRALA : MUNTAVARI CENTER CHIRALA TOWN, PH : 08594 – 232211 | MACHILIPATANAM : VARAM CENTRAL MALL, BESIDES DMART, PH : 6303768395&8074093623 | TO LOCATE YOUR NEAREST MY JIO STORE SMS LOCATE <PINCODE> TO 561611
Unless specified, the retail prices shown are for 1 unit of the product.


సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 20-1-2024



◂శ్వేత కె సుగాథన్



చునౌతి శర్మ ▸





రిపబ్లిక్ డే

కర్తవ్య పథ్‌లో దళ నాయికలు

ఢిల్లీ పోలీస్ మొదటిసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో సంపూర్ణ మహిళా దళాన్ని కవాతు చేయించనుంది. ఇదొక రికార్డు. ఈ దళానికి ఐపిఎస్ శ్వేత కె సుగాథన్ నాయకత్వం వహించనుంది.

అలాగే ఇండియన్ కోస్ట్ గార్డ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ చునౌతి శర్మ నాయకత్వం వహించనుంది. ఇదీ రికార్డే. భారత త్రివిధ దళాలలో, రక్షణ దళాలలో మహిళల భాగస్వామ్యం ప్రతి ఏటా ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో మహిళా శక్తి తన స్థయిర్యాన్ని ప్రదర్శించనుంది. దేశ రక్షణలో, సాయుధ ప్రావీణ్యంలో తాను ఎవరికీ తీసిపోనని చాటి చెప్పనుంది. గత రెండు మూడు సంవత్సరాలుగా రిపబ్లిక్ డే పరేడ్‌లో మహిళలకు దొరుకుతున్న ప్రాధాన్యం ఈ సంవత్సరం కూడా కొనసాగుతోంది. అంతే కాదు గత కొన్నాళ్లుగా త్రివిధ దళాలలో ప్రమోషన్లు, ర్యాంకులు, నియామకాల్లో స్త్రీలకు సంబంధించిన పట్టింపులు సడలింపునకు నోచుకుంటున్నాయి. ప్రాణాంతక విధుల్లో కూడా స్త్రీలు ఆసక్తి ప్రదర్శిస్తే వారిని నియుక్తులను చేయడం కనిపిస్తోంది. ఆ తెగువే ఇప్పుడు రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రదర్శితం కానుంది.

ఢిల్లీ మహిళా దళం

ఈ సంవత్సరం గణతంత్ర వేడుకలలో ఢిల్లీ పోలీసులు సంపూర్ణ మహిళా దళాన్ని కవాతు చేయించాలని, దానికి మరో మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించాలని నిర్ణయించడం చరిత్రాత్మకం. ఎప్పుడో 1975లో ఢిల్లీ పోలీసు దళానికి నాటి ఐ.పి.ఎస్. ఆఫీసర్ కిరణ్ బేడీ నాయకత్వం వహించి చరిత్ర సృష్టించింది. మళ్లీ గత సంవత్సరంగాని ఐ.పి.ఎస్. ఆఫీసర్ శ్వేత కె సుగాథన్‌కు నాయకత్వం వహించే అవకాశం రాలేదు. అయితే ఆ దళంలో ఉన్నది మగవారు. ఈసారి మాత్రం పూర్తి మహిళా దళం పాల్గొననుండటం విశేషం. దీనికి తిరిగి శ్వేత కె సుగాథన్ నాయత్వం వహించనుండటం మరో విశేషం. నార్త్ ఢిల్లీకి అడిషనల్ డీసీపీగా పని చేస్తున్న శ్వేత కె సుగాథన్‌ది కేరళ. 2015లో బి.టెక్ పూర్తి చేసిన శ్వేత మొదటిసారి కాలేజీ టూర్‌లో ఢిల్లీని దర్శించింది. 2019లో యు.పి.ఎస్.సి. పరీక్షలు రాయడానికి రెండోసారి ఢిల్లీ వచ్చింది. అదే సంవత్సరం ఐ.పి.ఎస్.కు ఎంపికైన శ్వేత ఇప్పుడు అదే ఢిల్లీలో గణతంత్ర దినోత్సవంలో దళ నాయకత్వం వహించే అవకాశాన్ని పొందింది. శ్వేత దళంలో మొత్తం 194 మంది మహిళా హెడ్ కానిస్టేబుళ్లు ఉంటారు. వీరిలో 80 శాతం మంది ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారు. ఢిల్లీ పోలీసు విభాగంలో ఈశాన్య రాష్ట్రాల మహిళల నియామకానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అందుకే శ్వేత నాయకత్వం వహించే దళంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన మహిళా పోలీసులే ఉంటారు. మరో విశేషం ఏమంటే ఈసారి ఢిల్లీ పోలీస్ బ్యాండ్‌కు రుయాంగియో కిన్సే అనే మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించనుంది. 135 మంది పురుష కానిస్టేబుళ్లు ఢిల్లీ పోలీసు గీతాన్ని కవాతులో వినిపిస్తూ ఉంటే వారికి కిన్సే నాయకత్వం వహించనుంది.

కోస్ట్ గార్డ్‌కు చునౌతి శర్మ

గణతంత్ర వేడుకలలో ఇండియన్ కోస్ట్ గార్డ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ చునౌతి శర్మ నాయకత్వం వహించనుంది. తీర ప్రాంతాల గస్తీకి, అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి నియుక్తమైన ఇండియన్ కోస్ట్ గార్డ్ తన ప్రాతినిధ్య దళంతో పరేడ్‌లో పాల్గొననుంది. దీనికి నాయకత్వం వహించే అవకాశం రావడం పట్ల చునౌతి శర్మ ఆనందం వ్యక్తం చేసింది. 'గతంలో నేను ఎన్‌సీసీ కేడెట్‌గా పరేడ్‌లో పాల్గొన్నాను. ఎన్‌సీసీలో మహిళా కాడెట్‌ల దళం, పురుష కాడెట్‌ల దళం విడిగా ఉంటాయి. కాని ఇక్కడ నేను కోస్ట్ గార్డ్ పురుష జవాన్ల దళానికి నాయకత్వం వహించనున్నాను. ఈ కారణానికే కాదు మరోకందుకు కూడా ఈ వేడుకల నాకు ప్రత్యేకమైనవి. ఎందుకంటే నా భర్త శిక్కు దళానికి పరేడ్‌లో నాయకత్వం వహించనున్నాడు. దేశ సేవలో ఇదో విశిష్ట అవకాశం' అందామె.

వీరే కాదు... త్రివిధ దళాల మరిన్ని విభాగాల లోనూ స్త్రీల ప్రాధాన్యం ఈ రిపబ్లిక్ డే వేడుకల్లో పథం తొక్కనుంది.

సెకండ్ జెనరేషన్

ఎంబీఏ చేసిన ఎంఆర్ జ్యోతి వ్యాపార పాఠాలను కళాశాలలో కంటే తండ్రి రామచంద్రన్ అడుగు జాడల్లో నుంచే ఎక్కువగా నేర్చుకుంది. అయిదువేల రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన 'జ్యోతి ల్యాబ్స్'ను వేల కోట్ల టర్నోవర్‌కి తీసుకువెళ్లాడు ఎంపీ రామచంద్రన్. ఎండీగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి కంపెనీని మరోస్థాయికి తీసుకువెళుతోంది. 'తండ్రి మెచ్చిన తనయ' అనిపించుకుంది...

తండ్రి మెచ్చిన తనయ



ఎంఆర్ జ్యోతి

తండ్రి అయిదు వేల రూపాయల పెట్టుబడితో వ్యాపారం మొదలు పెట్టినప్పుడు జ్యోతి వయసు అయిదు సంవత్సరాలు. త్రిసూర్ (కేరళ)లోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తండ్రి వ్యాపారాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఎంత కష్టపడ్డాడో జ్యోతికి కళ్లకు కట్టినట్లుగా గుర్తుంది. అదృష్టాన్ని కాకుండా కష్టాన్నే నమ్ముకున్న తండ్రి ఇటుకా ఇటుకా పేర్చి కంపెనీని బలోపేతం చేశాడు. సెలవు అంటూ లేకుండా వారానికి ఏడు రోజులూ పనిచేసేవాడు.

ప్రాడక్ట్స్ లోడింగ్ నుంచి పత్రికలకు ఇచ్చే అడ్వరైజ్‌మెంట్‌ల వరకు అన్నీ దగ్గరుండి చూసుకునేవాడు.

సింగిల్ ప్రాడక్ట్ 'ఉజాల'తో మొదలైన కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ 'జ్యోతి ల్యాబ్స్' ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

కంపెనీ మొదలు పెట్టిన కొత్తలో ఆరుగురు మహిళల బృందం ఇంటింటికీ తిరిగి 'ఉజాల' అమ్మేవారు.

కట్ చేస్తే...

2005లో కంపెనీ మార్కెటింగ్ విభాగంలో చేరింది జ్యోతి. ఆ తరువాత చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా పనిచేసింది. 2020లో కంపెనీ ఎండీగా బాధ్యతలు స్వీకరించింది. బాధ్యతలు చేపట్టడానికి ముందు తరువాత అనే విషయానికి వస్తే ఎండీగా కంపెనీ ఆదాయాన్ని పెంచింది.

నలభై సంవత్సరాలు పూర్తి చేసుకున్న కంపెనీని మరో స్థాయికి తీసుకువెళ్లడానికి రెండో తరం ఎంటర్ ప్రెన్యూర్ అయిన జ్యోతి నిర్మాణాత్మకమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. మార్కెట్‌లో ఎదురవుతున్న సవాళ్ల నుంచి ప్రాడక్ట్ ఇన్నోవేషన్స్. అడ్వర్‌టైజింగ్ ప్లాన్స్ వరకు ఎన్నో విషయాలపై దృష్టి పెట్టింది.

కంపెనీ ప్రధాన ఆధారం... ఫ్యాబ్రిక్ కేర్, డిష్ వాషింగ్ ప్రాడక్ట్స్. ఈ నేపథ్యంలో పర్సనల్ కేర్ సెగ్మెంట్ మీద ప్రత్యేక దృష్టి పెట్టింది జ్యోతి. గత సంవత్సరం కంపెనీ మార్గో సోప్ మూడు వేరియంట్స్‌ను లాంచ్ చేసింది.

పర్సనల్ కేర్‌కు సంబంధించి ఇతర విభాగాలను కూడా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది కంపెనీ.

బహుళజాతి సంస్థల నుంచి పోటీ తట్టుకొని మార్కెట్‌లో ఛాలెంజర్ బ్రాండ్‌గా నిలవడం అంత తేలిక కాదు. అందుకు ఎంతో ఆత్మవిశ్వాసం కావాలి. 'ఇక తిరుగులేదు' అంటూ ఆ ఆత్మవిశ్వాసం ఎక్కువైతే మార్కెట్‌లో ఒక్కో మెట్టు కిందకు దిగక తప్పదు. అందుకే ఆత్మవిశ్వాసం, అతివిశ్వాసానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసుకుంది జ్యోతి.

గతంలోలాగా భవిష్యత్ ఉండకపోవచ్చు. భారీ సవాళ్లు ఎదురు కావచ్చు. జ్యోతి వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. దార్శనిక దృష్టితో ఎప్పటికప్పుడు ఆలోచిస్తుంది. కంపెనీకి సంబంధించి మార్కెటింగ్ విభాగంలో చేరిన కొత్తలో తండ్రితో కలిసి దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూటర్‌లు, రిటైలర్‌లు, స్టేక్‌హోల్డర్స్‌కు సంబంధించి ఎన్నో మీటింగ్‌లలో పాల్గొంది. ప్రతి మీటింగ్ ఒక పాఠశాలగా మారి తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పింది.

'గతమెంతో ఘనకీర్తి' అని గతంలోనే ఉండిపోకుండా 'ట్యూన్ విత్ ది చేంజింగ్ టైమ్స్' అంటున్న జ్యోతి కొత్త టెక్నాలజీని పరిచయం చేయడం (ఉదా: రియల్-టైమ్ డేటాను ఉపయోగించడం) ఆటోమేటింగ్ ప్రాసెస్, ఓపెన్ డోర్ కల్చర్ వరకు ఎన్నో ఆధునిక విషయాలకు ప్రాధాన్యత ఇస్తూ కాలంతో గొంతు కలుపుతూనే ఉంది. గెలుపు దారిలో కొత్త ఉత్సాహంతో ప్రయాణిస్తూనే ఉంది.

ఉద్యోగ గృహిణి

ఒకరు రిలేషన్‌షిప్ ఎక్స్‌పర్ట్ అయ్యారు.. మరొకరు హెల్త్ కోచ్ అయ్యారు ఇంకొకరు పాకశాస్త్ర ప్రావీణ్యతను చాటుతున్నారు. పై చదువులు చదివి ఇంట్లో కూర్చున్న మహిళలు ఇంటర్నెట్‌లో ప్రభావశీలురుగా మారారు. ఇంటినుంచే వ్యాపారాన్ని అభివృద్ధి వైపుగా పరుగులు తీయిస్తున్నారు.

కుకింగ్ టు కామెడీ క్వీన్స్..



ప్రతీకాత్మక చిత్రం

సాధారణంగా గృహిణి జీవితం ఉదయం 4-5 గంటలకు నిద్రలేచి, ఇల్లు-వాకిలి శుభ్రం చేసుకొని, పిల్లలను స్కూల్‌కు పంపించి, అందరికీ అవసరమైనవి చేసి పెడుతుండగానే సాయంత్రం అవుతుంది. తిరిగి పిల్లలు స్కూల్ నుంచి వస్తారు. సాయంత్రం టీ, టిఫిన్లు, పిల్లల హోంవర్క్‌లు, రాత్రి భోజనం సిద్ధం చేయడం. రాత్రి పది-పదకొండు గంటలలోపు అన్నీ శుభ్రం చేసి అలసిపోయి అదే చిరునవ్వుతో అందరికీ గుడ్‌నైట్ చెప్పి నిద్రపోవడం. ఇలా ఇల్లు, పెద్దలు, భర్త, పిల్లల గురించి ఆలోచిస్తూ తమని తాము విస్మరించుకునే మహిళలకు ఇప్పుడు ఇంటి నుంచే పని చేసే అవకాశాలు పెరుగుతున్నాయి.

మంగళూరుకు చెందిన లిండా ఫెర్నాండేజ్ క్రైస్టా గృహిణి. నాలుగేళ్లుగా కామిక్ రీల్స్ చేస్తూ ప్రజాదరణ పొందింది. క్రైస్టాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.3 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అనేక బ్రాండ్లు ఆమెను సంప్రదిస్తూనే ఉన్నాయి. ఈ రోజు మంగళూరు వీధుల్లో ఆమె హోర్డింగులు కూడా పెట్టారంటే ఆమెకున్న ఆదరణ ఏ స్థాయిలో ఉందో చెప్పుకోవచ్చు. 'గృహిణిగా ఉండటం ఎప్పుడూ కష్టమనిపించలేదు. కానీ, నా కొడుకుకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనుకున్నాను. దీంతో పాటు ఇంటి బాధ్యతనూ నిర్వర్తించాలనుకున్నాను. అందుకు మా కుటుంబమూ మద్దతు ఇస్తూ వచ్చింది' అని చెబుతుంది క్రైస్టా.



లిండా ఫెర్నాండేజ్ క్రైస్టా

హోమ్ చెఫ్

నాజ్ అంజుమ్ హైదరాబాద్‌లో నివాసముంటున్న హోమ్ చెఫ్. ఏడేళ్ల క్రితం అంజుమ్ తన పేరుతో హోమ్ కిచెన్‌ను ప్రారంభించింది. ఈ రోజుల్లో గృహిణుల ఆలోచనే మారిపోయింది అనడానికి అంజుమ్ ఒక ఉదాహరణ. కాలంతో పాటు సమాజం ఆలోచనా విధానం కూడా మారింది. ఇంట్లో కూర్చున్నా నాకు సోషల్‌మీడియా చాలా ఆర్డర్లు తెచ్చిపెడుతోంది అని చెబుతుంది అంజుమ్.

'నాకు ముగ్గురు పిల్లలు. ఉదయం 4 గంటలకు నిద్రలేచి, వారిని స్కూల్‌కి రెడీ చేసి, పంపించిన తర్వాత కిచెన్ బాధ్యత తీసుకుంటాను. 80 రూపాయలతో నా పని ప్రారంభించాను. మా చుట్టూ ఉన్నవారు నా వంటలు తిని మెచ్చుకునేవారు. మా అపార్ట్‌మెంట్ వాసులు సోషల్ మీడియాలో అకౌంట్ ఓపెన్ చేయమని సలహా ఇచ్చారు. అలా చేసిన వంటలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేదాన్ని. ఆర్డర్‌లు వరుసగా రావడం ప్రారంభించాయి. ఈ రోజు సోషల్‌మీడియాలో హైదరాబాద్ ఫుడ్ సూపర్ హిట్‌గా పేరొందింది. దీంతో ఒక గృహిణిగా ఉన్న నేను ఉద్యోగినిగా మారిపోయాను'' అని ఆనందంగా చెబుతుంది అంజుమ్.

గృహిణి నుంచి ఒక మహిళ గృహ నిర్వాహకురాలిగా మారింది. ఈ హైటెక్ ప్రపంచంలో గృహిణి తనకంటూ కొత్త బిరుదును సంపాదించుకుంటుంది. ఇప్పుడు తనను తాను పని చేసే గృహిణి అని పిలవడానికి ఇష్టపడుతుంది. ఇంట్లో ఉంటూ డబ్బు సంపాదిస్తూ, బాధ్యతలను నెరవేర్చడంలో తనదైన ప్రత్యేక శైలిని కలిగి ఉంది. మారుతున్న కాలంలో ఈ తరహా ఆలోచన గృహిణితో పాటు ఇంట్లో అందరికీ నచ్చుతోంది.

చేతి కళకు ఆదరణ

నేటి యాంత్రిక యుగంలో చేతితో తయారు చేసిన వస్తువులు దొరకడం కష్టం. నాణ్యమైన సంప్రదాయ పనితనం కోసం అన్ని వైపుల నుండి డిమాండ్ వస్తోంది. ప్రావీణ్యం కలిగిన మహిళలు తమ నైపుణ్యాలను ఉపయోగించుకుంటున్నారు. అదే సమయంలో చాలా మంది గృహిణులు తమ జ్ఞానం ఆధారంగా హోమ్ ట్యూషన్, బ్యూటీ పార్లర్ వంటి సేవలను కూడా అందిస్తున్నారు.

జర్నల్ ఆఫ్ కల్చరల్ ఎకానమీలో ప్రచురించిన ఒక అధ్యయనం సోషల్ మీడియాలో లైక్‌లు, షేర్లు గృహిణిని 'అందం'గా మార్చేశాయి అని నిర్వచించింది. సంప్రదాయ గృహిణులు ఇప్పుడు స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో ఆకర్షణీయంగా మాత్రమే కాకుండా వ్యాపారవేత్తలుగా కూడా మారారు. ఈ చిన్న ఆరంభం మహిళను ఉద్యోగ గృహిణిని చేసింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 2020-21లో దేశంలో కేవలం 32 శాతం వివాహిత మహిళలు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. వివాహిత మహిళల్లో 68 శాతం మంది గృహిణులుగా ఉన్నారు. మారిన కాలంలో ఇప్పుడు గృహిణిగా ఇంట్లో ఉంటూనే ఆర్థిక స్వావలంబన సాధిస్తోంది. ఇది 'ఆమె' నైపుణ్యాన్ని మరింతగా పెంచుతుంది. భారతదేశంలో చాలా మహిళలు నైపుణ్యం ఉన్నవారే. కొందరు కుట్లు-ఎంబ్రాయిడరీ చేయడంలో, కొందరు వంటలలో, మరికొందరు పెయింటింగ్‌లో నిష్ణాతులు. పనిచేసే గృహిణికి ఆమె ప్రతిభే ఆదాయ వనరుగా మారుతోంది.



నాజ్ అంజుమ్



గృహిణి నిర్వచనంలోనే మార్పు..

కరోనా లాక్‌డౌన్ కారణంగా సోషల్ మీడియా గృహిణులకు డబ్బు సంపాదించే శక్తిని ఇచ్చింది. ఇప్పుడు అదే రోజువారీ దినచర్యగా మారిపోయింది. యుఎస్ జనరల్ సోషల్ సర్వే 1972 నుండి 2020 వరకు ఒక సర్వే నిర్వహించింది. ఇందులో శ్రామిక మహిళలు, పని చేసే గృహిణులు ఎంతో సంతోషంగా ఉన్నారని భావించారు. వీళ్లలో ఎక్కువ మంది మధ్య, ఉన్నత తరగతికి చెందిన 40 ఏళ్ల పైబడిన వారు. ఉద్యోగరీత్యా గృహిణిగా ఉన్నా ఇంటి నిర్వహణ, సంపాదనతో పాటు భవిష్యత్తు కోసం పొదుపు చేస్తున్నామనే విషయాలను ఈ సర్వే వెల్లడి చేసింది.

బ్యూటిప్స్

ట్యాన్‌కు చెక్

రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, టీస్పూను రోజ్ వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. చక్కగా ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేసుకోవడం వల్ల ముఖం మీద పేరుకుపోయిన ట్యాన్ తగ్గుముఖం పడుతుంది. రోజ్ వాటర్ ముఖానికి సహజసిద్ధ నిగారింపుని ఇస్తే, తేనె చర్మానికి తేమనందిస్తుంది.



ఇంగువతో నిగారింపు

రెండు స్పూన్ల ముల్తానీ మట్టిలో స్పూను తేనె, చిటికెడు ఇంగువ, స్పూను రోజ్‌వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి ఇరవై నిమిషాలపాటు ఆరబెట్టాలి. తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారంలో రెండుసార్లు వేయడం వల్ల మొటిమలు, నల్ల మచ్చలు, ముడతలు పోతాయి. చర్మం పొడిబారడం తగ్గి ముఖం కాంతిమంతమవుతుంది.

కిచెన్ టిప్స్

- స్టీల్ పాత్రలు వెలిసిపోయి పాతపడినట్లుగా అనిపిస్తే... అయిపోయిన టూత్ పేస్టు ట్యూబ్‌ని ముక్కలుగా కత్తిరించి, లోపల ఉన్న కొద్దిపాటి పేస్టుని స్టీల్ పాత్రకు రాసి టూత్ బ్రష్‌తో రుద్దాలి. రెండు చుక్కలు నీళ్లు వేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా తళతళా మెరుస్తాయి. వెండిసామాన్లు కూడా టూత్ బ్రష్‌తో రుద్దితే మురికి అంతా పోయి కొత్తవాటిలా కనిపిస్తాయి.



- డ్రెస్సింగ్ టేబుల్ మిర్రర్, చిన్న అద్దాలు మురికి పట్టి సరిగా కనిపించకపోతే కొద్దిగా టూత్‌పేస్టు వేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే దుమ్మూధూళి, మరకలు పోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.



- మిరియాలు, ఉల్లిపాయ, వెల్లుల్లిపాయలను సమపాళల్లో తీసుకుని కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరువాత ఈ మిశ్రమాన్ని వడగట్టి స్ప్రే బాటిల్‌లో వేయాలి. ఈ మిశ్రమాన్ని బల్లులున్న ప్రాంతంలో స్ప్రే చేస్తే ఘాటు వాసనకు బల్లులు పారిపోతాయి.

నిత్యజ్ఞాన స్వరూపమైన ఆత్మకు పుట్టుక లేదు, గిట్టుటా లేదు. ఇది మరేదో ఒక దాన్నుండి రూపొందింది కాదు, దీన్నుండి మరేదైనా రూపొందడమూ లేదు. ఇది నిత్యము, శాశ్వతము. శరీరం నాశనమైనా దీనికి నాశనం లేదు.
– కేనోపనిషత్తు

సాక్షి
శనివారం, 20 జనవరి 2024

పరిణతితో ప్రవర్తించాలి

ప్రపంచంలో ఉన్న ఘర్షణలు చాల్లేదన్నట్టు కొత్త తగువులు పుట్టుకొస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇస్లామిక్ రాజ్యాలైన ఇరాన్, పాకిస్తాన్‌లు ఉగ్రవాదాన్ని అణిచే పేరిట పరస్పరం క్షిపణులతో, డ్రోన్‌లతో దాడులు జరుపుకోవటం తాజా పరిణామమైతే ఇంతవరకూ ఇరుపక్షాలకూ సర్దిచెప్పటానికి ఎవరూ ప్రయత్నిస్తున్నట్టు లేదు. పాక్ గగనతలాన్ని అతిక్రమించిన ఇరాన్ విమానాలు సున్నీ మిలిటెంట్ సంస్థ జైష్ అల్ అదల్ స్థావరాలపై దాడులు చేయగా పాకిస్తాన్ సైతం ఇదే వంకతో ఇరాన్ భూభాగంపై బాంబులు కురిపించింది. ఇరాక్, సిరియాలపైనా ఇరాన్ దాడులు చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం మొదలై రెండేళ్లు దాటుతుండగా, మూడు నెలల క్రితం గాజాలో ఇజ్రాయెల్ మొదలెట్టిన దాడులు విరామం లేకుండా సాగుతూనేవున్నాయి. దాదాపు 24,000 మంది పాలస్తీనా పౌరుల ప్రాణాలు బలయ్యాయి. అటు ఎర్ర సముద్రంలో హౌతీలపై అమెరికా, బ్రిటన్‌లు చేస్తున్న దాడులు ఫలిస్తున్న సూచనలు కనబడటం లేదు. ఇండో–పసిఫిక్ ప్రాంతం రానున్న కాలంలో పెను సవాలు కాబోతున్నదని అగ్రరాజ్యాలు అంచనా వేసుకుని పది హేనేళ్లుగా పథక రచన చేస్తుండగా తాజా పరిణామాలు ఆ అంచనాలను తలకిందులు చేశాయి.

దేశాల మధ్య ఉన్న విభేదాలు దీర్ఘకాలం అపరిష్కృతంగా ఉండిపోతే అవి ఏదో ఒక దశలో కొత్త బలాన్ని సంతరించుకుని మరింత సంక్లిష్టంగా మారుతాయి. ఇప్పుడు ఘర్షణలు తలెత్తిన ప్రాంతాలు, ఇప్పటికే ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ప్రాంతాలు గమనిస్తే ఈ సమస్యలు కొత్తగా తలెత్తినవి కాదని అర్థమవుతుంది. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం చోటుచేసుకుని అప్పటి పాలకుడు ఇరాన్ షా పదవీచ్యుతుడయ్యేవరకూ ఇరాన్, పాకిస్తాన్ రెండూ అమెరికాకు గట్టి మిత్ర దేశాలు. మనతో 1965లోనూ, ఆ తర్వాత 1971లోనూ పాకిస్తాన్ తలపడినప్పుడు ఆ దేశాన్ని అన్నివిధాలా ఆదుకున్న చరిత్ర ఇరాన్‌ది. పాకిస్తాన్ విచ్ఛిన్నాన్ని సహించబోనని ఇరాన్ షా పరోక్షంగా మన దేశాన్ని హెచ్చరించాడు. అలాగని ఇరాన్–పాకిస్తాన్ సరిహద్దులు ఎప్పుడూ ప్రశాంతంగా లేవు. అక్కడ స్థావరాలు ఏర్పర్చుకుని ఆ రెండింటినీ చికాకు పెడుతున్న బలూచిస్తాన్ మిలిటెంట్లకు కొదవ లేదు. కానీ ఇరాన్‌లో ఆయతుల్లా ఖొమైనీ ఏలుబడి తర్వాత అక్కడ షియాల ఇస్లామిక్ రాజ్యం ఏర్పడ్డాకే ఆ దేశానికి సున్నీ మెజారిటీ పాకిస్తాన్‌తో సమస్యలు బయల్దేరాయి. అటు పాకిస్తాన్ ఆర్థికంగా దివాలా తీసిన స్థితిలో వుండగా, ఇటు ఇరాన్ అమెరికా విధించిన ఆంక్షలతో ఊపిరాడకుండా వుంది. ఇలాంటి గడ్డు స్థితిలో అక్కడ తక్షణం యుద్ధం తలెత్తే ప్రమాదం వుండకపోవచ్చు. అలాగని ఆ రెండు దేశాలూ ఒక అంగీకారానికి రాకపోతే ఏమైనా జరగొచ్చు. వాస్తవానికి ఇజ్రాయెల్ అస్తిత్వానికి ఏ బెడదా లేకుండా చేయటానికీ, పశ్చిమాసియాలో తన పట్టు జారకుండా చూసుకొనేందుకూ అమెరికా చేయని ప్రయత్నమంటూ లేదు. పాలస్తీనా విషయంలో 1973 వరకూ ఏకతాటిపై ఉన్న అరబ్ దేశాలూ, ఇతర ముస్లిం దేశాలూ ఆ తర్వాత కాలంలో పరస్పరం విభేదించుకోవటంలో అమెరికా పాత్ర తక్కువేమీ కాదు. 1979లో ఇజ్రాయెల్–ఈజిప్టు మధ్య సయోధ్య కుదిర్చిన మాదిరిగానే 1994లో జోర్డాన్‌తో, ఈమధ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, మొరాకోలతో ఇజ్రాయెల్‌కు సఖ్యతను ఏర్పర్చింది కూడా అమెరికాయే. మరోపక్క సిరియాలో బషర్ అల్ అసద్‌తో, యెమెన్‌లో హౌతీలతో, గాజాలో హమాస్, ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఫ్రంట్‌లతో, లెబనాన్‌లో హిజ్‌బొల్లాతో జట్టుకట్టి అమెరికా అనుకూల ఫ్రంట్‌కు ప్రత్యామ్నాయాన్ని రూపొందించటంలో ఇరాన్ చాన్నాళ్లుగా బిజీగా వుంది. ఇజ్రాయెల్‌కు దగ్గరైన దేశాల్లో చాలా భాగం సున్నీ ఆధిపత్యంలోనూ, ఇరాన్ కూడగడుతున్న దేశాలు షియా ప్రాబల్యంలోనూ ఉండటం యాదృచ్ఛికం కాదు. ఈమధ్యలో చైనా ఏడెనిమిదేళ్లుగా జరుపుతున్న మధ్యవర్తిత్వం ఫలించి నిరుడు మార్చిలో ఇరాన్–సౌదీ మధ్య చర్చలు మొదలయ్యాయి.

ఏదీ కారణం లేకుండా మొదలు కాదు. విస్తరించదు. బలూచిస్తాన్‌లో ముస్లిం మైనారిటీల సమస్యలను పరిష్కరించటంలో ఇరాన్, పాకిస్తాన్ రెండూ వైఫల్యం చెందటం వల్లే ఆ ప్రాంతం చాన్నాళ్లుగా భగ్గుమంటోంది. బలూచిస్తాన్‌లో అటు షియాలూ, ఇటు సున్నీలూ ఉన్నా జాతి, తెగల పరంగా ఆ వర్గాలమధ్య ఎన్నో వ్యత్యాసాలున్నా ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలూ, భాష వగైరాల్లో అక్కడి ప్రజల తీరుతెన్నులే వేరు. తాము అటు ఇరాన్‌కూ, ఇటు పాకిస్తాన్‌కూ చెందబోమని, తమది ప్రత్యేక విధానమని వారి వాదన. స్వతంత్ర సిస్తాన్–బలూచిస్తాన్ ఏర్పాటులోనే తమ భవిష్యత్తు ముడిపడివున్నదని అక్కడి పౌరులు భావిస్తుంటారు. ఈ మైనారిటీల మనోభావాలను సకాలంలో గుర్తించి, సరిచేసేందుకు ప్రయత్నించివుంటే మిలిటెంట్ సంస్థల ప్రభావం అక్కడ వుండేది కాదు. కానీ అటు ఇరాన్, ఇటు పాకిస్తాన్ అణిచివేతనే నమ్ముకున్నాయి. పైగా మీ మెతకదనంవల్లే సమస్య ముదిరిందని పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. తాజా ఇరాన్ దాడుల వెనక పశ్చిమాసియా ఘర్షణలను విస్తరించాలన్న ఆలోచనలున్నాయని కొందరు విశ్లేషకులు అనుమానిస్తున్నారు. కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలు ఇప్పటికే ప్రపంచాన్ని పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోయేలా చేశాయి. రష్యానూ, ఇజ్రాయెల్‌నూ అదుపు చేసేందుకు ప్రయత్నించాల్సిన తరుణంలో మరో సంక్షోభాన్ని పెంచటం క్షమార్హం కానిది. కనుకనే పాకిస్తాన్, ఇరాన్ రెండూ సంయమనం పాటించి చర్చలకు సిద్ధపడాలి. ఆ ప్రాంత మైనారిటీల మనోభావాలేమిటో తెలుసుకుని పరిణతితో ఆలోచిస్తే శాశ్వత పరిష్కారం అసాధ్యం కాదని గుర్తించాలి.

అయోధ్యతో కుదరాలి సయోధ్య

సందర్భం



పి. వేణుగోపాల్ రెడ్డి

జనవరి 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నది. ఏ విధంగా చూసినా ఇదొక చరిత్రాత్మక ఘట్టమే. ఇది హిందువుల ఐదు వందల ఏళ్ల ధార్మిక, రాజకీయ, న్యాయ పోరాటాల ఫలితం. ఈ వాస్తవాన్ని నిరాకరించడం విజ్ఞత కాదు. కొన్ని పీఠాల ఆచార్యులు, రాజకీయ పార్టీలు, ముహూర్తం గురించి, బీజేపీ ప్రమేయం గురించి లేవనెత్తుతున్న వివాదాలు ఇప్పుడు ప్రతిష్ఠను ఆపలేవు. అసలు కొత్త వివాదాలు లేవదీయడమే అసంగతం. శ్రీరామచంద్రుడిని హిందువులు మర్యాద పురుషోత్తమునిగా కొలుస్తారు. ఆ విశ్వాసాన్ని మిగిలిన మతస్థులు గౌరవించడం మర్యాద. ఆత్మ గౌరవానికి సంబంధించిన భావన ఇందులో బలమైనది, ప్రధానమైనది. భారతదేశ వైవిధ్యం పరిఢవిల్లాలంటే అన్ని మతాల మధ్య సయోధ్య నెలకొనాలి.

రామాలయ నిర్మాణం అంటే ఇటుకలు, సిమెంట్, ఒక నిర్మాణం అనుకోవద్దని లాల్ కృష్ణ అద్వానీ రథయాత్ర సమయం నుంచి సంఘ పరివార్ చెబుతూనే ఉన్నది. విదేశీ పాలనలతో మిగిలిపోయిన మానసిక బానిసత్వ జాడలు తొలగించుకోవాలన్న తాత్త్వికత కలిగిన రాజకీయ పక్షం, దాని నాయకత్వంలోని ప్రభుత్వం హయాంలో అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నది. బాబ్రీ కమిటీ తరఫున కోర్టులో పోరాడిన అన్సారీ సహా, పలువురు ముస్లింలు అయోధ్య ఆలయ నిర్మాణ స్ఫూర్తిని సరిగానే గ్రహించారు. పలువురు సిక్కులు కూడా. మన మంతా ఈ దేశ వారసులం, ఈ భూమిపుత్రులం అన్న ఏకసూత్రాన్ని ప్రాణప్రతిష్ఠ వారిలో ప్రతిష్ఠించింది.

ఆలయ నిర్మాణం పూర్తయింది కాబట్టి గతాన్ని మరచి అంతా సమైక్యంగా ఉండాలంటూ కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిస్వామి వంటి వారు పిలుపునివ్వడం శుభసూచకమే. అలాగే ప్రఖ్యాత పురావస్తు శాస్త్రవేత్త కె.కె.మహమ్మద్ కొద్దిరోజుల క్రితమే కాశీ, మధుర కూడా హిందువులకు అప్పగించడం సరైన చర్య అవుతుందని ఒక ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడమూ అసంగతం కాబోదు. డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి వంటి వారు ఇస్తున్న గణాంకాల ప్రకారం విదేశీయుల దండయాత్రలతో, మతోన్మాదంతో, పాలనలో ముప్పయ్ నుంచి నలభయ్ వేల హిందూ దేవాలయాలు నేలమట్టమైనాయి. హిందూ సమాజం వాటి గురించి పట్టుపట్టడం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డా.మోహన్ భాగవత్ కూడా ప్రతి మసీదులోనూ శివలింగాలను వెతికే పని చేయవద్దని నిర్మాణాత్మకమైన సూచన చేశారు. అయినా చరిత్రకారులుగా, ఉదారవాదులుగా చలామణి అవుతున్న కొందరి వైఖరి హిందువులే తగ్గి ఉండాలన్నట్టుగా ఉంది. భారతదేశ వైవిధ్యం పరిఢవిల్లాలంటే అన్ని మతాల వారి మధ్య సయోధ్య నెలకొనాలి. సెక్యులరిజం అంటే మెజారిటీ మతస్థుల మనోభావాలకు మన్నన లేకపోవడం, మైనారిటీల బుజ్జగింపు కాదన్న దృష్టి అవసరం. ఒక ఆర్థిక శక్తిగా అవతరిస్తున్న భారత్ మత ఉద్రిక్తతలతో తన ప్రగతివేగాన్ని తనే తగ్గించుకోవడం ఆగిపోవాలి. దానికి రామమందిర ప్రాణ ప్రతిష్ఠతో శ్రీకారం చుట్టాలి.

బాబ్రీ మసీదు రగడలో ముస్లింల వైపు నుంచి మతోన్మాద దృక్కోణాన్ని చూడక్కరలేదు. మొదటి నుంచి బుజ్జగింపు రాజకీయాలనే నమ్ముకున్న పార్టీలు, కుహనా సెక్యులరిస్టు చరిత్రకారుల వల్ల ఇది రావణకాష్ఠం అయింది. ఈ మాట సంఘపరివార్ అన్నది కాదు. పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ కె.కె. మహమ్మద్ అన్నదే. అయోధ్య గురించి పదే పదే మాట్లాడి సమస్యను జటిలం చేసిన కొందరు చరిత్రకారులను సాక్షాత్తు సుప్రీంకోర్టు 2019 నాటి తన తీర్పులో అభిశంసించిన సంగతిని మరచిపోవద్దు. నిజానికి మసీదులను తరలించడం,



ముస్లిమేతరులు కూల్చడం, స్వయంగా ముస్లిములే తొలగించడం వంటి ఘట్టాలు బాబ్రీ కూలిన 1992 డిసెంబర్ 6కు ముందు ఉన్నాయి, తరువాత కూడా జరిగాయి. కొన్ని ఉదాహరణలు చూడాలి.

మొదటిగా చెప్పుకోవలసినది సౌదీ అరేబియాలో ప్రవక్త మహమ్మద్ జీవితంతో సంబంధం ఉన్న మసీదులు, ప్రాంతాలను కూడా వారు అవసరం మేరకు తొలగించారు. ప్రవక్త మసీదు అందులో ఒకటి. ఇది ప్రవక్త కట్టించిన పెద్ద మసీదులలో రెండవదని ముస్లిం సమాజం నమ్ముతుంది. ఈ పనిని అక్కడి ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా చేసింది. కానీ బాబ్రీ అయోధ్య విషయంలో ఇంత అవాంఛనీయ వాతావరణం ఎందుకు ఏర్పడింది? దాని వెనుక ఉన్న శక్తులు ఏమిటనేది పరిశీలిస్తే అర్థమవుతుంది. అయోధ్య రగడకు కేంద్రబిందువు జహీరుద్దీన్ మహమ్మద్ బాబర్‌కు మరణానంతరం జరిగిన గౌరవం ఏమిటో తెలియాలంటే, ఆయన సమాధికి పట్టిన గతి ఏమిటో తెలియాలి. 1530లో చనిపోవడానికి ముందే తన అంత్యక్రియలు అఫ్ఘానిస్తాన్‌లో జరగాలని వారసులను కోరాడు బాబర్. కానీ వారు ఆగ్రాలోనే నిర్వహించారు. బాబర్ కొడుకు హుమాయున్‌ను తరిమేసి అధికారంలోకి వచ్చిన షేర్‌షా సూర్ 1539 ప్రాంతంలో బాబర్ కోరికను నెరవేరుస్తున్న తీరులో ఆ అవశేషాలను కాబూల్ నగర శివార్లకు చేర్చాడు. అక్కడే సమాధి ఏర్పడింది. దానిని షాజహాన్, జహంగీర్ తరువాత పెద్ద గార్డెన్‌గా అభివృద్ధి చేశారు. అఫ్ఘాన్ రాజు నాదిర్‌షా ఈ గార్డెన్‌ను (11 హెక్టార్లు) ఒక విహార యాత్రా స్థలంగా మార్చాడు. సమాధి రూపు మార్చాడు. అక్కడంతా యూరోపా శైలిలో భవనాలు కట్టి, హోటళ్లు, వినోదకేంద్రాలు ఏర్పాటు చేశాడు.

పోలెండ్ చరిత్రంతా రష్యా జార్ చక్రవర్తులతో, 'ఎర్ర జార్'లతో పోరాటమే. 1920లో రాచరిక జార్‌ల ఆధిపత్యం పోయిన తరవాత రాజధాని వార్సాలోని అలెగ్జాండర్ నెవ్‌స్కీ కెథడ్రల్‌ను పోలెండ్ ప్రభుత్వమే కూల్చింది. 1894లో నిర్మాణం మొదలుపెట్టి 1912లో పూర్తి చేశారు. 70 మీటర్ల ఎత్తయిన ఈ నిర్మాణం లియోన్ బెనొయిస్ అనే నాటి ప్రఖ్యాత వాస్తుశిల్పి ఆధ్వర్యంలో గొప్ప కళాత్మకంగా జరిగింది. అయినా నిర్మాణం పూర్తయిన పదేళ్లకే కూల్చారు. కారణం ఒక్కటే. పోలెండ్ ప్రజల జాతీయభావాలను అవమానించడానికి జార్ చక్రవర్తి ఈ చర్చ్‌ను నిర్మించాడని స్వతంత్ర పోలెండ్ భావించడమే. రెండు దేశాలవారు క్రైస్తవులే. తమ ప్రార్థనాలయాలే అయినా అందులో జార్ చక్రవర్తి అణచివేత జాడలను చూశారు.

ఇక చైనాలో వీగర్ ముస్లింలు, వారి అస్తిత్వం ప్రశ్నార్థకమైన సత్యాన్ని వీగర్ హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్ నివేదిక వివరాలు కాస్త పరిశీలించినా అర్థమవుతుంది. కేరియా ఈద్‌కాహ్ మసీదు 1200 సంవత్సరం ప్రాంతంలో నిర్మించినది. ఈ మసీదు రూపాన్ని వికృతం చేసి, పగోడాలా తయారు చేశారు. 1540 నాటి కార్గిలిక్ మసీదును పూర్తిగా ధ్వంసం చేశారు. 2016లో 100 మసీదులను నేలమట్టం చేయడం లేదా, రూపురేఖలను మార్చడం జరిగింది. అంటే మసీదును సంకేతించే గుమ్మటాలు, మీనార్లు తొలగించారు. అయోధ్య మసీదు విషయంలో రగడ చేసిన వామపక్షాల వారు, వారి అనుంగు చరిత్రకారులు వీగర్ ముస్లింల మీద కాస్తయినా సానుభూతి ప్రకటించరేమి? ఇంచుమించు కాన్‌సెంట్రేషన్ క్యాంపులలోనే బతుకుతున్న వీగర్ ముస్లింల గురించి పాకిస్తాన్, టర్కీ పెదవి విప్పవేమి?

ఇవి కొన్ని ఉదాహరణలు. ఇక్కడ రెండు విషయాలు గమనార్హం. ఈ విధ్వంసంలో ఎక్కడా హిందువులకు సంబంధం లేకపోవడం. బాబ్రీ విషయంలో మాత్రమే ఇంత రగడ జరగడం. అయోధ్య ఉద్యమం తీవ్రరూపం దాల్చి, అత్యధికంగా హిందువులు రామాలయం కోరుకున్నా కూడా మూడు దశాబ్దాలు వేచి చూడడం, వేచి ఉండేటట్టు చేయడం ఎందుకు? నమాజ్ జరగని ఒక మసీదు కోసం ఇంత రగడను ఎందుకు కొనసాగించినట్టు? ఇంతకీ, అయోధ్యలో కడుతున్న కొత్త మసీదు పేరు బాబ్రీ మసీదు కాదు. మరి దేని కోసం జరిగింది ఈ అడ్డగింత? చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుందాం. వాస్తవాలు గ్రహిద్దాం. అందులో మొదటిది, హిందువుల పరమత సహనం గురించి. అయోధ్య ఉద్యమ సమయంలో, ఆ నగరంలో లేదా భారతదేశంలో కావాలని ఏ మసీదునైనా కూల్చిన దాఖలాలు ఉన్నాయా? ఆరోపణలు ఉన్నాయా? మెజారిటీ ప్రజల మనోభావాలను అవమానించే తీరులో మైనారిటీలు వ్యవహరించడం సయోధ్యకు ఉపయోగపడేది కాదు. మెజారిటీ ప్రజలలో మెజారిటీ మనస్తత్వం సరికాదని చెబుతున్నవారు మైనారిటీల కొన్ని చర్యలలోని అసంబద్ధతను కూడా ఎత్తి చూపే బాధ్యతను స్వీకరించాలి.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చికిత్స అందేలా...



ప్రపంచవ్యాప్తంగా సాధారణ క్యాన్సర్లలో బ్రెస్ట్ క్యాన్సర్ ఒకటి. దీనివల్ల ఇండియాలో అత్యధికంగా మరణిస్తున్నారు. దీనికి అందుబాటులో లేని చికిత్స ఒక కారణం. గతంలో కొన్ని ఔషధాలకు తగ్గించినట్టుగానే, బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధాల మీద ఉన్న జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నా.

– డింపుల్ యాదవ్, సమాజ్‌వాదీ ఎంపీ

దౌత్య విజయం



ఇరాన్, గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్, రష్యా, అఫ్ఘానిస్తాన్‌తో మంచి సంబంధాలు నెరుపుతూనే, 'క్వాడ్', 'బ్రిక్స్'లో కూడా ఇండియా సభ్య దేశంగా ఉంది. ఇది మంచి విషయం.దౌత్యపు లక్ష్యం స్నేహితులను పెంచు కోవడమేగానీ, అర్థరహితంగా వ్యూహాత్మక శత్రువులను పెంచుకోవడం కాదు.

– ముర్తజా హుస్సేన్, జర్నలిస్ట్

సరిపోయాయి!



ఇరాన్, పాకిస్తాన్ పరస్పర దాడుల్లో గమనించాల్సింది, వస్తున్న క్షిపణులను కనిపెట్టడంలో ఇరు దేశాల వాయు రక్షణ వ్యవస్థలు విఫలమయ్యాయి. పైగా, దాడుల వెంటనే సౌభ్రాతృత్వ సంబంధాల గురించి రెండు దేశాలూ మాట్లాడటం ఆశ్చర్యకరం.

– తిలక్ దేవేశర్, రచయిత

అడగాల్సిన ప్రశ్న



జనవరి 22 నాటి ఆలయ వేడుక ఎలా జాతీయ ఉత్సవమో మనం ఇంకా అడగాల్సే ఉంది. దానిలో రాజ్యం భాగస్వామి కావడాన్ని మనం వ్యతిరేకించాలి. రహస్యంగా ఇండియాను హిందూ రాష్ట్రంగా మార్చడాన్ని మనం అంగీకరించకూడదు.

– అపూర్వానంద్, హిందీ ప్రొఫెసర్

సుడి లేనప్పుడు...



వృత్తి పరంగా అన్నీ బాగా సాగుతున్నప్పుడు, వ్యక్తిగత జీవితం గందరగోళంగా ఉంటుందని కొందరు చెబుతుంటారు. అబద్ధాలు! రెండు చోట్లా గందరగోళంగా ఉండటం కూడా సాధ్యమే.

– శ్రేయా ధన్వంతరి, నటి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

కార్మికవర్గ విప్లవ యోధుడు

కామ్రేడ్ లెనిన్ మరణించి ఈ జనవరి 21 నాటికి వందేళ్ళు పూర్తి అవుతున్నది. ఈ సందర్భంగా లెనిన్ జీవిత విశేషాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో వుంది. లెనిన్ అసలుపేరు వ్లాదిమిర్ ఇల్యిచ్ ఉల్యానోవ్. 1870 ఏప్రిల్ 22న రష్యాలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఒక పాఠశాల అధికారిగా పనిచేశారు. లెనిన్ సోదరుడు జార్ చక్రవర్తిపై హత్యాయత్నం చేశాడన్న నేరంమోపి ఆయనకు 1887లోనే ఉరిశిక్ష విధించారు. లెనిన్ తండ్రిని ఉద్యోగం నుండి విరమించుకోవాలని ఆనాటి జార్ ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేశారు. ఈ రెండు సంఘటనలు 17 ఏళ్ళ యువకుడైన లెనిన్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపి ఆ వయస్సులోనే జార్ ప్రభుత్వంపై వ్యతిరేక భావనలు ఏర్పడేటట్లు చేశాయి. న్యాయ శాస్త్రం చదివే కాలంలోనూ జార్ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. లెనిన్ ఈ కాలంలోనే కారల్ మార్క్స్ రచనలతో ప్రభావితులై 1889లో మార్క్సిస్టు అయ్యారు. 1890–91 కాలంలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో లా ప్రాక్టీసు చేశారు. మార్క్సిస్టు కార్యకలాపాలలో పాల్గొంటున్నారని ఆరోపిస్తూ జార్ ప్రభుత్వం ఆయన్ను 1897లో అరెస్టు చేసి సైబీరియాకు పంపింది. అక్కడ ప్రవాస జీవితం గడుపుతూ 1898 జూలై 22న నాదెజ్దా క్రూపస్కయాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత జర్మనీకీ, స్విట్జర్లాండ్‌కూ వెళ్ళి ఇతర యూరోపియన్ దేశాల మార్క్సిస్టులను కలిశారు. ఈ కాలంలోనే ఆయన 'లెనిన్' అనే పేరును పెట్టుకున్నారు.



కా॥ లెనిన్

మొదట్లో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ తర్వాత బోల్షివిక్ గ్రూపునకు వ్యవస్థాపక నాయకుడయ్యారు. ఆ తర్వాత లెనిన్ అందించిన నాయకత్వం వల్ల, అవలంబించిన విప్లవ ఎత్తుగడల వల్ల 1917లో జార్ చక్రవర్తి ప్రభుత్వం కూలిపోయింది. తర్వాత ఆవిర్భవించిన సోవియట్ యూనియన్ సోషలిస్టు రిపబ్లిక్‌కు చైర్మన్‌గా 1922లో ఎన్నికై 1924 జనవరి 21న తుదిశ్వాస విడిచే వరకు కొనసాగారు. అప్పటికి ఆయన వయస్సు 53 సంవత్సరాలు మాత్రమే. 1917లో రష్యాలో కా॥ లెనిన్ నాయకత్వాన విజయం సాధించిన అక్టోబర్ విప్లవం ప్రపంచంలోని అన్నిదేశాల వలస పాలకులపై ఆ యా దేశాల ప్రజలు తిరుగుబాటు చేసేవిధంగా స్ఫూర్తిని కలిగించింది. రష్యా విప్లవం తర్వాతనే ప్రపంచంలోని అన్నిదేశాల్లో ప్రజాస్వామ్య ఉద్యమాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, జాతుల విముక్తి పోరాటాలు వెల్లువెత్తాయి.

కా॥ లెనిన్ తాత్విక భూమికకు ఆయన రచనలు సాక్ష్యాలు. ముఖ్యంగా 'రాజ్యం – విప్లవం', 'కమ్యూనిజం – ఒక బాలారిష్టం', 'ఒక అడుగు ముందుకు–రెండు అడుగులు వెనక్కి', 'సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' లాంటి ఆయన రచనలు విప్లవకారులందరికీ మార్గదర్శకంగా ఉన్నాయి. లెనిన్ రష్యా విప్లవంలోనే గాక, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో నాయకత్వ పాత్ర వహించారు. వలస, అర్ధ వలస దేశాల విప్లవాలకు మార్గదర్శక సూత్రాలను రూపొందించారు. ఈ విధంగా పీడిత ప్రజల విముక్తి కోసం తన సర్వస్వాన్నీ అర్పించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి విశేషమైన, చరిత్రాత్మకమైన సేవలందించి కా॥ లెనిన్ అజరామరుడయ్యారు. ఆ మహనీయునికి అరుణారుణ జోహార్లు.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)
(రేపు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా)

దేశానికే దిక్సూచిగా మారుతున్న ఏపీ

అభిప్రాయం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు నాంది పలికిన ఆంధ్రులు ప్రపంచంలోని అత్యంత ప్రాచీన జాతికి చెందిన వారు. ఆంధ్రుల ప్రస్తావన ఐతరేయ బ్రాహ్మణం, రామాయణ, మహాభారతం, విష్ణు సహస్రనామం (చాణూర ఆంధ్ర), బౌద్ధ, జైన గ్రంథాలు, అశోకుడి శిలా శాసనాల్లోనూ ఉంది. ప్రాచీన కాలంలో ఆంధ్రులతో పాటు ఇతిహాసాల్లో పేర్కొన్న జాతుల్లో చాలా అంతరించిపోయాయి.

ఇటువంటి ఘన చరిత్రగల ఆంధ్రులకు ప్రస్తుత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పూర్వ వైభవం కనిపిస్తోంది. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో రాష్ట్రం పయనిస్తూ, దేశాభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. మరో వైపు విస్తృత సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని పేదలకు జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తూ దేశానికే దిక్సూచిగా మారుతోంది. ఇవన్నీ వాస్తవాలు, గణాంకాలు, ప్రజల సంతృప్తి, రాష్ట్రానికి వస్తున్న అవార్డుల ఆధారంగా నిర్ధారించినవే. కోవిడ్ కారణంగా రెండేళ్ళ పాటు దేశం ఆర్థిక ఇబ్బందులకు లోనయి నప్పటికీ ఆంధ్రప్రదేశ్ మాత్రం జగన్ 55 నెలల పాలనలో అనేక రంగాల్లో రెండంకెల వృద్ధిలో దూసుకు పోతోంది. 2022–23లో దేశ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు సుమారు 8 శాతం ఉంటే ఆ ఏడాది ఏపీలో 11.43 శాతం వృద్ధి నమోదయ్యింది. జగన్ హయాంలో నాలుగేళ్ళ సగటు వృద్ధి 12.70గా నమోదయ్యింది. ఇది దేశంలోనే అత్యధిక వృద్ధి రేట్లలో ఒకటి. చంద్రబాబు నాయుడు పదవిని కోల్పోయే నాటికి రూ. 8.73 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జి.ఎస్.డి.పి.) విలువ జగన్ ప్రభుత్వ హయాంలో రూ. 13.17 లక్షల కోట్లకు పెరిగినట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగం 4.1 శాతానికి తగ్గి దేశంలో అతి తక్కువ నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా మారింది.

'ఆర్.బి.ఐ. హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్' తాజా నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ మైనింగ్ రంగంలో 38.41 శాతం, నిర్మాణ రంగంలో 26.75 శాతం, మత్స్య రంగంలో 25.92 శాతం, పారిశ్రామిక రంగంలో 25.58 శాతం, తయారీ రంగంలో 24.84 శాతం, ఆతిథ్య రంగంలో 22.70 శాతం, సర్వీస్ సెక్టార్‌లో 18.91 శాతం, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 14.50 శాతం వృద్ధి సాధించి దేశాభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ నివేదిక ప్రకారం 400 కోట్ల గుడ్ల ఉత్పత్తితో, 50 లక్షల టన్నుల చేపలు, రొయ్యల ఉత్పత్తులతో, హెక్టారుకు 3,846 కిలోల వరి దిగుబడితో, 8 లక్షల హెక్టార్ల పండ్ల తోటలతో, 1.76 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆయిల్‌పామ్, ప్రభుత్వ ఆస్పత్రులు, థియేటర్ల సంఖ్యలో కూడా ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రభుత్వాసు పత్రుల పడకల సంఖ్యలో రెండో స్థానంలో ఉంది. రాష్ట్రం 1.54 కోట్ల టన్నుల పాల ఉత్పత్తితో, 11.26 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తితో, 6.86 లక్షల హెక్టార్ల కూరగాయల పంటల విస్తీర్ణంతో మూడో స్థానంలో ఉంది. దేశ ఎగుమతుల్లో సుమారు 11 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతున్నాయి. ఏపీ నుంచి సుమారు రెండువేల రకాల ఉత్పత్తులు దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశ ఎగుమతుల లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ పాత్ర అతి కీలకమైందని కేంద్ర ప్రభుత్వమే కితాబు ఇచ్చింది. 2,400 మెగా వాట్ల థర్మల్ విద్యుదుత్పాదన, 4,899 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తితో ఆంధ్రప్రదేశ్ దక్షిణాదిలో అగ్రస్థానంలో ఉంది.



భారత ప్రభుత్వ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డి.బి.టి.) వెబ్‌సైట్ ప్రకారం కేంద్రం గత నాలుగున్నర సంవత్సరాలుగా రూ. 23.02 లక్షల కోట్లు దేశవ్యాప్తంగా లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదే కాలంలో రూ. 2.46 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దీన్ని బట్టి దేశవ్యాప్తంగా కేంద్రం చేసిన నగదు బదిలీ విలువలో పది శాతం పైనే ఏపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో బదిలీ చేసిందన్నమాట! ఇంతేకాక నాన్ డి.బి.టి. ద్వారా మరో లక్షా 50 వేల కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాలకు జగన్ ప్రభుత్వం వ్యయం చేసింది. మొత్తానికి బడ్జెట్ కేటాయింపుల్లో 55.71 శాతం నిధులు సామాజిక రంగానికి కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 31 లక్షల మంది మహిళలకు జగన్ ప్రభుత్వం ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసింది. దేశంలోని మరే రాష్ట్రం ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయలేదు. దేశంలో ధరల నియంత్రణలో కూడా జగన్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశంలో ప్రస్తుతం ఐదు శాతం ద్రవ్యోల్బణం నమోదు కాగా ఏపీలో 4.69 శాతమే నమోదయ్యింది.

ఆ యా రాష్ట్రాల పనితీరును మదింపు చేసే ప్రసిద్ధ స్కాచ్ సంస్థ 2020లో ఇచ్చిన 'స్టార్ స్టేట్' అవార్డుల్లో జగన్ ప్రభుత్వం మొదటి ర్యాంకు, 2021లో గవర్నెన్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. అలాగే 2023లో 'వైఎస్సార్ పెన్షన్ కానుక' పథకానికి ప్లాటినం అవార్డు, 'వైఎస్సార్ చేయూత' పథకానికి గోల్డ్ అవార్డు, నెట్‌వర్క్ నిర్వహణలో ఏపీ ట్రాన్స్‌కోకు గోల్డ్ అవార్డు, వైఎస్సార్ చేయూత పథకానికి సిల్వర్ అవార్డు లభించాయి. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం గత 55 నెలలుగా చేసిన సుమారు 75 వేల కోట్ల రూపాయల వ్యయం సత్ఫలితాలనిస్తోంది. నాలుగేళ్ళలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 84.48 శాతం నుంచి వంద శాతం పొందిన దేశంలోని ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావడంతో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఏటా ఇచ్చే ర్యాంకింగుల్లో మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ టాప్ ర్యాంక్ పొందింది. నీతి ఆయోగ్ ర్యాంకుల్లో వ్యాపారానికి అనువైన విధానాలు ఉన్న రాష్ట్రంగా దేశంలో 3వ స్థానం, హై స్కిల్డ్ ఎంప్లాయ్‌మెంట్ విభాగంలో నాల్గో స్థానం ఆంధ్రప్రదేశ్ పొందింది. 'కేర్ ఎడ్జ్' సంస్థ రేటింగ్స్ ప్రకారం గుడ్ గవర్నెన్స్ విభాగంలో 67 పాయింట్లతో ఏపీ దేశంలో అగ్రస్థానంలో నిలిచింది.

అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉండగా ప్రతిపక్షాలు, వారి మీడియా మాత్రం అసత్యాలు, అర్ధ సత్యాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే ప్రాచీన చరిత్రగల ఆంధ్రులు వివేక వంతులు కూడా. కుల మతాలకూ, ప్రాంతాలకూ అతీతంగా జగన్ ప్రభుత్వం అందిస్తున్న సుసంపన్న, సుపరిపాలనను వారు కొనసాగించుకుంటారు. ప్రతిపక్షాల అవకాశవాద పొత్తులు, ప్రతి కూల మీడియా అబద్ధాలను తిరస్కరిస్తారనంలో సందేహం లేదు.

వ్యాసకర్త ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ । 89859 41411

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శు.దశమి రా.10.07 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: కృత్తిక తె.5.38 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి రోహిణి, వర్జ్యం: సా.5.55 నుండి 7.27 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.35 నుండి 8.07 వరకు, అమృతఘడియలు: రా.3.28 నుండి 5.01 వరకు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 5.44.

సాక్షి బిజినెస్
శనివారం
20-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
496	160
71,683	21,622

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	15,159	▲ 104
డోజోన్స్	37,649	▲ 180
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,464	▲ 5
డాక్స్	16,549	▼ 21
షాంఘై	2,833	▼ 14
నికాయ్	35,963	▲ 497

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,390	▲ 420
బంగారం (99.5 స్వచ్ఛత)	62,140	▲ 418
వెండి (కేజీ)	71,228	▲ 330

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.75	83.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.46	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.54	56.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.85	55.78
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.21	62.67
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.49

మెప్పించని హెచ్‌యూఎల్

- లాభం, ఆదాయంలో కనిపించని వృద్ధి
- కొన్ని విభాగాల్లో ధరల తగ్గింపు ప్రభావం



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) డిసెంబర్ త్రైమాసికంలో ఫ్లాట్ పనితీరు చూపించింది. లాభం, ఆదాయంలో వృద్ధి కనిపించలేదు. రూ.2,508 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,481 కోట్లతో పోలిస్తే ఒక శాతమే పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.15,314 కోట్ల నుంచి రూ.15,259 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు స్వల్పంగా పెరిగి రూ.12,305 కోట్లకు చేరాయి. వ్యాపారంలో 75 శాతం వాటా కలిగిన హోమ్‌కేర్, బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ విభాగం అమ్మకాల పరిమాణంలో వృద్ధి కనిపించింది. స్థూల మార్జిన్ 4% మేర.. ప్రకటనలు, ప్రచారంపై పెట్టుబడులు 2.7% పెరిగాయి.

- రిన్, సర్ఫ్ ఎక్సెల్, విమ్, వీల్ తదితర ఉత్పత్తులతో కూడిన హోమ్‌కేర్ విభాగం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 1.26 శాతం తక్కువగా రూ.5,444 కోట్లకు పరిమితమైంది.
- బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ విభాగం ఆదాయం ఫ్లాట్‌గా రూ.5,782 కోట్లుగా నమోదైంది.
- ఫుడ్స్ అండ్ రీఫ్రెష్‌మెంట్ విభాగం ఆదాయం 1% పెరిగి రూ.3,733 కోట్లుగా ఉంది.

బీఎస్ఈలో హెచ్‌యూఎల్ షేరు ధర ఒక శాతం లాభంతో రూ.2,565 వద్ద స్థిరపడింది.

రిలయన్స్ లాభం 17,265 కోట్లు

- క్యూ3లో 9 శాతం వృద్ధి
- మెరుగుపడిన ఆపరేటింగ్ మార్జిన్
- జియో, రిటైల్ దూకుడు
- ఆయిల్, కెమికల్స్‌లో బలహీనత



"భారత్‌లో పూర్తి స్థాయి 5జీ సేవలను అత్యంత వేగంగా అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి పట్టణం, ప్రతి గ్రామం ఇప్పుడు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని కలిగి ఉంది. డిజిటల్ సదుపాయాలు, టెక్నాలజీ వృద్ధికి ఇది దోహదం చేస్తుంది. కొత్త బ్రాండ్లను జోడించుకోవడం ద్వారా కస్టమర్లకు మరింత మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడంపై రిలయన్స్ రిటైల్ దృష్టి కొనసాగిస్తుంది"
– ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ

న్యూఢిల్లీ: ఆయిల్ నుంచి రిటైల్ వరకు ఎన్నో వ్యాపారాలు నిర్వహిస్తున్న డైవర్సిఫైడ్ కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ డిసెంబర్ త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. రిటైల్, టెలికం వ్యాపారాలు రాణించగా, ఆయిల్ టు కెమికల్స్ (ఓటూసీ) నిరాశపరిచింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 9.3 శాతం పెరిగి రూ.17,265 కోట్లకు చేరుకుంది. షేరువారీ ఆర్జన రూ.25.52గా ఉంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 3.6 శాతం వృద్ధితో రూ.2.28 లక్షల కోట్లుగా నమోదైంది. కానీ, 2023 సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చి చూస్తే నికర లాభం 0.7 శాతం, ఆదాయం 3 శాతం చొప్పున తక్కువగా నమోదయ్యాయి. ఎబిటా (ఆపరేటింగ్ మార్జిన్) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 2.10 శాతం మేర, 2023 డిసెంబర్ త్రైమాసికంతో పోల్చితే 0.50 శాతం మేర పెరిగి 18 శాతానికి చేరింది. రుణాలపై వ్యయాలు 11 శాతం పెరిగి రూ.5,789 కోట్లుగా ఉన్నాయి. బ్యాలన్స్ షీటులో నగదు, నగదు సమానాలు రూ.1.92 లక్షల కోట్లుగా ఉన్నాయి. కన్సాలిడేటెడ్ రుణ భారం రూ.3.12 లక్షల కోట్లుగా, నికర రుణ భారం రూ.1,19,372 కోట్లుగా ఉంది.

రిటైల్ భేష్...

- రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్ఆర్‌వీఎల్) కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 40 శాతం పెరిగి రూ.3,165 కోట్లకు చేరింది.
- స్థూల ఆదాయం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 23 శాతం వృద్ధితో రూ.83,063 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో కంపెనీకి ఇదే అత్యధిక ఆదాయం.
- ఎబిటా 31% పెరిగి రూ.6,258 కోట్లు.
- గత త్రైమాసికంలో 252 స్టోర్లను కొత్తగా ప్రారంభించింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,774కు చేరింది.

జియో జూమ్...

టెలికం, డిజిటల్ వ్యాపారం రాణించింది. నికర లాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 12% పెరిగి రూ.5,445 కోట్ల గా ఉంది. ఆదాయం 11 శాతానికి పైగా వృద్ధితో రూ.32,510 కోట్లుగా నమోదైంది. జియో వరకే చూస్తే లాభం 12% పెరిగి రూ.5,208 కోట్లుగా ఉంది. ఆదాయం 10% వృద్ధితో రూ.25,368 కోట్లకు చేరింది. ఒక్కో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం రూ. 181.70కి చేరింది. ఏడాది క్రితం రూ. 178గా ఉంది. 2023 సెప్టెంబర్ క్వార్టర్‌తో పోలిస్తే ఫ్లాట్‌గా ఉంది. డిసెంబర్ నాటికి కస్టమర్ల సంఖ్య 470.09 మిలియన్లకు చేరింది. నికరంగా 11.2 మిలియన్ల కస్టమర్లు జతయ్యారు. 9 కోట్ల మంది 5జీ నెట్‌వర్క్‌కు మళ్లారు.

ఆయిల్, కెమికల్స్...

ఆయిల్ టు కెమికల్స్ విభాగంలోనే బలహీనత కనిపించింది. నిర్వహణ పనుల కోసం జామ్‌నగర్‌లోని రిఫైనరీ ప్లాంట్లను ఏడు వారాలు మూసివేయడం ప్రభావం చూపించింది. ఆయిల్ టు కెమికల్స్ ఆదాయం 2.4% తగ్గి రూ.1.41 లక్షల కోట్లుగా ఉంది. ఆయిల్ అండ్ గ్యాస్ ఆదాయం 50% వృద్ధితో రూ.6,719 కోట్లకు ఎగసింది.

రిలయన్స్ షేరు ఫ్లాట్‌గా రూ.2,736 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

హింద్ జింక్ లాభం 6% డౌన్



న్యూఢిల్లీ: జింక్, సిల్వర్ తయారీ సంస్థ హిందుస్థాన్ జింక్ డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.2,028 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,156 కోట్లతో పోల్చిచూసినప్పుడు 6% తగ్గింది. కానీ, 2023 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం లాభం రూ.1,729 కోట్లతో పోల్చి చూస్తే, 17 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం క్షీణించి రూ.7,606 కోట్లతకు పరిమితమైంది. వ్యయాలను రూ.5,028 కోట్ల నుంచి రూ.4,937 కోట్లకు కట్టడి చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు ఒక శాతం మేర లాభపడి రూ.315 వద్ద ముగిసింది.

తనిష్క్ 'ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్'

హైదరాబాద్: భారతీయ అతిపెద్ద జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్ 'ఫెస్టివల్ ఆఫ్ డైమండ్స్' వేడుకలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రారంభ ధర రూ.15 వేలతో అత్యాధునిక, సరికొత్త వజ్రాభరణాలను అందుబాటులోకి తెచ్చింది. కొనుగోలు విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. పాత బంగారంపై 100% ప్రస్తుత విలువతో కొత్త వజ్రాభరణాల కోసం మార్చుకోవచ్చు. దేశవ్యాప్తంగా అన్ని తనిష్క్ స్టోర్లు, ఆన్‌లైన్ ద్వారా 'ఫెస్టివల్ ఆఫ్ డెమండ్స్' ఆఫర్లు పొందవచ్చని కంపెనీ తెలిపింది.

జెట్‌సెట్‌గో భారీ డీల్...

- 280 హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డర్
- డీల్ విలువ సుమారు రూ.10,790 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ విమాన సర్వీసుల రంగంలో ఉన్న జెట్‌సెట్‌గో భారీ డీల్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా 280 హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకుంటోంది. హైదరాబాద్ బేగంపేటలో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 వేదికగా ఎలెక్ట్రా, ఏరో, హారిజన్ ఎయిర్‌క్రాఫ్ట్, ఓవర్‌ఎయిర్‌తో జెట్‌సెట్‌గో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. డీల్ విలువ సుమారు రూ.10,790 కోట్లు. హారిజన్ తయారీ 50 కెవోరైట్ ఎక్స్7 ఎలక్ట్రిక్ వెర్టికల్ టేక్–ఆఫ్ అండ్ ల్యాండింగ్ (ఈవీటోల్) ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకుంటున్నట్టు సమాచారం. మరో 50 ఎక్స్7 ఈవీటోల్స్ తీసుకునే అవకాశమూ ఉంది. నగరాల్లో ఎయిర్‌ట్యాక్సీలుగా, విమానాశ్రయం నుంచి ఇతర ప్రాంతాలకు, వివిధ ప్రదేశాలకు, నగరాల మధ్య, నగరంలో ఒకచోటు నుంచి మరోచోటుకు వెళ్లేందుకు హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను వినియోగించవచ్చని జెట్‌సెట్‌గో శుక్రవారం వెల్లడించింది. 'ఈ మూడు కంపెనీలతో భాగస్వామ్యం భారత్‌కు బ్లోన్ లిఫ్ట్, ఫ్యాన్ ఇన్ వింగ్ లిఫ్ట్ సిస్టమ్స్, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్, సూపర్–క్వైట్ ఆప్టిమల్ స్పీడ్ టిల్ట్ రోటర్స్ వంటి ప్రత్యేక సాంకేతికతలను పరిచయం చేస్తుంది' అని జెట్‌సెట్‌గో ఫౌండర్, సీఈవో కనిక టేక్రివాల్ తెలిపారు.

3 రోజుల వరుస నష్టాలకు చెక్



ముంబై: ఐటీ, ఫైనాన్స్, ఇంధన రంగాల షేర్లు రాణించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని రికవరీతో దేశీయ స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. సెన్సెక్స్ 496 పాయింట్లు పెరిగి 71,683 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 160 పాయింట్లు బలపడి 21,622 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాలతో మొదలయ్యాయి. ఇటీవల మార్కెట్ పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన అధిక వెయిటేజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా స్థిరమైన లాభాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 709 పాయింట్లు ఎగసి 71,896 వద్ద, నిఫ్టీ 209 పాయింట్లు దూసుకెళ్లి 21,670 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. మీడియా, ప్రైవేట్ రంగ బ్యాంకులు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అమెరికాలో టెక్నాలజీ షేర్ల ర్యాలీ, మెరుగైన రిటైల్ డేటా నమోదుతో పాటు జపాన్, బ్రిటన్ ద్రవ్యోల్బణంతగ్గడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల లాభాల్లో ట్రేడవుతున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు పతనం ఆగడం లేదు. బీఎస్ఈలో 1% నష్టపోయి రూ.1471 వద్ద స్థిరపడింది. వరుసగా 4 రోజుల్లో 10% క్షీణించింది.

అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం సోమవారం (22న)సెలవు ప్రకటించింది. దీంతో 22న ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు సెలవు ప్రకటించాయి. అదే రోజున మనీ మార్కెట్లకూ సెలవని ఆర్‌బీఐ పేర్కొంది.

2042 నాటికి మరో 2,500 విమానాలు

- భారత మార్కెట్‌పై బోయింగ్ అంచనా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత విమానయాన రంగానికి 2042 నాటికి మరో 2,500కు పైగా విమానాలు అవసరం అవుతాయని బోయింగ్ అంచనా వేస్తోంది. 'పెరుగుతున్న ప్రయాణికులు, సరుకు రవాణా డిమాండ్‌ను తీర్చడానికి దక్షిణాసియాకు చెందిన విమానయాన సంస్థలు రాబోయే రెండు దశాబ్దాలలో తమ విమానాల పరిమాణాన్ని నాలుగు రెట్లు పెంచుతాయని అంచనా. వృద్ధి, విమానాల భర్తీని పరిష్కరించడానికి ఈ కంపెనీలకు 2,705 కంటే ఎక్కువ కొత్త విమానాలు అవసరమవుతాయి. ఇందులో 92 శాతం భారత్ కైవసం చేసుకుంటుంది' అని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ డేరిన్ హస్ట్ శుక్రవారమిక్కడ మీడియాకు తెలిపారు. అంచనా వేసిన మొత్తం విమానాల్లో.. తక్కువ దూరం ప్రయాణించడానికి అనువైన చిన్న విమానాలు 2,300లకుపైగా, సుదూర ప్రాంతాల కోసం సుమారు 400 విమానాలు అవసరం అవుతాయని చెప్పారు. ఆసియాలో దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పరంగా మహమ్మారి ముందస్తు స్థాయికి పుంజుకున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ, పెద్ద మార్కెట్ భారత్ మాత్రమేనని ఆయన అన్నారు.

సాక్షి స్పోర్ట్స్



ఆస్ట్రేలియా 10 వికెట్లతో ఘనవిజయం

వెస్టిండీస్‌తో అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 73/6తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన వెస్టిండీస్ 35.2 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌటైంది. హాజల్‌వుడ్ (5/35) విండీస్‌ను దెబ్బ కొట్టాడు. అనంతరం 26 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 6.4 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ఉస్మాన్ ఖ్వాజా (9) రిటైర్ట్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. స్మిత్ (11 నాటౌట్; 2 ఫోర్లు), లబుషేన్ (1 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు. రెండు టెస్టుల సిరీస్‌లో ఆసీస్ 1–0తో ఆధిక్యంలో ఉంది. ఆఖరి టెస్టు 25 నుంచి బ్రిస్బేన్‌లో జరుగుతుంది.

నేడే బంగ్లాదేశ్‌తో భారత్ 'ఢీ'

దక్షిణాఫ్రికాలో జరుగుతున్న అండర్–19 వన్డే ప్రపంచకప్‌లో భాగంగా నేడు గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టుతో భారత్ తలపడుతుంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్–1 చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సింగిల్స్ చాంపియన్ శ్రీజ

డబ్ల్యూటీటీ ఫీడర్ టోర్నీలో టైటిల్ సొంతం • ఫైనల్లో ప్రపంచ 46వ ర్యాంకర్‌పై గెలుపు



టెక్సస్ (అమెరికా): రెండుసార్లు జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం ముగిసిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ టోర్నీలో 25 ఏళ్ల శ్రీజ మహిళల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో శ్రీజ 11–6, 18–16, 11–5తో ప్రపంచ 46వ ర్యాంకర్ లిలీ జాంగ్ (అమెరికా)పై గెలిచింది. విజేతగా నిలిచిన ప్రపంచ 94వ ర్యాంకర్ శ్రీజకు 650 డాలర్ల (రూ. 54 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 125 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. టైటిల్ గెలిచిన క్రమంలో శ్రీజ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 37వ ర్యాంకర్ అమీ వాంగ్ (అమెరికా)పై 11–9, 9–11, 11–1, 6–11, 11–9తో గెలుపొందడం విశేషం. 'చాలా సంతోషంగా ఉన్నా. నా కష్టానికి తగ్గ ఫలితం లభించింది. అంతర్జాతీయస్థాయిలో నాకిదే తొలి టైటిల్. నాకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారిణులను ఓడించి విజేతగా నిలిచినందుకు ఆనందంగా ఉంది' అని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీజ వ్యాఖ్యానించింది.

మెరిసిన తనయ్, తన్మయ్, మిలింద్

- 302 పరుగుల ఆధిక్యంలో హైదరాబాద్
- తొలి ఇన్నింగ్స్‌లో సిక్కిం 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో హైదరాబాద్ క్రికెట్ జట్టు తమ జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే నాగాలాండ్, మేఘాలయ జట్లపై ఇన్నింగ్స్ విజయాలు నమోదు చేసిన హైదరాబాద్ వరుసగా మూడో విజయంపై కన్నేసింది. సిక్కిం జట్టుతో శుక్రవారం మొదలైన మూడో మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 302 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సిక్కిం జట్టును హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (6/25), సీవీ మిలింద్ (4/30) హడలెత్తించారు. ఎడంచేతి వాటం స్పిన్నర్ తనయ్, మీడియం పేసర్ మిలింద్ దెబ్బకు సిక్కిం తొలి ఇన్నింగ్స్‌లో 27.4 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 381 పరుగులు సాధించింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (125 బంతుల్లో 137; 11 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ చేయగా... రాహుల్ సింగ్ గహ్లోత్ (64 బంతుల్లో 83; 10 ఫోర్లు, 5 సిక్సర్లు), రోహిత్ రాయుడు (111 బంతుల్లో 75; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. తన్మయ్, రాహుల్ తొలి వికెట్‌కు 18 ఓవర్లలో 132 పరుగులు జోడించడం విశేషం. తన్మయ్, రోహిత్ రాయుడు రెండో వికెట్‌కు 138 పరుగులు జత చేశారు. ప్రస్తుతం కెప్టెన్ తిలక్ వర్మ (66 బంతుల్లో 70 బ్యాటింగ్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), చందన్ సహని (8 బ్యాటింగ్; 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.



తన్మయ్ అగర్వాల్



తనయ్ త్యాగరాజన్



సీవీ మిలింద్

ఆంధ్ర 188 ఆలౌట్

దిబ్రూగఢ్: అస్సాం జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 72.1 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. 70 పరుగులకే 6 వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడిన ఆంధ్ర జట్టును షోయబ్ మొహమ్మద్ ఖాన్ (63; 3 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (49; 4 ఫోర్లు) ఏడో వికెట్‌కు 113 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఆంధ్ర జట్టు చివరి 4 వికెట్లను ఐదు పరుగుల తేడాలో కోల్పోయింది. అస్సాం బౌలర్లలో రాహుల్ సింగ్ (6/46), ముక్తార్ (2/45), ఆకాశ్ సేన్‌గుప్తా (2/37) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది.

మహిళల హాకీ మనోవేదన!

- పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేకపోయిన భారత జట్టు
- జపాన్ చేతిలో 0–1తో పరాజయం
- 9 పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసిన టీమిండియా

సొంతగడ్డపై అర్హత టోర్నీ... 8 జట్లలో టాప్–3లో నిలిస్తే సరిపోయే సులువైన ఫార్మాట్... ప్రత్యర్థి బలహీనమైన జపాన్... ఆ టీమ్‌పై గత ఐదు మ్యాచ్‌లలో వరుసగా గెలిచిన రికార్డు... క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు ... కానీ ఒక్క దానినీ గోల్‌గా మలచలేని వైఫల్యం... వెరసి వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని భారత మహిళల హాకీ జట్టు కోల్పోయింది... గత టోక్యో ఒలింపిక్స్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో నాలుగో స్థానంలో నిలిచి ఆశలు రేపిన జట్టు ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత కాలేకపోయింది.



రాంచీ: భారత మహిళల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్ అవకాశాలు గల్లంతయ్యాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో కనీసం మూడో స్థానంలో నిలిస్తేనే ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉండగా, భారత్ దానిని కోల్పోయింది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో జపాన్ చేతిలో 0–1 గోల్ తేడాతో ఓటమి పాలైంది. జపాన్ తరఫున 6వ నిమిషంలో కానా ఉరాటా పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించింది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా మన జట్టు స్కోరును సమం చేయలేకపోయింది. శుక్రవారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో జర్మనీ 2–0తో అమెరికాను ఓడించింది. టాప్–3లో నిలువడం ద్వారా జర్మనీ, అమెరికా, జపాన్ జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి.

సమష్టి వైఫల్యం...

జపాన్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. రెండో నిమిషంలోనే గోల్ చేసేందుకు చేరువగా వచ్చినా భారత కీపర్ సవిత అడ్డుకోగలిగింది. అయితే మరో నాలుగు నిమిషాల వ్యవధిలోనే జపాన్‌కు రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చాయి. మొదటిసారి విఫలమైనా... రెండో సారి సవిత అడ్డంకిని దాటడంలో జపాన్ సఫలమైంది. ఆ తర్వాతి నుంచి జపాన్ తమ ఏకైక గోల్‌ను నిలబెట్టుకునేందుకు డిఫెన్స్‌పై బాగా దృష్టి పెట్టింది. దీనిని ఛేదించేందుకు భారత ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో వరుసగా పెనాల్టీలను మన జట్టు వృథా చేసుకుంది. 12వ నిమిషంలో మోనిక అందించిన పాస్‌తో లాల్‌రెమిసియామి చేసిన ప్రయత్నంలో బంతి గోల్‌పోస్ట్‌పైనుంచి వెళ్లిపోయింది. రెండో క్వార్టర్‌లో రెండు పెనాల్టీ అవకాశాలను దీపిక గోల్‌గా మలచలేకపోయింది. ఆపై ఒత్తిడిని లోనైన ప్లేయర్లు పాస్‌లు ఇవ్వడం మానేసి ఆశ్చర్యకరంగా 30 గజాల సర్కిల్ నుంచే బంతిని బలంగా బాదే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత వచ్చిన పెనాల్టీలను ఉదిత వృథా చేసింది. చివరి 11 నిమిషాల్లో కూడా భారత్‌కు 3 పెనాల్టీలు దక్కగా ఈసారి కూడా దీపిక, ఉదిత చేతులెత్తేశారు. ఆట ముగియడానికి కొద్దిసేపు ముందు జపాన్ పటిష్ట డిఫెన్స్‌ను ఛేదించి సలీమా టెటె గోల్‌పోస్ట్ వైపు దూసుకుపోయినా... ఆమె కొట్టిన షాట్ పోస్ట్‌కు దూరంగా వెళ్లిపోయింది.

పని చేయని వ్యూహాలు...

టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు అసిస్టెంట్ కోచ్‌గా పని చేసిన నెదర్లాండ్స్ మాజీ ప్లేయర్ జేన్‌కే స్కాప్‌మన్ ఇప్పుడు టీమ్ హెడ్ కోచ్‌గా ఉంది. సీనియర్లను పక్కన పెట్టి చాలా వరకు యువ క్రీడాకారిణులతోనే ఫలితాలు రాబట్టేందుకు ఆమె చేసిన ప్రయత్నం ఫలితమివ్వలేదు. రెగ్యులర్ డ్రాగ్‌ఫ్లికర్ ఒక్కరూ లేకుండా ఫార్వర్డ్‌లను పెనాల్టీ గోల్ కోసం నమ్ముకోవడం పెద్ద తప్పు. ఈ టోర్నీలో జర్మనీ మినహా ర్యాంకింగ్‌పరంగా మిగతా జట్లన్నీ భారత్ కంటే బలహీనమైనవే. మనల్ని ఓడించిన జపాన్ జట్టుకు భారత మాజీ ఆటగాడు జూడ్ మెనెజెస్ హెడ్ కోచ్ కావడం విశేషం.

సబలెంకా జోరు



- సురెంకోపై 6–0, 6–0తో ఘనవిజయం
- ప్రిక్వార్టర్ ఫైనల్లోకి డిఫెండింగ్ చాంపియన్

మెల్‌బోర్న్: టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా ఆ దిశగా మరో అడుగు వేసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ సబలెంకా విశ్వరూపం ప్రదర్శించింది. ప్రపంచ 33వ ర్యాంకర్, 28వ సీడ్ లెసియా సురెంకో (ఉక్రెయిన్)తో జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–0తో ఘనవిజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కేవలం 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తన ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయని సబలెంకా 16 విన్నర్స్ కొట్టి ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేయడం విశేషం. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ సినెర్ (ఇటలీ), ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా), ఏడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–2, 6–4తో జాన్ మిల్మన్–ఎడ్వర్డ్ వింటర్ (ఆస్ట్రేలియా) జోడీపై గెలిచి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)–విక్టర్ కార్నియా (రొమేనియా) జంట 6–3, 6–4తో అర్నాల్డీ–పెల్లెగ్రినో (ఇటలీ) జోడీపై నెగ్గి రెండో రౌండ్‌కు చేరుకుంది.

సెమీస్‌లో ప్రణయ్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత నంబర్‌వన్ ప్రణయ్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 77 నిమిషాల్లో 21–11, 17–21, 21–18తో జు వె వాంగ్ (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ఆరో సీడ్ షి యు కి (చైనా)తో ప్రణయ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్ 2–5తో వెనుకంజలో ఉన్నాడు.

తెలుగు టైటాన్స్ ఓటమి

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం హైదరాబాద్ అంచె పోటీలు మొదలయ్యాయి. సొంతగడ్డపై తెలుగు టైటాన్స్ జట్టు 26–42 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్ చేతిలో ఓడిపోయింది. ఈ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టుకిది 12వ పరాజయం కావడం గమనార్హం. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ ఏడు పాయింట్లు స్కోరు చేశాడు. బెంగళూరు జట్టు తరఫున సుర్జీత్ ఏడు పాయింట్లు, వికాశ్ ఆరు పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 34–31తో యూపీ యోధాస్‌ను ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో యు ముంబా; తెలుగు టైటాన్స్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.



పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	14	10	2	2	58
పుణేరి పల్టన్	12	10	2	0	52
దబంగ్ ఢిల్లీ	13	7	4	2	44
గుజరాత్ జెయింట్స్	13	8	5	0	44
హరియాణా స్టీలర్స్	13	7	5	1	39
బెంగాల్ వారియర్స్	13	6	5	2	38
పట్నా పైరేట్స్	14	6	7	1	37
బెంగళూరు బుల్స్	14	6	8	0	37
యు ముంబా	12	6	5	1	36
తమిళ్ తలైవాస్	13	4	9	0	25
యూపీ యోధాస్	14	3	10	1	23
తెలుగు టైటాన్స్	13	1	12	0	10

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు



చాలా మంది కాలి చీలమండల ప్రాంతంలో నొప్పితో బాధపడుతుంటారు. దీనివల్ల నడవటం కూడా ఇబ్బందికరంగా మారుతుంది. ఈ నొప్పి రాకుండా వివిధ రకాల ఔషధాలు తీసుకుంటూ ఉంటారు. అయితే మందు ప్రభావం తగ్గిన వెంటనే, నేనున్నానంటూ మళ్లీ నొప్పి మొదలవుతుంది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని ఇంటి నివారణ చిట్కాలు సహాయంతో పాదాల నొప్పి నుంచి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. అవేంటో తెలుసుకుందాం.

నొప్పికి మడమ తిప్పనక్కరలేదు!

మడమల నొప్పులు ఏ సీజన్‌లో అయినా రావచ్చు కానీ ముఖ్యంగా చలికాలంలో ఈ సమస్య మరింత తీవ్రతరమౌతుంది. ఈ నొప్పులకు కారణాలు అనేకం. వాటిలో బరువు పెరగడం, ఎక్కువసేపు నిలబడటం, ఎత్తు మడమల బూట్లు లేదా చెప్పులు ధరించడం, శరీరంలో కాల్షియం లోపించటం వంటివి ముఖ్య కారణాలు.



లవంగ నూనెతో మసాజ్

మడమ నొప్పి నుంచి ఉపశమనం కోసం నొప్పి ఉన్న ప్రాంతంలో లవంగ నూనెతో సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. కండరాలకు ఉపశమనం కలుగుతుంది. పాదాలలో ఏదైనా నొప్పి అనిపిస్తే లవంగ నూనెతో మసాజ్ చేయటం ద్వారా మంచి ఫలితం ఉంటుంది.

రాక్‌సాల్ట్

మడమ నొప్పి నుంచిఉపశమనం పొందడానికి రాతి ఉప్పును ఉపయోగించవచ్చు. ముందుగా ఒక పాత్రలో నీటిని వేడి చేసి, దానిలో రెండు మూడు చెంచాల రాక్ సాల్ట్ వేయండి. ఆ తర్వాత, ఈ నీటిలో పాదాలను 10–15 నిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల మడమ నొప్పి, వాపు ఉపశమిస్తాయి.





అల్లం

మడమ నొప్పి నుంచి ఉపశమనం కలిగించేందుకు ఆహారంలో అల్లాన్ని చేర్చుకోవటం మంచిది. దీనికిగాను ముందుగా రెండు కప్పుల నీళ్లలో అల్లం వేయాలి. తరువాత దానిని మరగనివ్వాలి. నీరు సగానికి తగ్గిన తర్వాత అందులో మూడు చుక్కల నిమ్మ రసం, ఒక చెంచా తేనె వేసి సేవించడం వల్ల వల్ల చీల మండల నొప్పి నుంచి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు.

పసుపు

మడమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి పసుపు సహాయపడుతుంది. ఇది వ్యాధి నిరోధక లక్షణాలను కలిగి ఉండి వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దీనికిగాను పసుపునీళ్లలో కొద్దిగా తేనె కలుపుకుని తాగాలి. అలాగే పసుపు పాలు తీసుకోవచ్చు. దీనిని సేవించటం వల్ల నొప్పి, వాపు తగ్గుతాయి.







ఆపిల్ సైడర్ వెనిగర్

మడమల నొప్పి, వాపు వంటి సమస్యలు ఉంటే, ఆపిల్ సైడర్ వెనిగర్ బాగా ఉపకరిస్తుంది. కాసినిని వేడినీళ్లలో కొన్ని చుక్కల ఆపిల్ సైడర్ వెనిగర్ కలపాలి. ఈ నీటితో పాదాలను మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది.

చేప

ఆహారంలో చేపలను చేర్చుకోవడం ద్వారా నొప్పి, మడమల వాపు నుండి ఉపశమనం పొందవచ్చు. ఇందులో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు ఉన్నాయి. ఇవి నొప్పి, వాపును తగ్గించడమే కాకుండా, ఎముకలను బలోపేతం చేస్తాయి.

ఐస్ క్యూబ్స్

మడమల నొప్పి సమస్య నుండి బయటపడటానికి నొప్పి ఉన్న ప్రాంతంలో రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు సార్లు ఐస్ క్యూబ్‌లు ఉంచాలి. ఐస్ గడ్డను నేరుగా కాకుండా ఒక గుడ్డలో ఉంచి నొప్పి ఉన్న ప్రదేశంలో సున్నితంగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది.



కారానికి గారం చేయండి



రెగ్యులర్‌గా మనం వండే వంటల్లో కారం రుచి కోసం పచ్చి మిరపకాయలు వాడతాం. అయితే ఇవి రుచిని అందించడంతో పాటు ప్రమాదకర వ్యాధుల నుండి కాపాడతాయని మీకు తెలుసా?

- పచ్చిమిరపలో ఎ,సి బి6 విటమిన్లతో పాటు ఇనుము, రాగి, పొటాషియం తక్కువ మొత్తంలో ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి. పచ్చిమిరపలోని క్యాప్సైసిన్ అనే పదార్థం శ్లేష్మ పొరలపై ప్రభావం చూపిస్తుంది. దీంతో అది సులువుగా బయటకు వచ్చేస్తుంది. సైనస్, జలుబుకి పచ్చిమిరప మంచి సహాయకారిగా ఉపయోగపడుతుంది.
- పచ్చిమిరప రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది. కంటి ఆరోగ్యాన్ని, చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పచ్చిమిరపలో విటమిన్ సి ఎక్కువగా ఉండటం వల్ల కోతలు, గాయాలు వంటి వాటిని త్వరగా నయం చేస్తుంది. గుండె జబ్బులు, అల్సర్లు కూడా పచ్చిమిరప తీసుకోవడం వల్ల నయమవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ చేయడంలో సమర్థంగా పనిచేస్తుంది. డయాబెటీస్‌తో బాధపడుతున్న వారు పచ్చి మిర్చితో చేసిన ఫుడ్ తీసుకోవడం మేలు చేస్తుంది.
- పచ్చిమిరపలో ఉండే విటమిన్ సి, ఇ శరీరంలో రక్తప్రసరణ పెంచడంలో సహాయపడతాయి. మొటిమల సమస్యలను కూడా నయం చేస్తుంది. ఇందులో అసలు క్యాలరీలు ఉండవు కాబట్టి బరువు తగ్గడంలో కూడా ఇది సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. చాలామందిలో మూడ్ స్వింగ్స్ సమస్య ఉంటుంది. పచ్చిమిరప మెదడులోని ఎండార్ఫిన్‌లను బయటకు పంపేందుకు ఉపయోగపడుతుంది. దీని కారణంగా మూడ్ స్వింగ్స్ నుండి బయటపడి సంతోషంగా ఉండగలుగుతారు.
- ముఖ్యంగా చలికాలంలో పచ్చిమిరపకాయలు తినడం వల్ల యాసిడ్ ఏర్పడకుండా నిరోధిస్తుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఎముకలు దంతాలు, కళ్లకు ఉపయోగకరంగా ఉంటుంది. కీళ్ల నొప్పులు నివారించడంలో పచ్చి మిరపకాయలు ఎంతగానో సహాయపడతాయి. సో.. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలున్న పచ్చి మిరపకాయలను మీరు తినే ఆహారంలో ఎక్కువగా చేర్చుకోండి.

కొంతమందిని చూస్తే ఎప్పుడూ ఏ తాళం చెవో, పెన్ను రీఫిలో, పొడవుగా చుట్టిన కాగితాన్నో, ఏవీ దొరక్కపోతే చేతివేళ్లతోనో చెవిలో సంగీతం పాడిస్తుంటారు. ఈ చికాకంతా ఎందుకని చాలామంది స్నానం చేయగానే వీలైనంత లోతుగా చెవిని శుభ్రం చేస్తుంటారు. కానీ బయటికి కనిపించే చెవి కాకుండా లోపలి వైపు శుభ్రం చేయాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు. ఇంతకీ చెవి ఎలా శుభ్రం చేయాలో చూద్దాం...

● ఇయర్ వాక్స్ నష్టమా? లాభమా?



● కాటన్ బడ్ పెట్టడం వల్ల అది ఇయర్ వాక్స్‌ని చెవి లోపలికి మరింతగా నెట్టి వేస్తుంది ● అంతే కాదు, చెవిలో పెట్టిన బడ్ కర్ణభేరికి తగలవచ్చు. ఇది మరింత ప్రమాదకారి ● దీని వల్ల వినికిడి శక్తి దెబ్బ తింటుంది ● నిజానికి ఇయర్ వాక్స్ వల్ల చెవులకు లాభమేగానీ నష్టం లేదు ● బయటినుంచి వేరే పదార్థాలు, క్రిముల వంటివి చెవి లోపలికి వెళ్లకుండా ఇది రక్షిస్తుంది ● శిలీంధ్రాలు లేదా ఫంగస్ ఏర్పడకుండా నివారిస్తుంది ● చెవిలోని నాళం పొడిబారకుండా ఉండేందుకు దోహదపడుతుంది.

మరి ఇయర్ వాక్స్‌ని ఏం చేయాలి?

దాని జోలికి వెళ్లకుండా ఉండడమే సరి. వాక్స్ తీయడం కోసం చెవి లోపల ఇయర్ బడ్ మాత్రమే కాదు. ఇంకేమీ పెట్టక్కరలేదు. ఎందుకంటే, చెవి తనను తానే శుభ్రం చేసుకోగలుగుతుంది.

ఒకవేళ చెవిలో శబ్దాలు రావడం, నొప్పి లాంటి సమస్యలు కనిపించినా, వినికిడిలో తేడా అనిపించినా వెంటనే ఈఎన్‌టీ నిపుణుని కలవండి.

మీకు తెలుసా?

నిద్ర... నిజాలు



రోజుకు మీరు ఎన్ని గంటలు నిద్రపోతున్నారు? పగలు ఎన్ని గంటలు? రాత్రి ఎన్ని గంటలు? కనీసం ఆరు గంటలైనా నిద్ర పోతున్నారా? లేదంటే.. మీ హెల్త్ డేంజర్ జోన్‌లో ఉన్నట్టే. అవును. ఇది నిజమేనని ఓ అధ్యయనం వెల్లడించింది. రోజు మొత్తంలో కనీసం ఆరు గంటలైనా నిద్రపోని వారిలో గుండెకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందట. నిద్రలేమి కారణంగా తీవ్ర ఒత్తిడి పెరగడమే కాకుండా అది శరీరంలోని రక్తప్రసరణపై ప్రభావం చూపిస్తుందని తెలిపింది. తద్వారా రక్తనాళాల్లో ఒత్తిడి ఏర్పడి అది మెల్లగా గుండెపై ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. ముఖ్యంగా రాత్రివేళల్లో నిద్ర మంచిదని అధ్యయనంలో రుజువైంది. రాత్రివేళల్లో ఆరు గంటలు కంటే తక్కువ సమయం నిద్రించినవారిలో 27 శాతం మేర గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నట్టు అధ్యయనవేత్తలు గుర్తించారు. అందుకే ఎంత ఒత్తిడి ఉన్నా.. ఎన్ని పనులు ఉన్నా.. నిద్రించేందుకు సమయాన్ని కేటాయిస్తే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చునని పరిశోధకులు సూచిస్తున్నారు.

ప్రామిస్!

‘మట్కా’లో వరుణ్ తేజ్ ప్రామిస్ చేశారు. ఎవరికి? ఎందుకు? అనేది తెలియాలంటే మాత్రం మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ ‘మట్కా’. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు. కరుణ కుమార్ దర్శకత్వంలో డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం (జనవరి 19) వరుణ్ తేజ్ బర్త్ డే. ఈ సందర్భంగా ‘మట్కా’ నుంచి ఓపెనింగ్ బ్రాకెట్ అంటూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. ఇందులో వరుణ్ తేజ్ ‘ప్రామిస్’ అంటూ టెలిఫోన్‌లో మాట్లాడటం కనిపిస్తుంటుంది. యావత్ దేశాన్ని కదిలించిన వాస్తవ ఘటన ఆధారంగా ‘మట్కా’ కథను రూపొందించారు. 24 ఏళ్ల టైమ్ పీరియడ్‌లో (1958–1982) సాగే ఈ కథలో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్‌లలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ‘‘ఓ గ్యాంబ్లింగ్ మాఫియా అధిపతి నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది (ఈ పాత్ర వరుణ్ తేజ్‌ది అని ఊహించవచ్చు). ఈ చిత్రంలో ఓ గ్యాంగ్‌స్టర్ పాత్రలో నవీన్ చంద్ర, పోలీసాఫీసర్ పాత్రలో పి. రవిశంకర్ కనిపిస్తారు. కథ రీత్యా 1950, 1980 నాటి పరిస్థితులను రీ క్రియేట్ చేయడంలో దర్శకులు కరుణ కుమార్ విజయం సాధించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, ‘సత్యం’ రాజేశ్, రవిశంకర్, అజయ్ ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



● వరుణ్ తేజ్



నయనతార కెరీర్‌లో 75వ చిత్రం ‘అన్నపూరణి’. నీలేశ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా గత ఏడాది డిసెంబరు 1న థియేటర్స్‌లో విడుదలైంది. ఆ తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభమైంది. అయితే ఈ సినిమా హిందువుల మనోభావాలను కించపరచేలా ఉందనే వివాదం రేగింది. దాంతో ‘అన్నపూరణి’ ఓటీటీ స్ట్రీమింగ్ ఆగిపోయింది. ఈ విషయంపై తాజాగా నయనతార స్పందించి, ఓ లేఖను విడుదల చేశారు. ‘‘బరువెక్కిన హృదయంతో ఈ లేఖ రాశాను. కేవలం కమర్షియల్ అంశాలనే కాదు... సంకల్ప బలంతో ఏదైనా సాధించవచ్చు అనే సానుకూల ఆలోచనతోనే ‘అన్నపూరణి’ సినిమా తీశాం. అయితే మాకు తెలియకుండానే కొందరి మనసులను

గాయపరిచి ఉంటే క్షమించండి

- నయనతార

మేం గాయపరిచామని అర్థమైంది. కానీ ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం మా టీమ్‌కు లేదు. సెన్సార్ సర్టిఫికెట్‌తో ఓటీటీలో స్ట్రీమింగ్ కాబడిన మా మూవీని అక్కడ్నుంచి తొలగించడం అనేది ఆశ్చర్యపరిచింది. నేను భగవంతునిపై నమ్మకంతో ఎన్నో దేవాలయాలకు వెళ్తుంటాను. అలాంటి నేను ఉద్దేశపూర్వకంగా ఎవరి మనసులను గాయపరచాలని అనుకోను. ఏది ఏమైనా మీ మనోభావాలను గాయపరచి ఉంటే క్షమించండి.. జై శ్రీరామ్’’ అని ఆ లేఖలో నయనతార పేర్కొన్నారు.

జర్మనీకి జర్నీ



● మహేశ్‌బాబు

జర్మనీ వెళ్లారు మహేశ్‌బాబు. దర్శకుడు రాజమౌళి, హీరో మహేశ్ బాబు కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రధానంగా ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను ఈపాటికే మొదలు పెట్టారు రాజమౌళి. తాజాగా ఈ పనులు మరింత ఊపందుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో తన లుక్, మేకోవర్ గురించిన సాంకేతికపరమైన విషయాల గురించిన పనుల కోసం మహేశ్‌బాబు జర్మనీ వెళ్లారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను విజయేంద్రప్రసాద్ దాదాపు పూర్తి చేసేశారని, వేసవిలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.

నెగటివ్ రోల్స్ చేయాలని ఉంది

- నటుడు నరేశ్ వీకే



‘‘మంచి నటుడు కావాలని పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. 50 ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకోవడం ప్రేక్షకుల ప్రేమ, అభిమానాల వల్లే సాధ్యమైంది. నా జీవితాంతం చిత్ర పరిశ్రమకు సేవ చేస్తాను’’ అని నటుడు డా. నరేశ్ వీకే అన్నారు. నటుడిగా ఆయన ప్రయాణం మొదలై 50 ఏళ్లు పూర్తయ్యాయి. నేడు (జనవరి 20) నరేశ్ పుట్టినరోజు. ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని శుక్రవారం నరేశ్ విలేకరులతో మాట్లాడుతూ– ‘‘నా తొమ్మిదో ఏట ‘పండంటి కాపురం’ (1972)తో బాలనటుడిగా అడుగు పెట్టాను. మా అమ్మ విజయ నిర్మల, జంధ్యాల, కె. విశ్వనాథ్, బాపు, రమణ, ఈవీవీ సత్యనారాయణ, వంశీ, రేలంగి నరసింహారావు వంటి మహనీయులతో సినిమాలు చేసే అదృష్టం దక్కింది. రాజకీయాలు, ఆ తర్వాత సమాజ సేవ వల్ల దాదాపు పదేళ్లు పరిశ్రమకి దూరమయ్యాను. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి, బిజీగా ఉన్నాను. నాకు నెగటివ్ రోల్స్ చేయాలని ఉంది. ఇక ఏ ప్రభుత్వమైనా సినీ పరిశ్రమకు తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలి. నంది అవార్డులని పరిశ్రమ గౌరవంగా చూస్తుంది. కానీ ఇప్పుడా అవార్డులని ఇవ్వడం లేదు.. మళ్లీ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మా అబ్బాయి నవీన్‌కి దర్శకుడిగా మంచి భవిష్యత్ ఉంటుందని నమ్ముతున్నాను. మా విజయ కృష్ణ గ్రీన్ స్టూడియోస్‌ని మోడ్రన్ స్టూడియోగా చేస్తున్నాం’’ అన్నారు.

చూడు నాన్నా.. ఏమిటీ ఇంతటీ ప్రేమ!

ఆంధ్రప్రదేశ్‌లో 2009 నుంచి 2019 వరకు జరిగిన రాజకీయ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం ‘యాత్ర 2’. 2019లో విడుదలై, హిట్‌గా నిలిచిన ‘యాత్ర’ చిత్రానికి సీక్వెల్‌గా మహి వి. రాఘవ్ దర్శకత్వంలో ‘యాత్ర 2’ రూపొందింది. ఇందులో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో నటుడు మమ్ముట్టి, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటించారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మించిన ‘యాత్ర 2’ ఫిబ్రవరి 8న విడుదల కానుంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘చూడు నాన్నా..’ అంటూ సాగే లిరికల్ వీడియోను విడుదల చేశారు. ‘చూడు నాన్నా.. చూస్తున్నావా నాన్నా, నీడ లేని నేనా వీళ్ల ధీమా.. ఏమిటీ ఇంతటీ ప్రేమ...’ అంటూ భావోద్వేగంగా సాగే ఈ పాటకి భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ‘‘వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారు ప్రజానాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది’’ అని మేకర్స్ ప్రకటించారు.



● జీవా...

కావాలనే టార్గెట్ చేశారు

- నిర్మాత ఎస్. నాగవంశీ



‘‘గుంటూరు కారం’ చిత్రానికి మొదటి రోజు కొందరి నుంచి నెగటివ్ రివ్యూలు వచ్చినా మహేశ్ బాబుగారు మాత్రం రేపటి నుంచి ఈ సినిమా వసూళ్లు పెరుగుతాయని భరోసా ఇచ్చారు.. ఆయన అంచనా నిజమైంది. మా సినిమా మొదటి వారంలోనే రూ. 212 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు రాబట్టింది’’ అని నిర్మాత ఎస్. నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు, శ్రీలీల జంటగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘గుంటూరు కారం’. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. ఈ నేపథ్యంలో నిర్మాత ఎస్. నాగవంశీ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ– ‘‘గుంటూరు కారం’ని కొందరు కావాలని టార్గెట్ చేశారనే అభిప్రాయాలున్నాయి. ఈ సినిమా విడుదలైన రోజు కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులను గందరగోళానికి గురి చేసే ప్రయత్నం చేశారు. కానీ, కుటుంబ ప్రేక్షకులు, సాధారణ ప్రేక్షకులు సినిమాకి రావడంతో అదే రోజు సాయంత్రానికి టాక్ మారిపోయింది. ఇది ఇప్పటిదాకా సాధించిన వసూళ్లే చెబుతున్నాయి. ఇది మాస్ సినిమా అని అందరూ భావించారు. తల్లీకొడుకుల సెంటిమెంట్ బాగా కుదిరింది. కుటుంబ ప్రేక్షకులు మా సినిమాని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. అయినా జానర్‌ను బట్టి ఒక్కో సినిమా ఒక్కో ప్రాంతంలో ఎక్కువ వసూళ్లు రాబడుతుంది. కేవలం ఒక ఏరియా వసూళ్లను చూసి సినిమా ఫలితాన్ని నిర్ణయించలేం. మా సినిమా బయ్యర్లు కూడా సంతోషంగా ఉన్నారు’’ అన్నారు.

105.. ఓ ప్రయోగం

- హన్సిక



‘‘ముప్పై నాలుగు నిమిషాల షాట్‌ని ‘105 మినిట్స్’ సినిమా కోసం సింగిల్ టేక్‌లో చేయడం అనేది నాకు ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్. దాదాపు ఎనిమిది రోజుల రిహార్సల్స్ తర్వాత ఈ షాట్ చేశాం. ఇలాంటి ప్రయోగాలు ఈ సినిమాలో చాలా ఉన్నాయి’’ అని హన్సిక అన్నారు. హన్సిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘105 మినిట్స్’. రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హన్సిక మాట్లాడుతూ – ‘‘పూర్తి స్థాయి ప్రయోగాత్మక చిత్రం ఇది. ప్రేక్షకులు థియేటర్స్‌లో మా సినిమాను చూసి, సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా’’ అన్నారు. ‘‘సింగిల్ సిట్టింగ్‌లోనే హన్సికగారు ఈ సినిమా కథ ఒప్పుకున్నారు’’ అన్నారు రాజు దుస్సా. ‘‘ఈ సినిమాను ముందు ప్రపంచవ్యాప్తంగా తెలుగులో విడుదల చేస్తాం. ఆ తర్వాత ఇతర భాషల్లో విడుదల చేస్తాం’’ అన్నారు సహనిర్మాత సుమన్.

● మాధవన్





● జ్యోతిక



● అజయ్ దేవగన్

సైతాన్ ఎవరు?

మార్చిలో థియేటర్స్‌కు వస్తున్నాడు సైతాన్. అజయ్ దేవగన్, మాధవన్, జ్యోతిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ ‘సైతాన్’. అయితే ఈ చిత్రంలో సైతాన్ ఎవరనేది యూనిట్ బయటపెట్టలేదు. వికాశ్ బహల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేసి, సినిమాను మార్చి 8న రిలీజ్ చేయనున్నట్లుగా యూనిట్ ప్రకటించింది. అజయ్ దేవగన్, జ్యోతి దేశ్ పాండే, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.